మంగళవారం 18-6-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 275



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



గట్టెక్కిన బంగ్లాదేశ్

నేపాల్‌పై విజయం.. టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 దశకు అర్హత - 12లో



క్రెటా ఈవీ వచ్చేస్తోంది

వచ్చే ఏడాది మార్చిలోగా భారత్ రోడ్లపై పరుగులు తీయనున్న కారు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కశ్మీర్ బీజేపీ ఇన్‌చార్జ్‌గా కిషన్‌రెడ్డి

త్వరలో ఎన్నికలు జరగనున్న జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ రాష్ట్రాలకు బీజేపీ ఇన్‌చార్జ్‌లను నియమించింది.

వివరాలు 6లో ▸



ఐదుగురు మావోయిస్టులు మృతి

జార్ఖండ్ రాష్ట్రం పశ్చిమ సింహ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు.

వివరాలు 6లో ▸



వయనాడ్ నుంచి ప్రియాంక

వయనాడ్ ఎంపీ సీటును వదులుకుంటున్నట్లు చెప్పిన రాహుల్ గాంధీ అక్కడి నుంచి తన సోదరి పోటీ చేస్తుందన్నారు.

వివరాలు 6లో ▸



నేడు ఉత్తర కొరియాకు పుతిన్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ రెండు రోజుల పర్యటన కోసం మంగళవారం ఉత్తర కొరియాకు వెళ్లనున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

కొండెక్కిన కూరగాయలు



రాష్ట్రంలో కూరగాయల ధరలు కొండెక్కాయి. కేవలం నెల వ్యవధిలోనే టమాటా ధర మూడు రెట్లు పెరగ్గా.. మిగిలిన వాటి ధరలు 30-50 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం టమాటా కిలో రూ.65కు పైగా పలుకుతుండగా.. మిర్చి ధర సెంచరీ వైపు పరుగులు తీస్తోంది.

వివరాలు 14లో ▸

నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు



ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేయనున్నారు. తొలుత ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలను ప్రకటించనున్నారు. 26న ప్రథమ సంవత్సరం ఫలితాలను ప్రకటిస్తారు.

వివరాలు 14లో ▸

వైఎస్సార్‌సీపీ వర్గీయుల వెలి



టీడీపీ కార్యకర్తల అరాచకాలు హద్దు మీరుతున్నాయి. శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి స్వగ్రామం వేల్పనూరులో వైఎస్సార్‌సీపీ వర్గీయులను సామాజికంగా వెలివేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున ఏజెంట్లుగా వ్యవహరించిన వారి భూములను ఎవరూ కౌలుకు తీసుకోవడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు.

వివరాలు 10లో ▸

బొండా.. నీది అధికార మదం



విజయవాడ సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా అధికార మదంతో తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని వైఎస్సార్‌సీపీ దళిత నేత జగదీశ్ మండిపడ్డారు. శిరోముండనం చేయించుకుని నిరసన తెలిపారు.

వివరాలు 5లో ▸



ముందే చెబుతున్నా.. సార్ దగ్గర ఏ పనైనా 'నీట్'గా ఉండాలి!

జీవనాడి సాక్షిగా

నిజాలు గోదాట్లోకి

పోలవరంపై పచ్చి అబద్ధాలు వల్లించిన సీఎం చంద్రబాబు

పునాది స్థాయిలో బాబు వదిలేసిన స్పిల్‌వేను 48 గేట్లతో సహా పూర్తిచేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం

- స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్ పూర్తి చేసి 2021 జూన్ 11న వరద మళ్లింపు.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో ఇరువైపులా ఖాళీలు వదిలేసి పనులు ఆపేసిన చంద్రబాబు
- డయాఫ్రమ్‌వాల్ దెబ్బతినడానికి బాబు నిర్వాకాలే కారణం
- అదే అంశాన్ని తేల్చిన ఐఐటీ-హైదరాబాద్, ఎన్‌హెచ్‌పీసీ నివేదికలు
- బాబు ఆ చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే పోలవరం ఎప్పుడో పూర్తయ్యేది.. డయాఫ్రమ్ వాల్‌పై తేల్చితే ప్రాజెక్టు పూర్తి చేస్తామంటూ 2022 నుంచి కేంద్రాన్ని కోరుతూ వచ్చిన జగన్ సర్కార్
- 2013-14 ధరల ప్రకారం రూ.20,396 కోట్లకే పోలవరం పూర్తి చేస్తామని బాబు ఒప్పందం.. తాజా ధరల ప్రకారం నిధులిచ్చి ప్రాజెక్టు పూర్తికి సహకరించాలని 2019 నుంచి కేంద్రాన్ని కోరిన జగన్
- తొలిదశ పూర్తికి రూ.12,157 కోట్లు మంజూరుకు ఈ ఏడాది మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు జల్ శక్తి శాఖ ప్రతిపాదన.. అప్పటికే బీజేపీతో జతకట్టిన బాబు.. రాజకీయంగా తమకు ఇబ్బంది తప్పదని అడ్డుపుల్ల
- ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్నందున కనీసం ఇప్పుడైనా ఆమోదముద్ర వేయించాలని సూచిస్తున్న సాగునీటి నిపుణులు

3లో



పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

పోల'వరం' మరో నాలుగేళ్లకే

అదీ అంతా సవ్యంగా జరిగితేనే పూర్తి: సీఎం చంద్రబాబు

రూ.13,683 కోట్లు ఖర్చు చేసి 72 శాతం పూర్తి చేశా

పనులు వేగంగా జరిగి ఉంటే 2020 నాటికి పూర్తయ్యేది

డయాఫ్రమ్ వాల్ నాలుగు చోట్ల దెబ్బతింది

మరమ్మతులకే రూ.447 కోట్లు ఖర్చవుతుంది

సమాంతరంగా కొత్తగా నిర్మిస్తే రూ.996 కోట్ల వ్యయం

3లో



పశ్చిమ బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టిన గూడ్స్ రైలు

పట్టాలు తప్పిన కాంచనజంగ కోచ్‌లు

9 మంది దుర్మరణం | 41 మందికి గాయాలు

పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న గూడ్స్ రైలు.. అదే ట్రాక్‌పై నిలిచి ఉన్న కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఎక్స్‌ప్రెస్ రైలులోని మూడు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో 9 మంది మరణించగా.. 41 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షల చొప్పున, స్వల్ప గాయాలైన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం అందజేస్తామని రైల్వే శాఖ ప్రకటించింది.

6లో



అద్భుత భవనాలపై 'అగ్లీ' ఏడుపు

- రూ. 700 కోట్లతో నాసిరకంగా తాత్కాలిక సచివాలయం నిర్మించిన టీడీపీ ప్రభుత్వం
- రుషికొండలో రూ.400 కోట్లతోనే ఐకానిక్ భవనాలు నిర్మించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలివి..
- శిథిలమైన హరిత రిసార్ట్స్ స్థానంలో నూతన భవనాల నిర్మాణం
- ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం
- 61 ఎకరాల్లో 9.88 ఎకరాల్లోనే నిర్మాణాలు.. 2021లోనే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సమగ్ర వివరాలిచ్చిన ప్రభుత్వం
- విశాఖ ఖ్యాతిని ఇనుమడించేలా, రాష్ట్రానికే తలమానికంగా భవనాలు
- ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా ఫైవ్ స్టార్ వసతులతో నిర్మాణం
- విశాఖ నుంచి పరిపాలనకు ఈ భవనాలు అనువైనవని తేల్చిన అధికారుల కమిటీ
- దీంతో సీఎం నివాసం, కార్యాలయానికి అనుకూలంగా కొన్ని మార్పులు
- అయినా సొంత భవనాలంటూ టీడీపీ నేతల గగ్గోలు

2లో

వర్షాలు.. వడగాడ్పులు!

- రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు
- ఉష్ణతాపానికి పశ్చిమ గాలులే కారణం
- స్తబ్దుగా నైరుతి రుతుపవనాలు
- 4 రోజుల్లో కదలిక వచ్చి, రాష్ట్రంలో మరింతగా విస్తరించే అవకాశాలు
- వచ్చే 2 రోజులు వానలతో పాటు ఉక్కపోత

14లో



కొబ్బరి ధర పతనం

మందగించిన ఎగుమతులు

పశ్చిమగోదావరి జిల్లా కొబ్బరికి తగ్గిన డిమాండ్

తమిళనాడులో అధిక దిగుబడులు ప్రభావం

జిల్లాలో 25 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు



భీమవరం: కొబ్బరి ధరలు కుదేలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి జిల్లాల్లో దిగుబడులు తగ్గడంతో పాటు తమిళనాడులో అధిక దిగుబడులు, అక్కడ కొబ్బరి కాయల నాణ్యత బాగుండటంతో ఇక్కడ నుంచి ఎగుమతులు మందగించాయి. జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు ఉండగా చేపలు, రొయ్యల చెరువు గట్లు, ఆర్‌అండ్‌బీ, పుంతరోడ్ల మార్జిన్లలో పెద్ద సంఖ్యలో కొబ్బరి చెట్లు ఉన్నాయి. రైతులతోపాటు వేలాది మంది దింపు, వలుపు, మోత కార్మికులు కొబ్బరి సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రైతులకు 1,000 పచ్చి కొబ్బరి కాయలు రూ.7 వేల, కురిడి కాయలకు రూ.12 వేల వరకు ధరలను వ్యాపారులు చెల్లిస్తున్నారు. జిల్లాలో వరి సాగు తర్వాత ఆదాయం ఇచ్చే పంటల్లో కొబ్బరి ప్రధానమైంది. ప్రధానంగా పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో కొబ్బరి వ్యాపారం, ఎగుమతులపై ఆధారపడి వేలాది మంది జీవిస్తున్నారు.

30 వేల మందికి ఉపాధి

గతంలో జిల్లా నుంచి మహారాష్ట్ర, రాజస్థాన్, ఒడిసా, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక తదితర రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి అయ్యేది. రోజుకు సుమారు 100 లారీల్లో రూ.30 లక్షల విలువైన పంట ఎగుమతులు ఉండేవి. దీంతో కొబ్బరి ఒలుపు, నాణ్యత పరిశీలన, ఎగుమతులు వంటి పనులపై ఆధారపడి సుమారు 30 వేల మంది కార్మికులు ఉపాధి పొందేవారు. అయితే జిల్లాలో కొబ్బరికి తెగుళ్ల ఆశించడంతో దిగుబడులు తగ్గాయి. గతంలో ఏటా పదిసార్లు కొబ్బరి దింపులు తీసే రైతులు ప్రస్తుతం ఆరేడు దింపులకే పరిమితమవుతున్నారు. అంతేగాకుండా కొబ్బరి దింపు, ఒలుపు వంటి ఖర్చులు కూడా పెరిగాయి. దీనికి తోడు తమిళనాడులో కొబ్బరి దిగుబడులు పెరగడం, వాటి నాణ్యత, సైజు బాగుండటంతో ఇక్కడ కొబ్బరికి గిరాకీ తగ్గి ధర పతనమైనట్టు వ్యాపారులు చెబుతున్నారు. రెండు నెలలుగా మూఢం కారణంగా శుభకార్యాలు, పండగలు లేకపోవడంతో స్థానికంగా వినియోగం కూడా తగ్గిందని చెబుతున్నారు. తమిళనాడు కొబ్బరి నాణ్యత బాగుండటంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు అటుగా మక్కువ చూపుతున్నారు. జిల్లా నుంచి ప్రస్తుతం ఎగుమతులు అంతగా లేకపోగా రానున్న రోజుల్లో మంచి ధర వస్తుందనే ఆశతో వ్యాపారులు కొబ్బరిని రైతుల నుంచి కొనుగోలు చేసి నిల్వచేస్తున్నారు.

దిగుబడులూ తగ్గాయి

కొబ్బరి దిగుబడులతో పాటు ధరలు కూడా తగ్గడంతో ఇబ్బంది పడుతున్నాం. గతంలో ఏటా 10 సార్లు కొబ్బరికాయల దింపులు తీస్తే ఇప్పుడు ఆరేడు దింపులకు పరిమితం కావాల్సి వస్తోంది. ధరలు తగ్గడంపాటు దింపు, ఒలుపు ఖర్చులు కూడా పెరిగాయి. దీంతో కొబ్బరి సాగుపై మక్కువ రైతుల్లో ఏటేటా సన్నగిల్లుతోంది.

– పంజా సురేష్, వేమవరం

ధర పెరుగుతుందనే ఆశతో..

తమిళనాడు కొబ్బరి నాణ్యత, సైజు బాగుండటంతో మన కొబ్బరికి జాతీయ మార్కెట్‌లో గిరాకీ తగ్గింది. దీంతో ఇక్కడ కొబ్బరి ధరలు కూడా తగ్గుతున్నాయి. కొబ్బరి దింపు, వలుపు, ఎగుమతులు ఖర్చులు పెరగడం ఇబ్బందికరంగా మారింది. రానున్న రోజుల్లో ధర పెరుగుతుందనే ఆశతో వ్యాపారులు కొబ్బరి నిల్వ చేస్తున్నారు.

– గంధం త్రినాథులు, కొబ్బరి వ్యాపారి, మేడపాడు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

ఎన్నికల అనంతరం యూపీలో మాదిరిగా రాష్ట్రంలో దాడులు

విధ్వంసం సృష్టిస్తున్న కూటమి నేతలు

పేద, బడుగు, బలహీన వర్గాలే లక్ష్యంగా దాడులతో చెలరేగిపోతున్నారు

ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులను ఖండించాలి

ఎన్నికల అనంతరం రాష్ట్రంలో మానవ హక్కుల హననంపై ప్రజా సంఘాల ధ్వజం.. గుంటూరులో రౌండ్ టేబుల్ సమావేశం

ఐదుగురు సభ్యులతో ఎన్నికల హింస వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటు

5లో

22న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

సాక్షి, అమరావతి: ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరినీ ఆహ్వానించారు. వీరితోపాటు ఎంపీలు మినహా పార్లమెంట్‌కు పోటీ చేసిన అభ్యర్థులను కూడా ఆహ్వానించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

క్లుప్తంగా...

రేపటి నుంచి కేంద్ర బృందం పర్యటన

అనంతపురం అగ్రికల్చర్: గత రబీ సీజన్‌లో నెలకొన్న కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం బుధవారం నుంచి రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ బృందంలో పది మంది ఉన్నతస్థాయి అధికారులు సభ్యులుగా ఉన్నారు. వీరు మూడు బృందాలుగా విడిపోయి గ్రేటర్ రాయలసీమ జిల్లాల్లో పర్యటించనున్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ, రైతు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ రితేష్‌చౌతాన్ నేతృత్వంలో డాక్టర్ కె.పొన్ను స్వామి, సునీల్ దుబేలతో కూడిన మొదటి బృందం శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో పర్యటించనుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ డైరెక్టర్ చిన్మయ్‌గోట్‌మెరె నేతృత్వంలో ఎ.పాండే, అరవింద్‌కుమార్‌లతో కూడిన రెండో బృందం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో, సెంట్రల్ వాటర్ వర్క్స్ శాఖ డైరెక్టర్ మన్నూజీ ఉపాధ్యాయ్ నేతృత్వంలో ఎస్‌సీ కశ్యప్, మదన్‌మోహన్, అనసూరాధ బట్నాలతో కూడిన మూడో బృందం ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పర్యటించనుంది.

ఏపీలో రీపోలింగ్ జరపాలి

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ (హైదరాబాద్) : ఏపీలో రీపోలింగ్ జరపాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగినట్లు సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో తప్పుడు పద్ధతిలో గెలిచిన ప్రభుత్వాన్ని రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత ఎన్నికల కమిషన్, సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలివ్వాలని కోరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం కృష్ణస్వరూప్ మీడియాతో మాట్లాడుతూ ఏపీలో ఓట్లన్నీ బీజేపీకి, టీడీపీకీ, జనసేనకు గంపగుత్తగా పడటం పట్ల విద్యావేత్తలు, మేధావులు, ఎన్నికల విశ్లేషకలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏపీలో దళిత బహుజన సంఖ్య గణనీయంగా ఉన్నా దళిత, బహుజనులు పోటీ చేసిన లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో సైతం వైఎస్సార్ సీపీకి అతి తక్కువ ఓట్లు వచ్చాయని.. దీన్నిబట్టి ఈవీఎంలు ట్యాంపరింగ్ జరిగినట్లు తెలుస్తుందన్నారు.

బాధ్యతలు చేపట్టిన పల్లా

సాక్షి, అమరావతి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉండవల్లి వెళ్లి సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. పార్టీకి ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని ఆయన పల్లాకు సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

అద్భుత భవనాలపై 'అగ్లీ' ఏడుపు

- రూ. 700 కోట్లతో నాసిరకంగా తాత్కాలిక సచివాలయం నిర్మించిన టీడీపీ ప్రభుత్వం
- రూ.400 కోట్లతోనే ఐకానిక్ భవనాలు నిర్మించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి చేయడం అనేది తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ ప్రభుత్వానికి చేతకాదు. విభజిత రాష్ట్రానికి 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ.. ఏ కార్యక్రమం చేపట్టినా దాన్ని సాగదీసి, స్వలాభం చూసుకోవడమే తప్ప, రాష్ట్రానికి చేసిన మంచి ఒక్కటీ లేదు. రాజధాని పేరుతో చేసిన విధ్వంసం, తాత్కాలిక సచివాలయాల పేరుతో నిర్మించిన నాసిరకం భవనాలు, పోలవరం ప్రాజెక్టులో తప్పులు.. ఇలా అన్నీ రాష్ట్రానికి తలవంపులు తెచ్చే పనులే. ఇప్పుడూ అదే చేస్తోంది టీడీపీ. రుషికొండపైన అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా, విశాఖ ఖ్యాతిని మరింతగా పెంచేలా అద్భుత భవనాలను నిర్మిస్తే, దానిపై వికృత రాజకీయం చేస్తోంది. ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ భవనాలను నిర్మిస్తే వాటిపై చేస్తున్న విష ప్రచారం ఆ పార్టీ సంస్కృతికి నిదర్శనం. తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు చేస్తున్న కపట నాటకం. రూ.700 కోట్లతో తమ ప్రభుత్వం నిర్మించిన తాత్కాలిక సచివాలయం చిన్న వర్షానికే లీకైపోయి, నీరంతా గదుల్లో ప్రవహించగా.. ఇప్పుడు కేవలం రూ. 400 కోట్లతో రుషికొండపై విశాఖకే కాక యావత్ రాష్ట్రానికే తలమానికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన ఈ ఐకానిక్ భవనాలను చూసి తల ఎక్కడ పెట్టుకోవాలో టీడీపీ అధినేతలకే తెలియడంలేదు. అందుకే ఈ అగ్లీ (చెత్త) ఏడుపు. విశాఖపట్నంలోని బీచ్‌కి ఆనుకొని ఉన్న రుషికొండపై రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన హరిత రిసార్ట్స్ భవనాలు చాలా కాలం క్రితం నిర్మించినవి. అవి శిథిలమై ప్రమాదకరంగా మారడంతో వాటిని తొలగించి, కొత్త భవనాలు కట్టాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరిపింది. ప్రపంచ స్థాయిలో, 5 స్టార్ వసతులతో అత్యాధునికంగా, విశాఖ నగర ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేసేలా డిజైన్లు రూపొందించింది. సీఆర్‌జెడ్ పరిమితులకు లోబడి నిర్మాణాలు ప్రారంభించింది. రుషికొండపై ఏ భవనాలు, ఎందుకు నిర్మిస్తున్నారో సమగ్ర వివరాల్ని 2021లోనే కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో ఫైవ్ స్టార్ పర్యాటక విడిది కేంద్రంగా మొత్తం రూ.412 కోట్లతో 7 బ్లాకుల్ని నిర్మించింది. రుషికొండ మొత్తం 61 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 9.88 ఎకరాల విస్తీర్ణంలోనే ఈ భవనాలు నిర్మించింది. గతంలో హరిత రిసార్టు 48 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుత భవనాలు 19,968 చ.మీ విస్తీర్ణంలో ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు వీలుగా నిర్మించారు. ప్రెసిడెన్షియల్ సూట్, సూట్ రూమ్, బాంక్వెట్ హాల్‌తో విజయనగర బ్లాకు, ప్రెసిడెన్షియల్ సూట్ రూమ్స్, సూట్ రూమ్స్, డీలక్స్ గదులు, బాంక్వెట్ హాల్‌తో కళింగ బ్లాక్ నిర్మించింది. సూట్ రూమ్‌లు, కాన్ఫరెన్స్ హాల్‌తో పల్లవ బ్లాక్, సమావేశ మందిరాలతో చోళ బ్లాక్, రిక్రియేషన్ లాంజ్, బిజినెస్ సెంటర్‌తో గజపతి బ్లాక్, ప్రైవేట్ సూట్ రూమ్‌లతో వేంగిబ్లాక్, రెస్టారెంట్స్, లాంజ్, కిచెన్, పార్కింగ్ సౌకర్యాలతో ఈస్టర్న్ గంగా బ్లాక్‌లని నిర్మించింది.

విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తే..

విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేస్తే, రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తలంచింది. ఇందుకు ఏర్పాట్లు ప్రారంభించింది. విశాఖలో పాలన ప్రారంభించడానికి అనువైన భవనాల పరిశీలనకు ఉన్నతాధికారులతో కూడిన కమిటీని నియమించింది. ఈ కమిటీ విశాఖలోని పలు భవనాలను పరిశీలించింది. వీటిలో రుషికొండపై నిర్మించిన భవనాలు ప్రభుత్వ కార్యకలాపాలకు అనువైనవని తేల్చింది. ఇక్కడ సీఎం నివాసం, సీఎం కార్యాలయానికి ఇవి అనువుగా ఉంటాయని వెల్లడించింది. అప్పట్నుంచి ఈ భవనాల్లో సీఎం నివాసం, కార్యాలయానికి అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. వాటిని నిర్మించింది ప్రభుత్వం. పనులు జరిగింది ఏపీటీడీసీ ఆధ్వర్యంలో. ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమాలు, అంతర్జాతీయ సదస్సులు ఇక్కడే నిర్వహించేందుకు వీలుగా అత్యద్భుతంగా ఫైవ్‌స్టార్ హోటల్స్‌ని తలదన్నేలా నిర్మాణం జరిగింది. సాగర తీరంలో అద్భుతంగా, రాష్ట్రానికి అంతర్జాతీయంగా పేరు తెచ్చేలా నిర్మించిన ఈ భవనాలను చూసి గర్వపడాలి కానీ.., ఎవరో సొంతగా భవనాలు కట్టేసుకొన్నట్లుగా టీడీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతల ఏడుపులు, పెడబొబ్బలు ఎందుకు? అవి ప్రభుత్వం నిర్మించిన భవనాలు. అనుమతి ఉన్న వారు ఎవరైనా వెళ్లొచ్చు. అయినా, టీడీపీ నేతలు ఏదో ఘనకార్యం చేసినట్లు ప్రభుత్వం భవనం లోపలికి వెళ్లి, ఫొటోలు దిగి, వీడియోలు తీసి చెడు ప్రచారం చేయడం నీచత్వానికి పరాకాష్ట. మంచి చేయడమే కాదు.. మరొకరు చేసిన మంచిని అంగీకరించడం కూడా చేతకాదని వారికి వారే నిరూపించుకోవడమే.

మూడేళ్లుగా దుష్ప్రచారం

- ప్రభుత్వ అవసరాల కోసమే ఆ భవనాల నిర్మాణం
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కొమ్మాది (విశాఖ): విశాఖపట్నం బీచ్‌రోడ్డులో రుషికొండపై నిర్మించిన భవనాల విషయంలో టీడీపీ నేతలు గడిచిన మూడేళ్లుగా దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారని, దానిని తక్షణమే మానుకోవాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రుషికొండపై ప్రభుత్వ అవసరాల కోసం ఆ భవనాలను నిర్మించామన్నారు. అయితే ఆ భవనాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సొంతానికి నిర్మించుకున్నారంటూ ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రుషికొండపై నిర్మాణాలు సాగనీయకుండా అనేక సార్లు కోర్టును ఆశ్రయించారన్నారు. ఈ నిర్మాణాలకు ముందే సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీని వేశామని, ఆ కమిటీ ఇచ్చిన సూచనలు మేరకు ముందుకు సాగామని తెలిపారు. విశాఖ నగరానికి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్ వంటి ముఖ్యమైన వ్యక్తులు వచ్చినప్పుడు వారికి సరైన విడిది సౌకర్యం లేనందువల్లే ఆ భవనాలను నిర్మించామని తెలిపారు. ఈ భవనాలు వీఐపీలు, వీవీఐపీలకు కేటాయించే అవకాశం ఉన్నందున భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇప్పటివరకు వాటిని బహిర్గతం చేయలేదని చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ విషయాన్ని పట్టించుకోకుండా వీటిని బహిర్గతం చేశారని అన్నారు. అదే విధంగా విశాఖను పరిపాలనా రాజధానిగా చేసి ఇక్కడి నుంచే పాలన సాగించాలని వైఎస్ జగన్ భావించారని వివరించారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం పర్యాటక శాఖకు సంబంధించిన ఈ భవనాలను ఎలా ఉపయోగించుకోవాలి అనే ఆలోచన చేయాలన్నారు.

అమరావతి పేరుతో రూ.వేల కోట్లు దుర్వినియోగం

గతంలో 2014–19 సమయంలో సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు అమరావతి రాజధాని పేరుతో తాత్కాలిక భవనాల నిర్మాణానికి వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని అమర్‌నాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో చంద్రబాబు అత్యంత విలాసవంతమైన భవనాన్ని నిర్మించుకున్నారని ఆ సమయంలో ఆయన కుటుంబ సభ్యులను ఓ హోటల్‌లో ఉంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. నిజంగా గంటా శ్రీనివాసరావు ప్రజలకు వాస్తవాలు చూపించాలి అనుకుంటే ఇదే నిర్మాణం ఎదురుగా గీతం ఆక్రమణలు బహిర్గతం చేసి ప్రజలకు చూపించాలన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగమైన భోగాపురం ఎయిర్‌పోర్టు, ఉద్దానంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మూలపేటలో పోర్టు, మెడికల్ కాలేజీలు, ట్రైబల్ యూనివర్సిటీ వంటివి నిర్మించామని వాటినీ ప్రజలకు చూపించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి పాల్గొన్నారు.

అరచేతిలో వాతావరణ సమాచారం

ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్ర ప్రభుత్వం



రాయవరం: ఈ మధ్యకాలంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా ఒకరోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా మరోరోజు ఈదురు గాలులతో కూడిన అకాలవర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు అయోమయానికి గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. డామిని, మేఘదూత్, రెయిన్ అలారం.. యాప్‌లు ఆవిష్కరించింది. వీటిద్వారా వాతావరణ పరిస్థితులను అంచనా వేయవచ్చని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా వర్షాకాలం మొదలుకానున్న నేపథ్యంలో ఉష్ణోగ్రతల వివరాలు, వర్షాల రాక సమాచారాన్ని కూడా యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ఉరుములు, మెరుపుల నుంచి రక్షించుకోవడం, వర్షం పరిస్థితులను అంచనా వేయడం సులభమవుతంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ శాఖ రూపొందించిన ఈ యాప్‌లు రైతులకు సాగులో తోడ్పడనున్నాయి. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా వీటిని డౌన్లోడ్ చేసుకుంటే చాలు. వాతావరణ సమాచారం మొత్తం మన అరచేతిలో ఉన్నట్టే.

'డామిని'లో ఉరుములు, మెరుపుల హెచ్చరిక

ఒక్కోసారి వాతావరణంలో అప్పటికప్పుడు మార్పులు సంభవించి ఉరుములు, మెరుపులు వస్తాయి. పిడుగుపాటు కూడా సంభవించే అవకాశం ఉంటుంది. ఇలాంటి హెచ్చరికలను తెలిపేందుకు డామిని యాప్ ప్రయోజనకరంగా ఉంటుంది. మెరుపు ఎప్పుడు వస్తుంది? మెరిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాల్సిన తీరును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. లొకేషన్ ఆధారంగా మెరుపులు వచ్చే అవకాశం ఉందో? లేదో? కూడా తెలుస్తుంది. పిడుగు పడినప్పుడు తోటివారికి అందించాల్సిన వైద్యసహాయం వంటి ప్రాథమిక సమాచారాన్ని తెలియజేస్తుంది. రైతులకు, రైతుకూలీలకు బయటి ప్రాంతాల్లో పని చేసేవారికి ఈ యాప్ ఎంతో తోడ్పడుతుంది.

వాతావరణ సమగ్ర వివరాలతో 'మేఘదూత్'

మేఘదూత్ యాప్‌లో వాతావరణానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. వర్షపాతం వివరాలు, గాలిలో తేమ, గాలి వేగం, గాలి వీచే దిశ, నమోదైన ఉష్ణోగ్రతలు, రానున్న 24 గంటల్లో వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంది. గడిచిన వారం రోజులు, రానున్న మరో నాలుగు రోజుల వాతావరణ వివరాలు కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

వర్ష సూచనకు 'రెయిన్ అలారం'

వర్షం ఎప్పుడు పడుతుంది. వర్షపాతం వివరాలు, రానున్న కాలంలో వర్ష సూచనలను రెయిన్ అలారం యాప్ తెలియజేస్తుంది. మనం నివసిస్తున్న ప్రాంతంలో వాతావరణ, వర్ష సూచనలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయో తెలియజేస్తుంది.

గిరిజన గర్భిణులకు వసతి గృహాల ఏర్పాటు

రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి



సాక్షి, అమరావతి: గిరిజన గర్భిణులకు వసతి గృహాలను త్వరలో ఏర్పాటు చేస్తామని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం మూడవ భవనంలో రాష్ట్ర మంత్రిగా ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు 544 మంది ఏఎన్‌ఎంలను నియమించేందుకు ప్రతిపాదించిన దస్త్రంపై మంత్రి సంధ్యారాణి తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గర్భిణులు, చిన్నారులు, గిరిజనుల్లో ఏ ఒక్కరూ పౌష్టికాహార లోపంతో చనిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంబులెన్సులు వెళ్లలేని ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్సులను(ద్విచక్ర వాహన)తిరిగి ప్రవేశ పెడతామని చెప్పారు. త్వరలో ఐటీడీఏలు, ఐసీడీఎస్ ప్రాజెక్టులను పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. గిరిజనులు, మహిళలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, పౌష్టికాహార లోపం నివారణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఈ విషానికి విరుగుడేదీ?

పేద పిల్లలకు ఉత్తమ విద్య అందించడమే తప్పన్నట్టు 'ఈనాడు' వక్రరాతలు

జగన్ ప్రభుత్వంలో 44,617 ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు

- ఒకటో తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం బోధన
- మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ విధానం
- హైస్కూల్స్‌లో 62 వేల ఐఎఫ్‌పీ స్క్రీన్లతో డిజిటల్ బోధన
- ప్రాథమిక పాఠశాలల్లో 45 వేల స్మార్ట్ టీవీలు
- 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో 9.53 లక్షల ట్యాబ్స్
- 1,000 ప్రభుత్వ బడుల్లో సీబీఎస్‌ఈ సిలబస్
- ప్రభుత్వ బడుల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య
- ఏపీ విద్యా సంస్కరణలకు దేశవిదేశాల్లో ప్రశంసలు
- ఇంత ప్రగతి కనిపిస్తున్నా 'ఈనాడు' వికృత రాతలు



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక విద్యా రంగాన్ని అత్యంత ప్రాధాన్యత రంగాల్లో ఒకటిగా గుర్తించింది. ఈ నేపథ్యంలో దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా 'ఆర్థిక సమస్యలతో ఏ పేదింటి బిడ్డ చదువు ఆగిపోకూడదు.. వారు బాగా చదవాలి, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇంగ్లిష్ మీడియంలో చదువుకుని వారంతా ఉన్నతంగా ఎదగాలి. వారి చదువుకు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుంది.. అన్ని సదుపాయాలు కల్పిస్తుంది' అంటూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఇందుకు తగ్గట్టే దేశవిదేశాలు కీర్తించేలా విప్లవాత్మక పథకాలను అమలు చేశారు. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వంలో సౌకర్యాలకు దూరమై కునారిల్లిన ప్రభుత్వ బడులకు జవసత్వాలు కల్పించి వాటిని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా పరుగులు పెట్టించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు అంతకుముందెన్నడూ లేని రీతిలో పెరిగాయి. వివిధ రాష్ట్రాలు, దేశాలు, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంక్‌లాంటి సంస్థలు ఏపీ విద్యా సంస్కరణలపై ప్రశంసలు కురిపించినా ఈనాడు పత్రిక మాత్రం వాస్తవాలను జీర్ణించుకోలేక మరోసారి వికృత రాతలతో విషం జిమ్మింది. ఐదేళ్ల జగన్ పాలనలో విద్య అస్తవ్యస్తమైపోయిందని.. 'పాఠశాల విద్యలో ప్రతిదీ సవాలే!' అంటూ తప్పుడు రాతలకు బరితెగించింది. జగన్ ప్రభుత్వం పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా రాణించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించింది. మనబడి నాడు–నేడుతో 44,617 ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ విద్యా సంస్థలే అసూయచెందేలా కొత్త పాఠశాల భవనాలు, టాయిలెట్లు నుంచి కాంపౌండ్ వాల్ వరకు 11 రకాల సదుపాయాలతో అత్యుత్తమంగా తీర్చిదిద్దింది. ప్రభుత్వ బడి అంటే పగిలిన గోడలు.. పెచ్చులూడే స్లాబులు, నేల బారు చదువులేనన్న అభిప్రాయంతో ఉన్న పరిస్థితి నుంచి.. ఆంధ్రప్రదేశ్‌లో సర్కారు చదువులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి ప్రభుత్వ బడి పిల్లలు ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించే వరకు తీసుకెళ్లిన ఘనత ఏపీకి మాత్రమే దక్కింది. దేశంలోనే అత్యుత్తమ విద్యా విధానం ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసినట్టు స్వయంగా కేంద్ర ప్రభుత్వమే కితాబిచ్చినా ఈనాడు పత్రిక మాత్రం అంగీకరించలేక తన అల్పబుద్ధిని చాటుకుంటోంది. ఈ విద్యా సంస్కరణలే తప్పు అనేలా వక్రీకరణలు చేస్తోంది. ఏదోలా ఈ సంస్కరణలను రద్దు చేసి, పేదింటి పిల్లలను ఉత్తమ విద్యకు దూరం చేసే కుట్ర చేస్తున్నట్టు విద్యా రంగ నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ బోధన

ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 66,245 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు 3 నుంచి 10 తరగతులకు బోధించాలి. ఇందులో 59,663 మంది ఉపాధ్యాయులు ఇప్పటికే ఆ తరహా సేవలు అందిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 6,582 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)కు పదోన్నతి కల్పించి సబ్జెక్ట్ టీచర్లు(స్కూల్ అసిస్టెంట్లు)గా హైస్కూళ్లకు పంపించారు. ప్రతి స్కూల్లో ఎంత మంది ఉపాధ్యాయులు తగ్గారో ఒక్కరోజైనా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పరిశీలించని 'ఈనాడు' ఈ విషయంలోనూ కాకి లెక్కలు వేసింది. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు సుమారు 7 వేల వరకు ఉన్నాయి. అవన్నీ ఏజెన్సీ, కొండ ప్రాంతాల్లోనే ఉన్నాయి. అక్కడ విద్యార్థుల సంఖ్య 8 నుంచి 15 మంది లోపే ఉన్నా ప్రతి బడికి ప్రభుత్వం ఉపాధ్యాయుడిని నియమించింది. ఇప్పటి వరకు పాకల్లోనూ, శిథిల గదుల్లోనూ కొనసాగిన వీటికి 'నాడు–నేడు' కింద కొత్త భవనాలను నిర్మిస్తోంది. కానీ 'ఈనాడు' నోటికొచ్చిన ఓ అంకెను ముద్రించి అసత్యాలను ప్రచురిస్తోంది.

శాస్త్రీయంగా సంస్కరణలు

2019కి ముందు ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రభుత్వ పాఠశాలలకు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ బడుల్లో పరిస్థితి దిగజారింది. అదే విషయాన్ని 'అసర్, నాస్' వంటి సర్వేలు కూడా స్పష్టం చేశాయి. దీంతో 2019లో అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా నాణ్యతను పెంచేందుకు ఈ సర్వేల అంశాలను ప్రామాణికంగా తీసుకొని పలు కార్యక్రమాలను అమలు చేసింది. టీచింగ్ ఎట్ రైట్ లెవెల్, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్, సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కార్యక్రమాలు అందులో కొన్ని. అసర్ నివేదిక ఆధారంగా రూపొందించిన 'టీచింగ్ ఎట్ రైట్ లెవెల్' కార్యక్రమంలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా పలు నూతన విధానాలతో విద్యాబోధన అమలు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'ప్రథమ్' సంస్థతో కలిసి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందించారు. దీనిద్వారా విద్యార్థుల లెర్నింగ్ ఎబిలిటీ, రీడింగ్ ఎబిలిటీ మెరుగుపడినట్లుగా 2022 బేస్‌లైన్ ఫలితాలు తెలియజేస్తున్నాయి. ఎంపిక చేసిన కొన్ని జిల్లాల్లో ప్రాథమికోన్నత స్థాయిలో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు 'లిప్' ప్రోగ్రాం అమలు చేశారు. విద్యార్థుల క్లాస్ రూమ్ పరీక్షల నిర్వహణలోనూ అనేక మార్పులు తీసుకొచ్చారు. గతంలో ఫార్మెటివ్ అసెస్‌మెంట్స్‌ను ఎక్కడికక్కడ క్లాస్ రూమ్‌లో టీచర్ రూపొందించి ఇచ్చేవారు. ఇందులో పరీక్ష, ప్రశ్నల నాణ్యత తక్కువగా ఉండడంతో రాష్ట్ర స్థాయిలో నిపుణులతో ప్రశ్నపత్రాలు రూపొందించి అన్ని పాఠశాలల్లోనూ ఒకే తరహా ప్రశ్నపత్రాలు అందించారు. బైజూస్ ఉచితంగా అందించిన ఈ–కంటెంట్‌తోపాటు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన తెలుగు, ఇంగ్లిష్, హిందీ కంటెంట్‌ను కూడా ఉపాధ్యాయులకు డీటీహెచ్ చానల్స్ ద్వారా, ఈ–పాఠశాల యాప్ ద్వారా అందజేశారు.

హేతుబద్ధీకరణపైనా అసత్యాలే..

రాష్ట్రంలో 2019 కంటే ముందు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు చాలా తక్కువగా ఉన్నాయని పలు సంస్థల అధ్యయనాలు తేల్చాయి. దీంతో వైఎస్ జగన్ సర్కారు ప్రభుత్వ విద్యలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి.. 1, 2 తరగతుల బోధన, అభ్యాసంపై దృష్టి పెట్టింది. 3, 4, 5 తరగతులను హైస్కూల్ విద్యలోకి తీసుకురావడం ద్వారా బీఈడీ, సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ ఉన్న సబ్జెక్ట్ టీచర్ల ద్వారా పిల్లలకు బోధన అందించి అభ్యసనా సామర్థ్యాలను బలోపేతం చేసింది. ఇందుకోసం ప్రాథమిక పాఠశాలల్లోని 3 నుంచి 5 తరగతులను హైస్కూల్‌కు మార్చింది. ప్రాథమిక పాఠశాలల్లో అంగన్వాడీ పిల్లలకు పీపీ–1, పీపీ–2తో పాటు ఒకటి, రెండు తరగతుల బోధన ప్రారంభించింది. దీంతో ఏ స్కూల్‌ను మూసివేయాల్సిన అవసరం తలెత్తలేదు. ఈ సంస్కరణలను ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సైతం స్వాగతించారు. కానీ గత టీడీపీ ప్రభుత్వం మాత్రం విద్యా సంస్కరణలు చేపట్టకుండా సరిపడినంత మంది విద్యార్థులు లేరన్న సాకుతో 2014–2019 మధ్య 1,785 పాఠశాలలను మూసివేయడం గమనార్హం.

ఉన్నత విద్యకు అనువుగా ఇంగ్లిష్ మీడియం

పదో తరగతి లేదా ఇంటర్ తర్వాత పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులు పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలోనే చదవాలి. పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియం లేనివారు ఉన్నత విద్యలో వెనుకబడుతున్నారు. మరికొందరు మానేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2020లో రాష్ట్ర వ్యాప్తంగా తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించగా 97 శాతం మంది ఇంగ్లిష్ మీడియం బోధన తప్పనిసరిగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. దీంతో జగన్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టింది. విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాన్ని పెంచేందుకు ద్విభాషా పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలను కూడా అందించింది. ముగిసిన విద్యా సంవత్సరంలో 93 శాతం పైగా విద్యార్థులు ఇంగ్లిష్‌లోనే పరీక్షలు రాయడం విశేషం. పదో తరగతిలో ఇంగ్లిష్ మీడియం అమలు చేయకున్నా 2.23 లక్షల మంది విద్యార్థులు కూడా ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాశారు. వీరిలో 1.96 మందికి పైగా ఉత్తీర్ణత సాధించారంటే ఇంగ్లిష్ బోధనను ఎంత బలంగా కోరుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలోనూ 90 శాతం పైగా ఇంగ్లిష్ మీడియం చదువులనే కోరుకున్నారు.

ఒకే సిలబస్.. బోర్డుల ప్రకారం పరీక్షలు

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ)కి రాష్ట్రంలో 1,000 పాఠశాలలను అనుసంధానించారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి మొదటి బ్యాచ్ సీబీఎస్‌ఈ పరీక్షలు రాస్తారు. అందుకు అవసరమైన ప్రణాళికను ముందే అమల్లోకి తెచ్చారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ బడుల్లో ఒకటో తరగతి నుంచి పేద పిల్లలకు ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) విద్యను అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 44,478 స్కూళ్లలోనూ జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సిలబస్‌నే బోధిస్తున్నారు. అన్ని తరగతులకు ఒకే తరహా సిలబస్ ఉంది. పరీక్షా విధానం మాత్రమే ఆయా బోర్డుల ప్రకారం ఉంటుంది.

ఇంగ్లిష్ నైపుణ్యాల పెంపునకు టోఫెల్

విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్, మంచి ఇంగ్లిష్ ఒకాబులరీ నైపుణ్యాలను అందించేందుకు 3వ తరగతి నుంచి టోఫెల్ శిక్షణ ప్రవేశపెట్టారు. అన్ని పాఠశాలల్లో టోఫెల్ బోధనకు ప్రత్యేకంగా పీరియడ్ కేటాయించారు. ఈ ఏడాది తొలిసారి నిర్వహించిన 'టోఫెల్' పరీక్షకు దాదాపు 16.50 లక్షల మంది విద్యార్థులు హాజరు కావడం గమనార్హం.

ప్రతి విద్యార్థికీ డిజిటల్ బోధన

నాడు–నేడు పనులు పూర్తయిన హైస్కూళ్లలో ఇంటర్నెట్‌తో పాటు 62 వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ), 45 వేల స్మార్ట్ టీవీలను అందించారు. వీటితో 3డీ పాఠాలను బోధిస్తున్నారు. దేశంలో 25 వేల ఐఎఫ్‌పీలు మాత్రమే ఉంటే.. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో 62 వేల డిజిటల్ స్క్రీన్లు ఉండటం విశేషం. 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కలిపి 2021–22, 2022–23 విద్యా సంవత్సరాల్లో 9.53 లక్షల మందికి బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్స్ ఇచ్చారు. 'ఏపీ ఈ–పాఠశాల' మొబైల్ యాప్, దీక్ష వెబ్‌సైట్, డీటీహెచ్ చానెళ్లు, యూట్యూబ్ చానెల్స్ ద్వారా నిరంతరం పాఠాలను విద్యార్థులకు చేరువ చేసింది. విద్యార్థులకు సబ్జెక్టుల్లో వచ్చిన సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం 'ఏఐ' టెక్నాలజీతో పనిచేసే 'డౌట్ క్లియరెన్స్ బాట్' యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది.

భావి నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భవిష్యత్ టెక్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు 'ఫ్యూచర్ స్కిల్స్ కోర్సుల'ను జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆరు నుంచి ఇంటర్ వరకు మూడు దశల్లో విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), 3డీ ప్రింటింగ్, గేమింగ్ వంటి 10 విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ఈ కోర్సులను 6,790 ఉన్నత పాఠశాలల్లో బోధించేందుకు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్‌గా నియమించారు.

పేదలకు 'ఐబీ'తో అంతర్జాతీయ విద్య

పేదింటి పిల్లలు ప్రపంచానికి దిక్సూచిగా మారాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో 'ఇంటర్నేషనల్ బాకలారియేట్(ఐబీ) బోధన 2025 జూన్ నుంచి ఒకటో తరగతి నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటిదాకా దేశంలో 210 వరల్డ్ క్లాస్ కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే ఐబీ సిలబస్ అమల్లో ఉంది. సంపన్నులు మాత్రమే చదివించగల ఐబీ చదువులను రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలోకి తెచ్చి పేద పిల్లలకు అందించాలన్న సంకల్పంతో జగన్ సర్కారు ముందడుగు వేసింది. ఏటా ఒక తరగతి చొప్పున ఐబీ బోధన పెంచుతూ 2037 నాటికి +2 వరకు విద్యనందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది.

బాలికల కోసం ప్రత్యేకంగా జూనియర్ కాలేజీలు


హైస్కూల్ చదువు పూర్తయిన బాలికలు చదువు మానేయకుండా ప్రతి మండలంలోనూ వారి కోసం ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 292 ఉన్నత పాఠశాలలను బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. 352 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో ఇంటర్మీడియెట్‌ను ప్రవేశపెట్టారు. 2022–23 నుంచి 14 కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలను గర్ల్స్ జూనియర్ కళాశాలలుగా మార్చారు. రాష్ట్రంలోని 679 మండలాల్లోనూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలను తీసుకొచ్చారు.

పోల'వరం' మరో నాలుగేళ్లకే

అది కూడా అంతా సవ్యంగా జరిగితేనే పూర్తి: సీఎం చంద్రబాబు

సంక్లిష్టం చేసి ప్రాజెక్టు పనికిరాకుండా చేయడం క్షమించరాని నేరమని వ్యాఖ్య

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలవరం పూర్తి కావాలంటే మరో నాలుగు సీజన్లు అంటే నాలుగు సంవత్సరాలు పడుతుందని అధికారులు చెబుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అది కూడా అన్నీ సవ్యంగా జరిగితేనే నాలుగేళ్లు పడుతుందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అనేక తప్పిదాలు ప్రాజెక్టుకు శాపాలుగా మారాయని ఆరోపించారు. సోమవారం పోలవరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం చంద్రబాబు ఎంపిక చేసిన మీడియాతో మాట్లాడారు. తొలుత స్పిల్‌వే బ్లాక్‌–26 వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. గైడ్ బండ్, గ్యాప్ 1, 2, 3, డీఎస్‌ఈడీ పవర్ హౌస్ డౌన్ స్ట్రీమ్, అప్ స్ట్రీమ్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.


చంద్రబాబుకు ప్రాజెక్టు వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

నా దూరదృష్టితో ముంపు మండలాల విలీనం

పోలవరాన్ని చూస్తే బాధ, ఆవేదన కలుగుతోందని.. ప్రాజెక్టును ఏపీకి జీవనాడిగా భావించామని చంద్రబాబు చెప్పారు. తాను 2014లో గెలిచిన తరువాత దూరదృష్టితో తెలంగాణకు చెందిన ఏడు ముంపు మండలాలను కేంద్ర ఆర్డినెన్స్ ద్వారా ఏపీలో విలీనం చేయగలిగినట్లు తెలిపారు. అప్పటికే పోలవరం చాలా సంక్షోభాల్లో ఉందన్నారు. 2005లో వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టు పనుల్లో అనేక ఆరోపణలు వచ్చాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారన్నారు. ప్రాజెక్టు 45.72 మీటర్ల ఎత్తుతో ఉంటే 194 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని, అయితే ఆ ఎత్తు తగ్గించడానికి ప్రయత్నించారని ఆరోపించారు. స్పిల్‌వే ద్వారా 50 లక్షల క్యూసెక్కులు వెళ్లేలా డిజైన్ చేశామన్నారు. బహుళార్థ సాధక ప్రాజెక్ట్ అయిన పోలవరాన్ని గత ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. చైనాలోని త్రీ గోర్జెస్ కన్నా అధిక స్థాయిలో నీటి విడుదల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు ఇదేనన్నారు. 194 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 320 టీఎంసీల వరకు వరద నీటిని వినియోగించుకోగలిగిన అవకాశం ఈ ప్రాజెక్టుకు ఉందన్నారు. నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు పోలవరం పనులను తాను వేగవంతం చేశానని, ప్రాజెక్టుపై 100కి పైగా సమీక్షలు, 31 సార్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించినట్లు చెప్పారు. పోలవరంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రంలో ఎక్కడా కరువు కనపడదన్నారు.

రివర్స్ టెండరింగ్‌తో ఆగిపోయింది

గతంలోనే తమ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.13,683 కోట్లు ఖర్చు చేసి 72 శాతానికి పైగా పూర్తి చేసిందని, అదే వేగంతో పనులు కొనసాగి ఉంటే 2020 చివరి నాటికే పూర్తయ్యేదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపివేసిందన్నారు. ఇరిగేషన్ కేటాయింపులు రూ.7,100 కోట్లకు తగ్గించి అది కూడా కాంట్రాక్టర్లకు అడ్వాన్సులుగా చెల్లించారన్నారు. తమ హయాంలో రూ.446 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మించామని చెప్పారు. గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పూర్తి చేయనివ్వకుండా కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ సిబ్బందిని మార్చడం లాంటి చర్యలకు పాల్పడిందన్నారు. కేంద్ర జలసంఘం అధికారులు వారించినా పెడచెవిన పెట్టిందన్నారు. 2019, 2020లో అధిక వర్షాల కారణంగా డయాఫ్రమ్ వాల్‌కు నాలుగు చోట్ల నష్టం వాటిల్లడంతో 35 శాతం దెబ్బతిందని చెప్పారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేయాలంటే రూ.447 కోట్లు ఖర్చవుతుందని, దానికి సమాంతరంగా మళ్లీ కొత్తగా నిర్మించాలంటే రూ.996 కోట్ల వ్యయం అవుతుందని చెప్పారు. రెండు కాఫర్ డ్యాంలు రూ.550 కోట్లతో నిర్మించారని, కొంతమేర కాఫర్ డ్యామ్ కట్టకపోవడం వల్ల వరద తాకిడికి డయా ఫ్రమ్ వాల్ దెబ్బతిందని చంద్రబాబు పేర్కొన్నారు. కాఫర్ డ్యామ్ గ్యాప్ నిర్మాణానికి రూ.2 వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. కాఫర్ డ్యామ్‌కు సీపేజ్‌లు ఉన్నాయని, వరదలు వస్తే మరింత నష్టం కలుగుతుందని చెప్పారు. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని గత ప్రభుత్వం వృథా చేసిందని ఆరోపించారు.

'సాక్షి'కి నో ఎంట్రీ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం వద్ద అధికారికంగా నిర్వహించిన విలేకరుల సమావేశానికి 'సాక్షి'తో పాటు మరో మూడు ఛానళ్లకు అనుమతి లేదని ఐ అండ్ పీఆర్ అధికారి స్పష్టం చేశారు. ఈ మేరకు ఉన్నత స్థాయి నుంచి తమకు ఆదేశాలు అందాయని, జాబితా ప్రకారం సాక్షి మీడియా, 10 టీవీ, ఎస్ టీవీ, టీవీ 9లకు అనుమతులు లేవని చెప్పారు. కాగా, యూట్యూబ్ ఛానళ్లకు, స్థానిక పత్రికలకు పాస్‌లు ఇచ్చినప్పటికీ వారిని కూడా అనుమతించలేదు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు దఫాలు పోలవరంలో పర్యటించగా అధికారిక కార్యక్రమాలకు ప్రతి పత్రిక, ఛానల్‌ను అనుమతించారు.

ఇది క్షమించరాని నేరం

రాజకీయాలకు పనికిరాని వ్యక్తి పాలించడం రాష్ట్రానికి ఎలా శాపంగా మారుతుందో చెప్పేందుకు గత ముఖ్యమంత్రి ఒక ఉదాహరణగా మిగులుతారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. క్షమించరాని ఇన్ని తప్పిదాలు చేసిన గత ప్రభుత్వంపై ఏ చర్యలు తీసుకోవాలో ప్రజలే తెలియజేయాలన్నారు. పోలవరం పనులను ఎంత సంక్లిష్టం చేయాలో అంతా చేసి ప్రాజెక్ట్‌ను పనికిరాకుండా చేశారని విమర్శించారు. ఇది క్షమించరాని నేరమన్నారు. అప్పుడే ప్రాజెక్టు చేపడితే తక్కువ ఖర్చుతో పూర్తయ్యేదన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఇరిగేషన్ శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా...

24 నుంచి అసెంబ్లీ సమావేశాలు!

సాక్షి, అమరావతి: ఈ నెల 24వ తేదీ నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. 22వ తేదీ తొలి మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. తొలుత ఈ నెల 19వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వ పెద్దలు అనుకున్నట్లు సమాచారం. అయితే మంత్రులందరూ పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించకపోవడంతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణను వాయిదా వేసినట్లు ప్రచారం నడుస్తోంది. 24వ తేదీ నుంచి ఐదు రోజులు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

టీడీపీ లీగల్ సెల్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు

గత ఐదేళ్లలో టీడీపీ లీగల్ విభాగం అనేక పోరాటాలు చేసిందని, లాయర్‌లు చేసిన కృషి ప్రశంసనీయమని సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ లీగల్ సెల్ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగలు, రాత్రి తేడా లేకుండా అన్నివేళలా లీగల్ సెల్ కార్యకర్తలకు అండగా నిలిచిందని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా పార్టీతో ఉండేది కార్యకర్తలే తప్ప అధికారులు కాదని, ఈ క్రమంలో కార్యకర్తలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు ఝాన్సీ డిమాండ్

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ డిమాండ్ చేశారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల్లో చివరి రోజైన సోమవారం జరిగిన ప్రతినిధుల సభలో ఆమె మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన ప్రజలకు నేటికీ న్యాయం జరగలేదన్నారు. తక్షణమే మొదటి ప్రాధాన్యతగా నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ చెల్లించాలని, భూమికి భూమి కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రభుత్వం గిరిజనులతో చేసుకున్న ఒప్పందం అమలు చేయాలని, పునరావాస సమస్యలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంకేఎస్ జాతీయ నాయకులు శంభు మహతో (జార్ఖండ్), గుణాలన్ (తమిళనాడు) మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, జనసాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.అరుణ, నవయువ సమాఖ్య రాష్ట్ర నాయకుడు ఎస్.భాస్కర్, పీడీఎస్‌ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను సందేశాలిచ్చారు.

నూతన కమిటీ నియామకం

రైతు కూలీ సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం 24 మందికి స్థానం కల్పించగా.. రాష్ట్ర అధ్యక్షురాలిగా సింహాద్రి ఝాన్సీ, ఉపాధ్యక్షులుగా ఇల్లా రామిరెడ్డి, యు.వీరబాబు, కె.మోహన్, కార్యదర్శిగా డి.వర్మ, సహాయ కార్యదర్శులుగా షేక్ బాషా, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, జి.సునీతతో పాటు కార్యవర్గ సభ్యులుగా మరో 16 మందిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

క్యాన్సర్ నిర్మూలనకు రోడ్ మ్యాప్

- విద్యార్థులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్


వైద్యాధికారులతో మంత్రి సత్యకుమార్

తిరుపతి తుడా: క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రోడ్ మ్యాప్‌ను అమలు చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తిరుపతి రుయా ఆస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అత్యవసర విభాగం, ఓపీ, జనరల్ వార్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రికి శానిటేషన్ విభాగంలో జరుగుతున్న అక్రమాలు, సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వకపోవడంపై ఫిర్యాదు చేశారు.ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను గుర్తించి మెరుగైన చికిత్స ద్వారా నిర్మూలించేందుకు పక్కా ప్రణాళికలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపడతామని చెప్పారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలను సమకూరుస్తామని తెలిపారు. విధినిర్వహణలో వైద్య అధికారులు, వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పారిశుద్ధ్య కాంట్రాక్ట్ సంస్థ పై ఫిర్యాదులొచ్చాయని, విచారణ జరిపిస్తామని చెప్పారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీ ఎన్జీవో తరపున వరప్రసాద్, తదితరులు మంత్రికి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- రాష్ట్రంలో, విశాఖలో హింసకు ప్రధాన కారణం గంజాయి
- 'దిశ' పేరు మారుస్తాం
- హోం మంత్రి అనిత



మహారాణిపేట(విశాఖ దక్షిణ)/సింహాచలం: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం, విధానాల వల్ల 1,230 మంది గంజాయి కేసుల్లో ఇరుక్కున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం విశాఖ ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రాజధాని అని చెప్పి విశాఖను గంజాయి, డ్రగ్స్‌కి రాజధానిని చేశారన్నారు. టాస్క్‌ఫోర్స్ ద్వారా గంజాయి రవాణాపై దృష్టి సారిస్తామన్నారు. గంజాయి కారణంగా విశాఖలో క్రైమ్ రేటు పెరిగిందని చెప్పారు. డ్రోన్లను ఉపయోగించి గంజాయి తోటల గుర్తింపునకు చర్యలు చేపడతామని చెప్పారు. రాత్రి పూట విశాఖలో గుంపులుగా ఉండే వారిపై దృష్టి సారిస్తామని తెలిపారు. విశాఖ నగరంలో 1,700 సీసీ కెమెరాల్లో సగానికి పైగా పని చేయకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. మూడు నెలల్లో ప్రక్షాళన చర్యలు చేపడతామన్నారు. డీఅడిక్షన్ కేంద్రాల సంఖ్య పెంచి.. యువతకు, గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. దిశ పోలీస్ స్టేషన్లను మహిళా పోలీస్ స్టేషన్లుగా పేరు మారుస్తామన్నారు.

లక్ష్మీనృసింహస్వామి భూముల్ని రక్షిస్తాం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం భూములను పరిరక్షిస్తామని హోం మంత్రి అనిత తెలిపారు. సోమవారం సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పంచగ్రామాల భూసమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని చెప్పారు. ఇటీవల చీమకుర్తిలో దివ్యాంగురాలి ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. ఐదేళ్లలో ఎవరికీ భయం లేదని, తప్పుచేసిన వారి వెనుక రాజకీయ నాయకులు ఉండటమే దీనికి కారణమన్నారు. పోలీసులను కూడా బెదిరించే పరిస్థితి నెలకొందన్నారు. కొంతమంది పోలీసులూ వైఎస్సార్‌సీపీ తొత్తులుగా పనిచేశారని ఆరోపించారు. అలాంటి పోలీసులు ప్రజలకు సేవ చేయాలని, లేదంటే తప్పుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ప్రతి ఘటనపై ఎంక్వైరీ వేస్తామన్నారు. మహిళలు, ఆడపిల్లలను చెడుగా చూడటానికి కూడా భయపడేలా యంత్రాంగం పనిచేస్తుందని చెప్పారు. కాగా, హోం మంత్రికి ఆలయ ధ్వజస్తంభం వద్ద దేవస్థానం అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

పోలవరానికి రూ.1.20 లక్షల కోట్లు కేటాయించాలి

ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు సూర్యనారాయణ డిమాండ్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అంచనా వ్యయం భారీగా పెరిగినందున పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.20 లక్షల కోట్లు కేటాయించాలని, ఆ మేరకు టీడీపీ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం లక్షా 70 వేల ఎకరాలకు.. ఎకరానికి రూ.36 లక్షల చొప్పున నష్టపరిహారంగా రూ.61 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకూ 13 వేల కుటుంబాలకు మాత్రమే ఆర్ అండ్ ఆర్ కల్పించారని, మిగిలిన కుటుంబాలకు పునరావాసం, నష్టపరిహారానికి రూ.96 వేల కోట్లు అవసరమవుతాయని వివరించారు. ఆదివాసీ నాయకులు అరగంటి వీరభద్రారెడ్డి, కెచ్చెల అబ్బాయిరెడ్డి, మడకం ప్రమీలారాణి, గిడుతూరి చిన్నారావు, ఏలూరు జిల్లా నాయకులు మిడియం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: ప్రతి పండుగలో గొప్ప ధార్మిక సందేశం, విశిష్టత దాగి ఉంటాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇస్లాం మతంపై విశ్వాసం ఉన్నవారు రంజాన్‌ను ఎంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారో బక్రీద్ పండుగను కూడా అంతే నిష్ఠతో చేసుకుంటారని పేర్కొన్నారు. మహ్మద్ ప్రవక్త త్యాగనిరతిని స్మరించుకుంటూ నిర్వహించుకునే ఈ పండుగ ముస్లింలు అందరికీ భగవదానుగ్రహం కలుగచేయాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. భగవంతుడు అందరిని చల్లగా చూడాలని మనసారా కోరుకుంటున్నాను అని పవన్ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభిమాని కుటుంబానికి కడుబండి పరామర్శ

మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ


అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక మృతి చెందిన విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం దాసుళ్లపాలేనికి చెందిన ఆ పార్టీ అభిమాని కుంచంగి అప్పారావు కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పరామర్శించారు. కౌంటింగ్ రోజున ఫలితాలను చూసి మనస్తాపంతో తిండిమానేశాడు. వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడలేకపోతే ఈ జీవితం వ్యర్థం అంటూ కుమిలిపోతూ ఈ నెల ఆరో తేదీన ప్రాణాలు విడిచాడు. మృతుడుకి భార్య కొండమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. జగన్ పాలనలో అందిన ఆర్థిక సాయంతో కిరణ్ డిప్లమో పూర్తి చేయగా, కుమార్తె రాణి ట్రిపుల్ ఐటీలో చదువుకుని ప్రస్తుతం బెంగళూర్‌లో ఉద్యోగం చేస్తోంది. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మన ప్రసాదరావు, కృష్ణ, జగదీష్ తదితరులున్నారు.

జీవనాడి సాక్షిగా నిజాలు గోదాట్లోకి

పోలవరంపై పచ్చి అబద్ధాలు వల్లించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



సాక్షి, అమరావతి: పోలవరం సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు వాస్తవాలను గోదాట్లో కలిపేశారు. 2014–19 మధ్య అధికారంలో ఉండగా కమీషన్లకు ఆశ పడి తాను చేసిన తప్పిదాల వల్ల ప్రాజెక్టులో జరిగిన విధ్వంసం.. ఫలితంగా పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెడుతూ నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లించారు. చంద్రబాబు సర్కార్ చేసిన తప్పులను సరిదిద్దుతూ.. కరోనా లాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పిల్‌వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తిచేసి 2021 జూన్ 11నే గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా 6.1 కిమీల పొడవున వైఎస్ జగన్ ప్రభుత్వం మళ్లించింది. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండా ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్–2లో 1,396 మీటర్ల పొడవున డయాఫ్రమ్‌వాల్ నిర్మించడం ద్వారా చంద్రబాబు సర్కార్ చారిత్రక తప్పిదానికి పాల్పడిందని.. ఆ తప్పు జరిగి ఉండకపోతే 2022 నాటికే అప్పటి సీఎం వైఎస్ జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉండేవారని సాగునీటిరంగ నిపుణులు, అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక చంద్రబాబు తొలిసారిగా పోలవరం పనులను సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

చారిత్రక తప్పిదంతో కోతకు గురైన డయాఫ్రమ్ వాల్

- విభజన చట్టం ప్రకారం కేంద్రమే నిర్మించాల్సిన పోలవరాన్ని కమీషన్లకు ఆశ పడి దక్కించుకున్న చంద్రబాబు సర్కార్ ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను తుంగలో తొక్కింది. సులభంగా చేయగలిగి, కాంట్రాక్టర్లకు అధికంగా లాభాలు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇచ్చింది.
- ప్రపంచంలో ఎక్కడైనా వరదను మళ్లించేలా స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌లు కట్టాకే ప్రధాన డ్యామ్ పనులు చేపడతారు. 2014–19 మధ్య పోలవరంలో చంద్రబాబు సర్కార్ అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. గోదావరి వరదను మళ్లించే స్పిల్‌వే పునాది స్థాయి కూడా దాటలేదు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను ప్రారంభించనే లేదు. కానీ.. డ్యామ్ గ్యాప్–2లో పునాది డయాఫ్రమ్‌వాల్ పనులను 2017లో ప్రారంభించి 2018 జూన్ 11 నాటికి పూర్తి చేశారు. 35 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామంటూ హామీ ఇచ్చి 2018 నవంబర్‌లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులను ప్రారంభించారు. ఇదే ప్రధాన డ్యామ్‌గా చిత్రీకరించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నించారు.
- 2019 ఫిబ్రవరి నాటికి కూడా నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడంతో పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సీడబ్ల్యూసీ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ కాఫర్ డ్యామ్‌ల పనులు చేయాలని ఆదేశించింది. అయితే పునరావాసం కల్పించలేక ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి పనులు ఆపేశారు.
- 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడంతో అదే ఏడాది మే 30న సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టారు. జూన్ రెండో వారంలోనే గోదావరికి వరద ప్రారంభమైంది. అంటే.. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి, గోదావరి వరద ప్రారంభం కావడానికి మధ్య కేవలం 10 నుంచి 12 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ వ్యవధిలో కాఫర్ డ్యామ్‌లలో ఖాళీ ప్రదేశాలను భర్తీ చేయడం ఎలా సాధ్యమన్నది చంద్రబాబే చెప్పాలి.
- గోదావరికి 2019లో భారీగా వరదలు వచ్చాయి. పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 2.4 కి.మీ. వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి వరద.. కాఫర్ డ్యామ్‌లు వదిలిన 800 మీటర్ల ఖాళీ ప్రదేశానికి కుచించుకుపోయి ప్రవహించాల్సి రావడంతో వరద ఉద్ధృతి పెరిగి డయాఫ్రమ్‌వాల్‌లో నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల పొడవున దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై గ్యాప్–1లో 35 మీటర్ల లోతు, గ్యాప్–2లో 26 నుంచి 36.50 మీటర్ల లోతుతో కూడిన అగాధాలు ఏర్పడ్డాయి.
- వీటిన్నింటినీ అధ్యయనం చేసిన ఐఐటీ–హైదరాబాద్, నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ సంస్థలు మానవ తప్పిదం వల్లే పోలవరంలో విధ్వంసం చోటుచేసుకుందని తేల్చి చెప్పాయి. అంటే ఆ తప్పిదం చేసింది చంద్రబాబేనని తేల్చాయని సాగునీటిరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

విధ్వంసం వల్లే పనుల్లో జాప్యం

నాడు చంద్రబాబు చారిత్రక తప్పిదాన్ని వైఎస్ జగన్ అధికారంలో ఉండగా సరిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. కేంద్ర జల్‌శక్తి శాఖ, పీపీఏ, సీడబ్ల్యూసీ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ చంద్రబాబు సర్కార్ నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో నవయుగకు అప్పగించిన రూ.2,917 కోట్ల విలువైన కాంట్రాక్టు ఒప్పందాన్ని 2019 జూలైలో వైఎస్ జగన్ రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. తద్వారా ఖజానాకు రూ.783.44 కోట్లు ఆదా చేశారు. గోదావరి వరద తగ్గాక 2019 నవంబర్‌లో వడివడిగా పనులు ప్రారంభించారు. అయితే 2020 మార్చి నుంచి 2021 చివరి వరకూ కరోనా మహమ్మారి విజృంభించడంతో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించారు. అలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ గోదావరి వరదను మళ్లించేలా స్పిల్‌వేను 48 గేట్లు బిగించడంతో సహా ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్‌ను పూర్తి చేశారు. 2021 జూన్ 11న గోదావరి వరదను స్పిల్‌వే మీదుగా 6.1 కి.మీ.ల పొడవున మళ్లించారు. దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు చేపట్టి పూర్తి చేశారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి కావడంతో ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో చేరిన నీటిని తోడివేసి వరదల ఉద్ధృతి వల్ల ఏర్పడిన అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్‌వాల్ నిర్మించాలా? లేదంటే దెబ్బతిన్న చోట్ల 'యూ' ఆకారంలో డయాఫ్రమ్ వాల్ నిర్మించి అనుసంధానం చేయాలా? అనే విషయాన్ని సీడబ్ల్యూసీ తేల్చలేదు. సాంకేతికపరమైన ఈ అంశాన్ని తేల్చితే పనులు చేపట్టి వేగవంతంగా ఈసీఆర్ఎఫ్ పనులు పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి గత ప్రభుత్వం కేంద్ర జల్‌శక్తి శాఖ, సీడబ్ల్యూసీని కోరుతూ వచ్చింది. డయాఫ్రమ్ వాల్‌సహా ప్రాజెక్టు డిజైన్లపై కాంట్రాక్టు సంస్థ ఒక అంతర్జాతీయ ఏజెన్సీ సహకారం తీసుకోవాలని, తాము కూడా ఒక అంతర్జాతీయ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని.. రెండు సంస్థలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసిన డిజైన్‌ను ఆమోదించి పనులు చేయాలని సీడబ్ల్యూసీకి చెబుతూ వచ్చింది. నాడు చంద్రబాబు చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే విధ్వంసం జరిగేదే కాదని.. ఇప్పుడు పనుల్లో జాప్యానికి అదే కారణమవుతోందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక 2029 నాటికే..

వరదల ప్రభావం వల్ల నవంబర్ వరకూ పోలవరం పనులు చేపట్టడానికి సాధ్యం కాదు. డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని సీడబ్ల్యూసీ తేల్చితే నాలుగు సీజన్లలో పోలవరాన్ని పూర్తి చేయవచ్చని అధికారులు చెబుతున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. నాటి టీడీపీ సర్కారు తప్పిదాలను వైఎస్ జగన్ చక్కదిద్దినప్పటికీ పోలవరాన్ని 2029 నాటికి గానీ పూర్తి చేయలేమని చంద్రబాబు అంగీకరించారని సాగునీటిరంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

కాఫర్ డ్యామ్‌ల లీకేజీల పాపం బాబు సర్కార్‌దే

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు చేపట్టడానికి వీలుగా లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి జెట్ గ్రౌటింగ్ చేయాలి. నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం గోదావరి నదిలో ఇసుక పర్మియబులిటీ విలువను 2018లో అప్పటి కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ తప్పుగా మదింపు చేసింది. దాన్నే పరిగణనలోకి తీసుకుని 30 నుంచి 35 మీటర్ల లోతువరకూ స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ చేయకుండా కేవలం 20 మీటర్ల లోతు వరకూ జెట్ గ్రౌటింగ్ చేసేలా డిజైన్‌లు రూపొందించింది. నవయుగ సంస్థ ఆ మేరకే జెట్ గ్రౌటింగ్ చేసి కాఫర్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. జెట్ గ్రౌటింగ్ నిబంధనల మేరకు చేసి ఉంటే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీ సమస్య ఉత్పన్నమయ్యేది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తన హయాంలో జరిగిన ఈ తప్పిదాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెట్టేందుకు సీఎం చంద్రబాబు యత్నించడం గమనార్హం.

రూ.12,157.53 కోట్లకు మోకాలడ్డు

పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2013–14 ధరల ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేస్తానని 2016 సెప్టెంబరు 7న చంద్రబాబు కేంద్రానికి హామీ ఇచ్చారు. 2013–14 ధరల ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.20,398.61 కోట్లే. ఇందులో 2014 ఏప్రిల్ 1 వరకూ చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లుపోనూ మిగతా రూ.15,667 కోట్లే ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అయితే 2017–18 ధరల ప్రకారం పునరావాసం, భూసేకరణ వ్యయమే రూ.33,168.23 కోట్లు ఉంది. అందువల్ల రూ.20,398.61 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని, తాజా ధరల మేరకు నిధులిచ్చి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని 2019 మే 30 నుంచి పలుదఫాలు ప్రధాని మోదీని అప్పటి సీఎం వైఎస్ జగన్ కోరుతూ వచ్చారు. దానికి ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు తొలి దశ పూర్తికి రూ.12,157.53 కోట్లు అవసరమని కేంద్ర జల్ శక్తి శాఖ తేల్చింది. ఆ మేరకు నిధులు విడుదల చేయాలని మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది. అప్పటికే బీజేపీతో పొత్తు కుదరడంతో పోలవరానికి నిధుల విడుదల ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ ముందు పెట్టవద్దని, తమకు రాజకీయంగా ఇబ్బందులు వస్తాయంటూ చంద్రబాబు అడ్డుపుల్ల వేశారు. దీంతో అప్పట్లో కేంద్ర కేబినెట్ ఆ ప్రతిపాదనపై ఆమోదముద్ర వేయలేదు. ప్రస్తుతం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న ఆ ప్రతిపాదనపై కేంద్ర కేబినెట్‌తో ఆమోదముద్ర వేయిస్తే నిధుల సమస్య తీరుతుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. సాంకేతిక సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం సీడబ్ల్యూసీ ద్వారా ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. ఆ ప్రణాళికను అమలు చేయడం ద్వారా ప్రాజెక్టు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సాగునీటిరంగ నిపుణులు సూచిస్తున్నారు.

విశాఖ పోర్టుకు రెండు అంతర్జాతీయ ర్యాంకులు

- ప్రపంచబ్యాంక్ పోర్టు పనితీరు సూచీల్లో 20వ స్థానం
- విశాఖ కంటైనర్ టెర్మినల్‌కు 19వ స్థానం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ప్రపంచబ్యాంక్ నిర్వహించిన కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో విశాఖపట్నం పోర్టు 20 స్థానంలో (సూచిక పాయింట్ 62.29), కంటైనర్ టెర్మినల్ పనితీరు సూచికలో 19వ స్థానంలో నిలిచి రెండు రికార్డులు సాధించింది. సూచికల్లో పెరుగుదల పోర్టు పనిసామర్థ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతిక అంశాలు, పోర్టు నిర్వహణలో అమలు చేసిన అద్భుతమైన పనులకు నిదర్శనంగా నిలుస్తోంది. పోర్టు అమలు చేసిన ఈ వ్యూహాత్మక పనులు పోర్టు సూచీల పెరుగుదలకు మాత్రమే కాకుండా ప్రపంచ సముద్రయాన రంగంలో పోటీని తట్టుకుని నిలబడడానికి అవసరమైన బలాన్ని పోర్టుకు అందించాయి. పోర్టులో పెరిగిన పనిసామర్థ్యం కారణంగా సరుకు రవాణాలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేయడమే కాకుండా వ్యాపార అవకాశాలను పెంపొందించి దేశ వాణిజ్యాభివృద్ధిలో తనదైన ముద్రను వేయనుంది. ఈ ఘనత పోర్టు సిబ్బంది కష్టించేతత్వం, అంకితభావం నిబద్ధతకు అద్దం పడుతోందని పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు చెప్పారు. ఉన్నత ప్రమాణాలతో పనిచేయడం ద్వారా వ్యాపార భాగస్వాములకు మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. ప్రపంచపటంలో విశాఖ పోర్టును ఉన్నతంగా నిలిపేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఈ ఏడాది 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేయడంతోపాటు 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు పోర్టు ఉద్యోగులకు, స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పర్యావరణం, ఆరోగ్యం, సురక్ష విభాగంలో అత్యద్భుతమైన పనితీరు కనబరచినందుకు 2022–23 ఏడాదికి గ్రీన్ టెక్ ఫౌండేషన్ విన్నర్ అవార్డు కోసం రికమెండ్ చేసినట్లు తెలిపారు.



ప్రారంభం అనేది ఒక పనికి
అతి ముఖ్యమైనది.
– ప్లేటో

సాక్షి
మంగళవారం, 18 జూన్ 2024

ఇక... జమ్మూ వంతు!

జమ్మూలో వరుస తీవ్రవాద దాడులు కలవరం సృష్టించగా, ఎట్టకేలకు సర్కార్ రంగంలోకి దిగింది. కేంద్ర హోమ్ మంత్రి సారథ్యంలో ఆదివారం ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అందులో తొలి అడుగు. పాక్ నుంచి తీవ్రవాదుల చొరబాటు యత్నాలను నిర్వీర్యం చేసేందుకు భద్రతా దళాల సంఖ్యను పెంచడం సరైన దిశలో సరైన చర్యగా చెప్పుకోవాలి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రాజౌరీ, పూంఛ్, రియాసీ, కథువా, ఉధమ్‌పూర్, దోడా జిల్లాలు ఆరింటిలో ఆరు ప్రధాన తీవ్రవాద దాడులు జరిగాయి. సైనిక వర్గాల కథనం ప్రకారం విదేశీ తీవ్రవాదులు నలుగురైదుగురు చొప్పున బృందాలుగా ఏర్పడుతున్నారట. అలాంటి బృందాలు కనీసం అయిదు పీర్ పంజల్, చీనాబ్ ప్రాంతాల్లో పని చేస్తున్నాయి. జమ్మూలోని ఈ కొత్త తరహా తీవ్రవాద ధోరణి కశ్మీర్‌కూ వ్యాపించే ప్రమాదం పొంచివుంది. అందుకే, జమ్మూ కశ్మీర్‌పై స్వయంగా ప్రధాని గత వారం సమీక్షా సమావేశం నిర్వహిస్తే, తర్వాత మూడు రోజులకే హోమ్ మంత్రి సైతం సమీక్ష చేశారు. పరిస్థితి తీవ్రతకు ఇది దర్పణం.

కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరుతున్న సమయంలోనే తాజా దాడులు యాదృచ్ఛికం అనుకోలేం. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు సజావుగా లేవనీ, 370వ అధికరణం రద్దు తర్వాత శాంతి నెలకొనలేదనీ వీలైనప్పుడల్లా ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులు పని చేస్తూనే ఉన్నారు. తాజా తీవ్రవాద దాడులు అందులో భాగమే. ఇటీవల కొన్నేళ్ళుగా కశ్మీరీ తీవ్రవాదులు ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలను అనుసరిస్తున్నారు. 2022లో నిర్దేశిత వ్యక్తులే లక్ష్యంగా హత్యలు చేసే పద్ధతిని అనుసరిస్తే, గత ఏడాది నుంచి సాంప్రదాయిక విన్యాసాలు సాగిస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాల పైచిలుకుగా ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో అలజడులు సృష్టించసాగారు. గతంలో కశ్మీర్ ప్రాంతంపై పంజా విసిరిన ముష్కర మూకలు ఇప్పుడు ప్రశాంతమైన జమ్మూ ప్రాంతంపై గురి పెట్టాయి. దాంతో, భద్రతా దళాలు తమ వ్యూహాలను మార్చుకోక తప్పని పరిస్థితి.

గతాన్ని సింహావలోకనం చేసుకుంటే, కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370వ అధికరణాన్ని రద్దు చేసిన తర్వాత దృష్టి అంతా కశ్మీర్‌పై నిలిచింది. అప్పటికి పదిహేనేళ్ళుగా జమ్మూలోని అధిక భాగంలో నిస్సైనికీకరణ సాగింది. ప్రశాంతత నెలకొంది. ఫలితంగా, విదేశీ తీవ్రవాదులు ఈసారి జమ్మూని తమకు వాటంగా చేసుకున్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రధానంగా అడవులు ఈ విదేశీ చొరబాటుదారులకు కలిసొచ్చాయి. రాజౌరీ, పూంఛ్ జిల్లాల్లోని దట్టమైన అడవులు, సంక్లిష్టమైన కొండలు తీవ్రవాదుల కొత్త కేంద్రాలయ్యాయి. అక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకొని, గుహల్లో దాక్కొని వారు తమ ఉనికి, బలం పెంచుకున్నారు. తాజాగా నాలుగు రోజుల్లో నాలుగు చోట్ల దాడులు జరగడం, అందులోనూ రియాసీ జిల్లాలో జూన్ 9న యాత్రికుల బస్సుపై అమానుష దాడితో ఒక్కసారిగా దేశమంతా ఉలిక్కిపడింది. ప్రభుత్వం హడావిడిగా క్షేత్రస్థాయి పరిస్థితులపై మళ్ళీ దృష్టి పెట్టింది.

2021 జనవరి నుంచే వాస్తవాధీన రేఖ వెంట జమ్మూలోకి చొరబడడానికి విదేశీ తీవ్రవాద బృందాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అప్పట్లో జమ్మూలోని అఖ్నూర్‌లో మన సైన్యం ఆ ప్రయత్నాన్ని తిప్పికొట్టి, ముగ్గురిని హతమార్చింది. అదే ఏడాది జూన్‌లో భారత వైమానిక దళ స్థావరంపై డ్రోన్ దాడి ఘటనల నుంచి జమ్మూ ప్రాంత సరిహద్దు జిల్లాల్లో తీవ్రవాద కార్యకలపాలు పెరిగాయి. 2021 నుంచి ఇప్పటి వరకు ఒక్క జమ్మూ ప్రాంతంలోనే 29 తీవ్రవాద హింసాత్మక ఘటనలు జరిగాయి. జమ్మూ కశ్మీర్‌లో దాదాపు 100 మందికి పైగా తీవ్రవాదులు క్రియాశీలంగా ఉన్నారట. వారిలో తీవ్రవాద బాట పట్టిన స్థానికుల కన్నా విదేశీ తీవ్రవాదులే ఎక్కువ. ఇది తీవ్రమైన అంశం. ఒకప్పటి భారీ వ్యవస్థీకృత హింసాకాండ నుంచి ఇప్పుడు పొరుగునున్న శత్రువుల అండతో పరోక్ష యుద్ధంగా మారిన ఈ బెడదపై సత్వరమే కార్యాచరణ జరగాలి.

నిజం చెప్పాలంటే, జమ్మూ కశ్మీర్, మణిపూర్‌లు రెండూ ఇప్పటికీ అట్టుడుకుతూనే ఉన్నాయి. మోదీ 3.0 సర్కార్ ముందున్న ప్రధానమైన సవాళ్ళు ఇవి. ప్రభుత్వ పెద్దలు వీటిని అశ్రద్ధ చేయడానికి వీలు లేదు. అందులోనూ ఈ జూన్ 29 నుంచి అమరనాథ్ యాత్ర మొదలు కానున్న వేళ జమ్మూలో భద్రత కీలకం. గతంలో సాంప్రదాయికంగా తీవ్రవాదులకు పెట్టనికోట అయిన కశ్మీర్ లోయలో ఆ పరిస్థితిని మార్చడంలో భద్రతాదళాలు విజయం సాధించాయి. నిరుడు ఏకంగా 2.11 కోట్ల మంది సందర్శకులతో కశ్మీర్‌లో పర్యాటకం తిరిగి పుంజుకొంది. మొన్న లోక్‌సభ ఎన్నికల్లోనూ జనం ఉత్సాహంగా పాల్గొన్నారు. గత 35 ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా మొత్తం కేంద్రపాలిత ప్రాంతంలో 58.46 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. తీవ్రవాదం పీచమణిచి సాధించిన అలాంటి విజయాలు జమ్మూలోనూ పునరావృతం కావాలని హోమ్ మంత్రి ఆదేశిస్తున్నది అందుకే.

తీవ్రవాదులు ప్రధానంగా అంతర్జాల ఆధారిత వ్యవస్థల ఆధారంగా సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. విదేశీ సిమ్ కార్డులతో, పాకిస్తానీ సర్వీస్ ప్రొవైడర్లతో సాగుతున్న ఈ వ్యవహారానికి సాంకేతికంగా అడ్డుకట్ట వేయాలి. ప్రజలు, పోలీసులు, స్థానిక రక్షణ దళ సభ్యులతో సహా అందరినీ కలుపుకొనిపోతూ దేశంలో చేరిన ఈ కలుపు మొక్కల్ని ఏరిపారేయాలి. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించాలని చూస్తున్న ఈ దుష్టశక్తుల పాచిక పారనివ్వరాదు. ప్రభుత్వం వెనక్కి తగ్గక సెప్టెంబర్‌లో జరగాల్సిన జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను నిరాటంకంగా జరిపించాలి. పాక్ పాలకులు పైకి మెత్తగా మాట్లాడుతున్నా, అక్కడి సైన్యాధ్యక్షుడు, సైనిక గూఢచారి వ్యవస్థ ఐఎస్ఐ చేసే కుటిల యత్నాలకు సర్వదా కాచుకొనే ఉండాలి. అప్రమత్తత, సత్వర సన్నద్ధతే దేశానికి శ్రీరామరక్ష.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.ద్వాదశి పూర్తి (24 గంటలు)
నక్షత్రం: స్వాతి ప.2.42 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.8.44 నుండి 10.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.37 వరకు
అమృతఘడియలు: లేవు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

విత్తనాలకు సుస్థిర విధానం అవసరం

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

మన దేశంలో వరిలో దాదాపు 3 లక్షల దేశీ రకం విత్తనాలు ఉండేవని వ్యవసాయ చరిత్ర చెబుతున్నది. అనేక పంటలకు వివిధ రకాల విత్తనాలను వృద్ధి చేసుకున్న ఘనత భారత సాంప్రదాయ వ్యవసాయానిది. హరిత విప్లవం ఒక విధానంగా వచ్చిన గత 60 ఏళ్లలో అనేక రకాల హైబ్రిడ్ విత్తనాలను ప్రవేశ పెట్టారు. ఏకపంట పద్ధతికి ప్రోత్సాహం రావడంతో, పంటల వైవిధ్యం తగ్గింది. రసాయనాలు వాడి తయారు చేసిన విత్తనాలు రసాయన వ్యవసాయంలోనే పని చేస్తాయి. కొన్ని కంపెనీల ఆధిపత్యంలో మార్కెట్లు ఉండటం వ్యవసాయ సుస్థిరతకు శ్రేయస్కరం కాదు. రైతులకు విత్తనాల మీద స్వావలంబన కొనసాగించే వ్యవస్థ అవసరం. ప్రభుత్వాలు సుస్థిర, గుత్తాధిపత్య రహిత విత్తన వ్యవస్థకు ప్రోత్సాహం అందించే విధానాలు రూపొందించాలి.

ఆహార ఉత్పత్తి మొదలయ్యేది విత్తనాల నుంచే. దాదాపు ప్రతి పంటకు అనేక రకాల విత్తనాలు ఉన్నాయి. స్థానికంగా లభ్యమయ్యే ప్రత్యేక పర్యావరణ, వాతావరణ, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి పంటలో రైతులు వందల ఏండ్లుగా విత్తనాలను రూపొందిస్తున్నారు. మన దేశంలో వరిలో దాదాపు 3 లక్షల దేశీ రకం విత్తనాలు ఉండేవని వ్యవసాయ చరిత్ర చెబుతున్నది. వంకాయలో 3 వేలతో సహా అనేక పంటలకు వివిధ రకాల విత్తనాలను వందల యేండ్ల నుంచి వృద్ధి చేసుకున్న ఘనత భారత సాంప్రదాయ వ్యవసాయానిది. దేశవ్యాప్తంగా విత్తనాల చుట్టూ అనేక సంప్రదాయాలు, పండుగలు, గ్రామీణ కార్యక్రమాలు ఉండేవి. గ్రామీణులు, రైతులు, ప్రత్యేకంగా మహిళలు విత్తనాలను గుర్తించటంలో, దాచటంలో, శుద్ధి చేయడంలో గణనీయ జ్ఞానం, కౌశల్యం సంపాదించారు. 35,000 సంవత్సరాలకు పైగా, తరతరాలుగా రైతాంగం పరిశోధనల ఫలితంగా అనేక రకాల విత్తనాలు వృద్ధి అయినాయి. ఈ జానపద విత్తన రకాలు మానవాళికి సుమారు 2,500 పంటలు, 14 పశువుల రకాలకు సంబంధించి ఆశ్చర్యపరిచే స్థాయిలో 11.4 లక్షల రకాల పంటలు, 8,800 పశువుల జాతులను అందించాయి.

హరిత విప్లవం ఒక విధానంగా వచ్చిన గత 60 ఏళ్లలో అనేక రకాల హైబ్రిడ్ విత్తనాలు, ప్రధానంగా వరి, గోధుమలు, మక్కల (మొక్కజొన్న)లో ప్రవేశపెట్టారు. 1968–2019 మధ్య వివిధ సంస్థల ద్వారా 1200 వరి హైబ్రిడ్లు ప్రవేశ పెట్టింది ప్రభుత్వం. ఏకపంట పద్ధతికి ప్రోత్సాహం రావడంతో, పంటల వైవిధ్యం క్రమంగా తగ్గుతూ వచ్చి, ప్రమాదకర స్థాయికి చేరింది. హైబ్రిడ్ విత్తనాలను ప్రతి 3, 4 ఏళ్లకు మార్చాల్సి వస్తుంది. ఆధునిక వ్యవసాయం ల్యాబ్ విత్తనాలను ప్రవేశపెట్టి, సంప్రదాయ విత్తనాలను కనుమరుగు చేస్తున్నది. విత్తనాలు కంపెనీల గుప్పిట్లోకి పోయాయి. విత్తనాలు పోయినాయి అంటే మొత్తం ఆహార వ్యవస్థ ఈ కంపెనీల చేతులలోకి వెళ్లిపోవచ్చు. అట్లని కంపెనీల అధీనంలో, ఒక గొప్ప విత్తన వ్యవస్థ వచ్చిందా అంటే అదీ లేదు. రసాయనాలు వాడి తయారు చేసిన విత్తనాలు రసాయన వ్యవసాయంలోనే పని చేస్తాయి. సహజంగా విత్తనాలలో సహజీవన సూక్ష్మ జీవులు ఉంటాయి. రసాయన చర్యకు లోనైన ఆధునిక విత్తనాలలో ఈ సూక్ష్మ జీవులు ఉండవు. జీవ ప్రక్రియలో ముఖ్య ఘట్టం విత్తనాలు. ఆ విత్తనాలు విషానికి, విష వ్యాపార సంస్కృతికి బలవుతున్నాయి.

ప్రైవేటు కంపెనీల విత్తన వ్యాపారం మన దేశంలో 2002 నుంచి పుంజుకుని, ప్రతి యేడు పెరుగుతున్నది. దాదాపు రూ.25 వేల కోట్ల వార్షిక టర్నోవర్‌కు చేరింది. ప్రపంచ వ్యాప్తంగా 75 శాతం విత్తన వ్యాపారం కేవలం మూడు బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యంలో ఉన్నది. అమెరికాలోనే పారిశ్రామిక వ్యవసాయానికి అనుగుణమైన విత్తన వ్యవస్థ పుట్టుకొచ్చింది. అమెరికా ప్రభుత్వం ఎల్లప్పుడూ ఈ



కంపెనీలకు మద్దతుగా తన వాణిజ్య, విదేశాంగ విధానం అమలు చేస్తుంది. మార్కెట్లో పోటీ తగ్గి కొన్ని కంపెనీల ఆధిపత్యంలో మార్కెట్లు ఉండడం వ్యవసాయ సుస్థిరతకు శ్రేయస్కరం కాదు. బీటీ పత్తి మినహా వేరే రకం పత్తి మార్కెట్లో లేకుండా ఈ ప్రైవేటు కంపెనీలు సిండికేట్ అయినాయి. ప్రభుత్వ సంస్థలలో విత్తన పరిశోధనలు జరగకుండా ప్రైవేటు విత్తన వ్యాపారం అడ్డు పడుతున్నది.

అధిక దిగుబడి వంగడాలు, హైబ్రిడ్ విత్తనాలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో 1968లో కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం తెచ్చింది. ఈ చట్టం ప్రాథమిక లక్ష్యం అప్పట్లో ప్రభుత్వ పరిశోధన సంస్థలు విత్తనాలను విడుదల చేసే పద్ధతిని నిర్దేశించిడం. తరువాత 2002లో ప్రైవేట్ కంపెనీలకు విత్తనాలను ప్రవేశపెట్టే అవకాశం ఇచ్చినాక విత్తన చట్టం సవరించాలని భావించారు. 2003 నుంచి కొత్త విత్తన చట్టాన్ని రైతాంగం కోరుతున్నా కూడా కేంద్ర ప్రభుత్వం చేయలేదు. కంపెనీలకు అనుకూల ముసాయిదాలతో 20 యేండ్ల కాలం దాటింది. కొన్ని రాష్ట్రాలు తమ పరిధిలో చట్టం తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డుకున్నది. వ్యవసాయానికి విత్తన ఆవశ్యకత ఉన్నందున విత్తనాలను నిత్యావసర చట్టంలో చేర్చిన ప్రభుత్వం ప్రైవేటు విత్తన కంపెనీలకు ఆదాయ పన్ను చట్టం నుంచి మినహాయింపు ఇచ్చింది. విత్తన ధరల మీద నియంత్రణ లేదు. ఉత్తుత్తగా ప్రతి సంవత్సరం పత్తి విత్తనాల ధర నిర్ణయిస్తారు. కొరత ఉందని రైతులను భయపెట్టి బ్లాకు మార్కెట్లో ధరను పదింతలు పెంచుతారు. రైతు మీద భారం మోపుతారు. ఎవరైనా రైతు సొంతంగా విత్తనాలు చేసి అమ్మితే వారి మీద 420 కేసులు పెట్టే శాసన వ్యవస్థ, నాణ్యత లేని విత్తనాల వల్ల వేల ఎకరాల పంట నష్టపోయినా ఆయా కంపెనీలకు తాఖీదులు కూడా ఇచ్చే ధైర్యం చేయలేదు.

జన్యుమార్పిడి విత్తనాల వల్ల శ్రేష్ఠమైన సంప్రదాయ విత్తనాలు కనుమరుగు అవుతుంటే, కలుషితం అవుతుంటే పట్టించుకుని సంరక్షించే విత్తన సంస్థ లేకపోవడం దురదృష్టకరం. ప్రత్తి విత్తనాలలో శ్రేష్ఠమైన, దేశీ విత్తనాలు ఇప్పుడు దొరికే పరిస్థితి లేదు. అనేక పంటలలోనూ ఇదే పరిస్థితి. పసుపు, చెరుకు, గోధుమలు, జొన్నలు, కూరగాయలు, మక్కలలో దేశీ రకాలు కనుమరుగు అవుతున్నాయి. ప్రైవేటు కంపెనీలు అమ్ముతున్న కంకర లాంటి మక్క గింజల పంటను ఫ్యాక్టరీకి పంపించి, ప్రాసెస్ చేసి, పశువుల, కోళ్ళ దాణాగా మాత్రమే ఉపయోగించేందుకు వృద్ధి చేశారు. ఇప్పటి మక్క కంకులు నేరుగా ఇళ్లల్లో కాల్చుకుని, ఉడకబెట్టుకుని, ఒలుచుకుని తినే విధంగా లేవు. అటువంటి మక్క గింజలనే పక్కాగా వాడమనీ, తమ కంపెనీల దగ్గర కొనుక్కోమనీ వివిధ దేశాల మీద ఒత్తిడి తేవడం అమెరికా పని. ఇటీవల అటువంటి జన్యుమార్పిడి మక్కలు మాకు వద్దని మెక్సికో ప్రభుత్వం అమెరికా నుంచి మక్కల దిగుమతిని ఆపేసింది. ముక్కలకు మక్కాగా ప్రసిద్ధి చెందిన మెక్సికో తమ గింజలను, తమ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి అమెరికాను ధిక్కరించింది. వరి గింజలకు, వైవిధ్యానికి ప్రసిద్ధి చెందిన మన దేశం మాత్రం విత్తన వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు ఒక్కడుగు కూడా వేయడం లేదు.

రైతులే కేంద్రంగా విత్తన వ్యవస్థను పునరుద్ధరించే పనిని అనేక స్వచ్ఛంద సంస్థలు దేశ వ్యాప్తంగా చేస్తున్నాయి. సహకార విత్తన బ్యాంకులను (కమ్యూనిటీ సీడ్ బ్యాంక్స్) ఏర్పాటు చేసి రైతులు, ప్రత్యేకంగా మహిళలను ప్రోత్సహిస్తున్నాయి. గత పదేళ్ళలో వరిలో, గోధుమలలో, చిరు ధాన్యాలలో, వివిధ కూరగాయలు, పండ్లలో తిరిగి దేశీ విత్తనాలను ఉపయోగించే వాతావరణం కల్పించటంలో అనేక సంస్థలు, వ్యక్తుల కృషి ఉన్నది. మన దేశంలో ఈ రెండు వ్యవస్థల (రైతు కేంద్రీకృత విత్తన వ్యవస్థ, లాభాపేక్షతో కొన్ని జన్యుమార్పిడి విత్తనాలను గుప్పిట్లో పెట్టుకున్న ప్రైవేటు వ్యవస్థ) మధ్య కనపడని సంఘర్షణ ఏర్పడింది. కానీ ప్రభుత్వాలు మాత్రం ప్రైవేటు విత్తన వ్యవస్థ వైపు మొగ్గు చూపుతూ, సబ్సిడీలు అందిస్తూ గుత్తాధిపత్యానికి ఊతం అందిస్తున్నాయి.

రైతులకు విత్తనాల మీద స్వావలంబన కొనసాగించే వ్యవస్థ అవసరం. వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్నా, రసాయన రహిత పౌష్టిక ఆహారం అందాలన్నా, అందరికీ కూడు, బట్ట అందాలన్నా విత్తన వ్యవస్థ లాభాపేక్ష లేని వ్యవస్థగా రూపుదిద్దాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుస్థిర, గుత్తాధిపత్య రహిత విత్తన వ్యవస్థకు ప్రోత్సాహం అందించే విధానాలు రూపొందించాలి. గాలి, నేల, నీరు వంటివి సహజ పర్యావరణ వనరులు. విత్తనాలు కూడా సహజ వనరు. ఏ ఒక్కరి సొంతమో కారాదు.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

అభినందనలు



దక్షిణాఫ్రికాకు అధ్యక్షులుగా తిరిగి ఎన్నికైన శ్రీమాన్ సిరిల్ రాంఫోసాకు శుభాభినందనలు. భారత– దక్షిణాఫ్రికా వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు నేను మీతో పనిచేయాలని ఎదురుచూస్తున్నాను.
– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

అసమర్థతే కారణం



దేశవ్యాప్తంగా ఆగని ఈ రైలు ప్రమాదాలకు పూర్తిగా రైల్వేశాఖ నిర్లక్ష్యం, దాని మంత్రి అశ్వినీ వైష్ణవ్ అసమర్థత కారణం. లోటుపాట్లను సరిదిద్దడంలో ఘోరంగా విఫలమైన మంత్రి వేలమంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టారు. ఏది అత్యుత్తమంగా ప్రధాని చేయగలరో అదే చేస్తున్నారు... దేశాన్ని పట్టాలు తప్పించడం!
– సాయోనీ ఘోష్, నటి, తృణమూల్ ఎంపీ

ఆగితేనే నీటు!



ఉత్తరప్రదేశ్‌లో 67 వైద్య కళాశాలలు ఉన్నాయి. పదివేల ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఈ కళాశాలలకు ప్రవేశాలు నీట్ ద్వారా జరుగుతున్నాయి. దీని సిలబస్ సీబీఎస్ఈ. రాష్ట్ర బోర్డ్ నుంచి కేవలం కొంతమందే వైద్య కళాశాలలకు ఎంపికవుతున్నారు. హిందీ మీడియం కూడా పెద్ద సమస్య. నీట్ ఆగిపోతే, యూపీ బోర్డ్ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది.
– దిలీప్ మండల్, సంపాదకుడు

తమలోనే భరిస్తారు



అంతర్ముఖులు బాధను వెల్లడించలేరు. వాళ్లు బలహీనులు కాదు. కానీ మీ మీద తమ బరువును మోపాలనుకోరు. అందుకే సాయం అడగటానికి బదులుగా ఒంటరిగా భరిస్తారు. నన్ను నమ్మండి. అదేం సమస్య కాదు. దాన్ని ఎదుర్కోవడం ఎలాగో వాళ్లు తెలుసుకున్నారు. ఒంటరిగానే!
– కరుణ్ పాల్, మైండ్‌సెట్ కోచ్

ఈద్ ముబారక్



ఈద్ ముబారక్. బోల్డంత ప్రేమ. బిర్యానీ, కోర్మా, కబాబులను నోరారా తినండి. మన శాకాహార మిత్రులకు ఎలాగూ సేవయా, దహీ పకోడీ ఉండనే ఉన్నాయి. బక్రీద్ రోజు మాత్రమే తమ గుహల్లోంచి బయటికి వచ్చి, తమ ఆహార అలవాట్ల పట్ల అభద్రతకు లోనయ్యేవారిని పట్టించుకోవద్దు. ఆహార అలవాట్లు ఒకరిని తక్కువ గానో, ఎక్కువగానో చేయవు. అవి ఎంపికలు. వాటిని గౌరవించాలి.
– సయేమా, రేడియో జాకీ

చెదరని బంధం



సామాజిక మాధ్యమాలు తప్ప ఇంకేమీ తెలియని వ్యాకుల యువతకు ఒక సూచన: బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య సంబంధం చెదరలేనిది. విడిపోలేనిది. దాని అంతర్గత వ్యవహారాల్లో భాగం కాని చాలామంది అవగాహనకు మించినది. అది కాలపరీక్షకు నిలిచినది. ఎందుకంటే ఒకదాని కడుపులోంచి ఇంకోటి జన్మించింది. కాబట్టి పతాక శీర్షికల మీద సమయం వృథా చేసుకోవద్దు.
– సునందా వశిష్ఠ, కాలమిస్ట్

వ్యక్తిగతం బాగుండొద్దా?



నేననుకోవడం... చాలా మంది, ముఖ్యంగా ఖరీదైన మ్యాగజైన్లను చదివేవాళ్లు, పెద్ద టీవీలను చూసే జనాల్లో ఇది విస్తృతాంగీకారం పొందిన విషయంగా మారిపోయింది. తమ వ్యక్తిగత జీవితం మామూలుగా ఉన్నప్పటికీ, వృత్తిపరమైన జీవితం మిరుమిట్లు గొలిపినట్లు ఉండటాన్ని మేలైనదిగా వీళ్లు భావిస్తున్నారు; రివర్సులో మాత్రం కాదు.
– రాబ్ హెండెర్సన్, రచయిత

ఇన్ బాక్స్

ఆజాదీకి ఓ పర్యాయపదం

నియంతలకు భయమెప్పుడూ
యుద్ధమంటేనో, బాంబులంటేనో కాదు
ప్రశ్నలంటే, ప్రశ్నించే శక్తులంటేనే
నాగులు కోరల్లో విషముంచుకుని బుసకొట్టేది
బలముందని కాదు
కాలి చెప్పుల అదుష్టకు అదిరిన భయంతోనే...
అబద్ధాలతో రొమ్మిరిచి నిలబడొచ్చనుకునే వాళ్ళు
సత్యం ముందు కురుచనవుతున్నామని తెలిస్తే...
కుట్రల చిట్టా పేరుస్తారు నిన్ను చిన్నగా చూపడానికి
సముద్రం తన గర్భాన రేగు అగ్నిపర్వతాల అలజడులను
అగుపడకుండా దాచగలదేమో కానీ బద్దలవకుండా ఆపలేదు
ఎగిసి పడే లావాను అడ్డుకోనూ లేదు

అరుంధతీ...
నీ గొంతెప్పుడూ ఏకాకి కాదు
వేల గొంతులు నినదిస్తాయి ఆజాదీ కోసం
నీ భుజమెప్పుడూ ఒంటరీ కాదు
మా భుజాలను నీ భుజంతో అంటుకడతాం ఆజాదీ కోసం
నీ అడుగులెప్పుడూ ఖాళీగా ఉండవు
లక్షలాదిగా నీ అడుగుల్లో అడుగులేస్తూ ప్రవహిస్తాం
మానవత్వపు పరిమళాలను పంచే ఆజాదీ కోసం

అరుంధతీ....
నీ పేరిపుడు 'ఆజాదీ'కి
ఓ పర్యాయపదం!

– దిలీప్. వి । 8464030808
(హక్కుల గొంతుక అరుంధతీ రాయ్‌కి మద్దతుగా...)

యువత తన కాళ్లపై తాను నిలవాలి!


అభిప్రాయం



ఈదర శ్రీనివాస రెడ్డి

మనుషులు తప్ప జీవ ప్రపంచంలోని ఏ జీవి అయినా పెరిగి పెద్దదైన తరువాత తల్లితండ్రులపై ఆధారపడటం తగ్గిస్తుంది. తన కాళ్లమీద తాను స్వతంత్రంగా నిలబడడానికి ప్రయత్నిస్తుంది. మనుషుల్లో కూడా చాలా సమాజాల్లో యువత టీనేజ్ దాటే సమయానికి బతకడం నేర్చుకుంటుంది. మన భారతీయుల్లోనే తల్లి తండ్రులపై ఎక్కువకాలం ఆధారపడుతున్నారు.

అమెరికాలో ఒకవ్యక్తికి 15 ఏళ్లు వచ్చాయంటే, తల్లి తండ్రులకు అతన్ని ఇక పెంచి పోషించాల్సిన బాధ్యతల నుండి విముక్తి లభించినట్లే. ఒకసారి కళాశాలలో అడుగు పెడితే, వారి ఖర్చులకు డబ్బు వారే సంపాదించుకోవాలి. చదువుకుంటూ, పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తూ వారి అవసరాలకు వాళ్ళే సంపాదించుకోవటం విదేశాలలో చూస్తుంటాము. కానీ మన దేశంలో ఉద్యోగం వచ్చేంత వరకు తల్లి తండ్రులే పోషించాల్సిన దుఃస్థితి ఏర్పడింది. వృద్ధులైన తల్లి తండ్రులను పోషిస్తూ, ఇటు ఎదిగి వచ్చిన పిల్లలను కూడా పోషించటం వల్ల మధ్య తరగతి వర్గం చితికి పోతున్నారన్నది వాస్తవం.



అదే ఎదిగి వచ్చిన పిల్లలు తమ కాళ్ళ మీద తాము నిలబడటం నేర్చుకుంటే, కొంతైనా భారం తగ్గుతుందని గుర్తుంచుకోవాలి. ఒకప్పుడు అమెరికా వంటి దేశాలకు ఉన్నత చదువుకై వెళ్లే యువత అక్కడ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ... తమ ఖర్చులకు తాము సంపాదించుకుంటూ చదువుకునే వాళ్ళు. అక్కడి యువతను చూసి మనవాళ్లూ అదే దారిలో నడిచేవాళ్లు. కాని, ఇప్పుడు అక్కడ కూడా తల్లి తండ్రుల మీద ఆధారపడే యువత ఎక్కువ అవుతోంది. 30 ఏళ్లు వచ్చినా ఇంకా తల్లి తండ్రుల మీద ఆధారపడే యువత సంఖ్య పెరిగిపోతోంది.

జంతువుల్లో కంగారూలు పిల్లల్ని చాలా కాలం మోస్తూ ఉంటాయి. అటువంటి తల్లి తండ్రులు మన దేశంలో ఎక్కువ అవుతున్నారు. దీనికి కొంత కారణం మన సంస్కృతిలో భాగమైన కుటుంబ వ్యవస్థ, కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న అనుబంధాలు కారణం. ఎదిగి వచ్చినా బతకలేని బిడ్డలను నెత్తి మీద మోస్తూ అప్పుల పాలవుతున్న వాళ్ళు అనేక మంది ఉన్నారు. కనీసం పెళ్ళి చేస్తేనన్నా బాధ్యతలు తెలిసివస్తాయని లక్షలకు లక్షలు ఖర్చు పెట్టి పెళ్ళిళ్ళు చేసినా వీరి ధోరణిలో మార్పు రావటం లేదు. పైపెచ్చు కొడుకుతో పాటు కోడలిని కూడా పోషించాల్సి వస్తోంది.

ఒకప్పుడు 1970వ దశకంలో చదువు లేకుండా, ఏ ఉద్యోగం లేకుండా తిరుగుతూ తల్లిదండ్రుల మీద ఆధారపడి బతికే వాళ్ల సంఖ్య ఎక్కువగా వుండేది. లండన్, జపాన్ వంటి దేశాల్లో సైతం వీరి సంఖ్య ఎక్కువగా వుండేది. వీళ్ళను 'ఫీటర్' అని పిలిచే వాళ్ళు. ఎప్పుడు అయితే కంప్యూటర్ సైన్స్ వల్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పెరిగాయో వీరి సంఖ్య తగ్గుతూ వచ్చింది. కాని, మళ్ళీ ఇప్పుడు వారి సంఖ్య పెరుగుతోంది. ఉన్నత చదువులు చదువుతున్న వారి సంఖ్య పెరిగినంతగా ఉద్యోగాలు పెరగకపోవటం, చదివిన చదువులు బతకటం ఎలాగో నేర్పక పోవటం, విలాస జీవనానికి అలవాటు పడటం, ధరల పెరుగుదల వంటివి ఇందుకు కారణాలుగా చెప్పవచ్చు.

చిన్నదైనా పెద్దదైనా సిగ్గుపడకుండా ఏదో ఒక పనిలో చేరి యువత తమ కాళ్ళ మీద తాము నిలబడాలి. 'శ్రమ విలువ తెలిసిన వాళ్ళు తాము కష్టపడి సంపాదించిన డబ్బులతో బతకాలని కోరుకుంటారు. కాని, పరాన్న జీవులే వయసు మీద పడుతున్నా తల్లితండ్రుల దగ్గర చెయ్యి చాస్తూవుంటారు. నేటి ఇంటర్నెట్ యుగంలో... సామాజిక మాధ్యమాలు, చలన చిత్రాల వల్ల చెడు అలవాట్లకు గురై తమ శ్రమ విలువను గుర్తించ లేకపోతున్నారు. ఇటువంటి వాళ్లు మధ్యతరగతి కుటుంబాల్లోనే ఎక్కువగా కనబడుతుంటారు. దేశంలో అంత కంతకూ పెరిగిపోతున్న నిరుద్యోగం కూడా దీనికి కారణమే. ప్రభుత్వాలు ఉపాధి కల్పనపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుంది. లేకపోత మనదేశానికి వరంగా భావిస్తున్న యువశక్తి శాపంగా మారి పరాన్న జీవుల సమాజంగా తయారవుతుంది అనటంలో ఏ సందేహం లేదు.

వ్యాసకర్త ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్

దేవుని సేవకు ఇదోమార్గం

భక్తి ఎక్కువైతే కొందరు ఊహాతీతంగా ప్రవర్తిస్తారు. వరగుణ పాండ్యన్ అనే రాజు ప్రవర్తన ఇందుకు మంచి ఉదాహరణ. తిరవిడై మరుదూర్ అనే ఊళ్లో ఆలయానికి కావలసిన నూనెను తీయడం కోసం ఒక రోజు నువ్వులు ఆరబెట్టారు. ఆ సమయంలో అటువైపుగా ఓ శివభక్తుడు వచ్చి ఓ పిడికెడు నువ్వులు తీసుకుని నోట్లో వేసుకున్నాడు. దేవుడి కోసం ఉపయోగించాలని ఎండబెట్టిన నువ్వుల్ని ఇలా నోట్లో వేసుకోవచ్చా? అది తప్పు కదా? అపచారం కదూ! అక్కడ కాపలా ఉన్నవారు ఇది చూశారు. 'అయ్యో... అపచారం అపచారం' అంటూ పరుగున వచ్చి అతనిని పట్టుకుని తీసుకుపోయి రాజు వరగుణ పాండ్యన్ ఎదుట హాజరుపరచారు.

జ్యోతిర్మయం

వరగుణ పాండ్యన్ అతని వంక తీక్షణంగా చూశాడు. నుదుట బొట్టుతో పరమ శివభక్తునిలా కనిపించిన అతడిని చూసి ఆశ్చర్యపోయాడు రాజు. ఈయన ఇలా చేయడమేమిటీ అని అనుకున్న రాజు నమ్మలేకపోతున్నాడు.

'నువ్విలా చేయడమేమిటీ?' అని అడిగాడు. దానికి ఆ భక్తుడు ఇలా చెప్పాడు... 'నేను ఆకలి వల్ల అలా చేశాను. ఈ ఊరు నాకు ఎంతో నచ్చింది. శివాపచారం చేస్తే ఏడు జన్మలకు ఈ ఆలయానికి గానుగ ఆడించే ఎద్దుగా పుడతారన్న విషయం తెలుసు. అందుకే అలా చేశాను' అన్నాడు. పూర్వం ఎద్దులతో గానుగను ఆడించి నూనెను తీసేవారు. పుడితే ఈ ఊళ్ళో పుట్టాలి. అదీనూ గానుగ ఆడించే ఎద్దుగా. ఆ ఆలయంలో సేవ చేయాలి. ఒక తప్పు చేస్తే ఆ అవకాశం దక్కుతుందని తెలిసి ఆ భక్తుడు అలా చేశాడు.

రాజు వరగుణ పాండ్యన్ భక్తుణ్ణి నోరు తెరవమన్నారు. శివభక్తుడు నోరు తెరిచాడు. అతని నోటిని రాజు చీలుస్తాడని అక్కడున్న వారందరూ అనుకున్నారు. కానీ రాజు భక్తుని నోటిలో అంటుకుని ఉన్న నువ్వుల్ని తీసి తన నోట్లో వేసుకున్నాడు. 'మీరు చేసిన అపచారాన్ని నేనూ చేశాను. మీతో కలిసి నేనూ గానుగ ఆడించే ఎద్దుగా పుడతాను' అన్నాడు రాజు. ఇలా ఉంటుంది అపరిమిత భక్తి గలవారి ప్రవర్తన. ప్రవర్తనలోని తప్పొప్పుల కన్నా వారి భావన ప్రధానమని గ్రహించాలి.

– యామిజాల జగదీశ్

19 నుంచి శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జ్యేష్ఠాభిషేకం జరుగనుంది. అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనాల కారణంగా శ్రీదేవి, భూదేవి, శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు నిర్వహించే ఉత్సవమే జ్యేష్ఠాభిషేకం. మొదటిరోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామికి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచం అలంకరించి పుర వీధుల్లో ఊరేగిస్తారు. రెండో రోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడో రోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు బంగారు కవచంతోనే ఉంటారు. జ్యేష్ఠాభిషేకం కారణంగా శ్రీవారి ఆలయంలో జూన్ 21వ తేదీ కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

వసతి గదుల కేటాయింపులో పారదర్శకత

శ్రీశైలం దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో వసతి గదుల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించనున్నట్లు ఆలయ ఈవో డి.పెద్దిరాజు తెలిపారు. ఆన్‌లైన్‌లో వసతి గదుల సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సాధారణ రోజుల్లో ఆలయానికి 10 వేల నుంచి 20 వేల మంది భక్తులు.. శని, ఆది, సోమవారాల్లో 20 వేల నుంచి 35 వేల మంది వస్తున్నారని చెప్పారు. వరుస ప్రభుత్వ సెలవులు, ముఖ్యమైన పర్వదినాల్లో ఆ సంఖ్య 40 వేల నుంచి 60 వేలకు చేరుతుందని తెలిపారు. రద్దీ రోజుల్లో భక్తులకు వసతి కష్టాలు తప్పడం లేదన్నారు. దేవస్థానం వసతి గదుల్లో సుమారు ఆరు వేల మందికి వసతి కల్పించే అవకాశం ఉందన్నారు. అలాగే క్షేత్రం పరిధిలో 55 కుల సంఘాలకు చెందిన అన్నదాన సత్రాలు ఉన్నాయని, వీటి ద్వారా 16 వేల మందికి వసతి లభిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం దేవస్థానం తమ పరిధిలోని వసతి గదులను, వీఐపీ కాటేజీలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిందని చెప్పారు. భక్తులు తమ ఇంటి వద్ద నుంచే వసతి గదులు పొందేలా www.srisailadevasthanam.org ఆన్‌లైన్ సదుపాయం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

వైఎస్సార్‌సీపీ నేత కరణం వెంకటేష్‌కు మోకాలి శస్త్రచికిత్స



చీరాల: వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌కు సోమవారం ముంబయిలో మోకాలి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. గతేడాది గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలికి గాయమైంది. తాత్కాలిక చికిత్స అనంతరం అప్పటి నుంచి నేటి వరకు ప్రజాక్షేత్రంలో ఆయన ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఎన్నికల అనంతరం మోకాలి శస్త్రచికిత్స నిమిత్తం కొద్దిరోజుల కిందట ఆయన ముంబయి వెళ్లారు. సోమవారం ఆయనకు నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైంది. త్వరలోనే చీరాల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల పక్షాన నిలుస్తానని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగా రాష్ట్రంలో దాడులు / ఎన్నికల అనంతరం రాష్ట్రంలో మానవ హక్కుల హననంపై ప్రజా సంఘాల ధ్వజం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలిచిన తరువాత రాష్ట్రంలో హింసాకాండ చెలరేగిపోయిందని, ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాలే లక్ష్యంగా కూటమి నేతలు దాడులతో చెలరేగిపోతున్నారని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడకముందు నుంచే కూటమి కార్యకర్తలు రాష్ట్రంలో విధ్వంసం ప్రారంభించారని, ప్రజాస్వామ్యవాదులంతా ఈ దాడులను ఖండించాలని చెప్పారు. ఎన్నికల అనంతరం ఏపీలో జరుగుతున్న మానవ హక్కుల హననంపై ప్రజా సంఘాల సమాలోచన సదస్సు (రౌండ్‌టేబుల్ సమావేశం) సోమవారం గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజిక కార్యకర్త, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేష్, ప్రముఖ అంబేద్కరిస్ట్, గాయకుడు రెంజర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై గళమెత్తారు. మానవ హక్కులను కాపాడేందుకు, రాష్ట్రంలో ప్రజా సంఘాలన్నీ కలిసి కూటమిగా ఏర్పడి పోరాటం చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి ఎన్నికల హింస వ్యతిరేక పోరాట సమితిగా నామకరణం చేశారు. అందరూ ఐక్యతతో, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగి, ఎన్నికల హింసను, పేద, బడుగు, బలహీన వర్గాలపై దాడులను అరికట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సదస్సుల్లో పాల్గొన్న వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది



ఏపీలో ఎన్నికల తరువాత జరుగుతున్న దాడులు చూస్తుంటే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందనే చెప్పుకోవచ్చు. నాయకులను ప్రజల చేత ఎన్నుకునే విధంగా రాజ్యాంగం రూపొందింది. నేడు ఆ రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా ప్రజలపై దాడులు జరుగుతున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. సోషల్ మీడియాను సమర్థవంతంగా మలుచుకుని పోరాటాలు చేయడంలో అందరూ కలిసికట్టుగా ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. నిరంతరం ఐక్యతతో ముందుకు సాగితేనే ఇలాంటి దాడులను ఆపగలం.

– బైరి నరేష్, సామాజిక కార్యకర్త, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు

యూపీ తరహా అరాచకాలకు ముఖ చిత్రంగా ఏపీ



యూపీ తరహా అరాచకాలకు ఏపీ ముఖచిత్రంగా మారుతోంది. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. జేసీబీలతో ఇళ్లను కూల్చివేయడం చూస్తుంటే యూపీలో పాలనే ఏపీలో కొనసాగుతుందేమో అనిపిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు హేయమైన చర్య. వీటిన్నింటినీ అడ్డుకునేందుకు ప్రజా సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలి. ఈ దాడులను వ్యతిరేకిస్తూ త్వరలో ప్రజాసంఘాలన్నింటితో కలిసి విస్తృత పోరాటం చేస్తాం.

– రెంజర్ల రాజేష్, అంబేద్కరిస్ట్, గాయకుడు

కూటమి పాలన ఎలా ఉండబోతోందో అర్థమవుతుంది



ఎన్నికల్లో కూటమి గెలిచిన తరువాత సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయకముందే రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లు చూస్తుంటే...కూటమి పాలన ఐదేళ్లలో ఏ విధంగా ఉంటుందో స్పష్టంగా అర్థమవుతోంది. ప్రజాసంఘాలన్నీ ఈ దాడులను అరికట్టేందుకు సరైన నిర్ణయంతో ముందుకు సాగాలి.

– చిలుక చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అధికారంలో ఉన్న పార్టీకి కొమ్ము కాస్తున్న అధికారులు



ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి అధికారులు కొమ్ము కాయడం బాధాకరం. ఎన్నికల ముందు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను మారిస్తే వారు జిల్లాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రత్యేక బృందాలను తీసుకువచ్చామని చెప్పినప్పటికి, ఎన్నికలైన తరువాత దాడులు జరగడం బాధాకరం. దాదాపు 30 గ్రామాల్లో మాదిగ పల్లెలను టార్గెట్ చేస్తూ కూటమి కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు పక్షపాతంతో వ్యవహరించడం సిగ్గుచేటు.

– కె.కృష్ణ, కుల నిర్మూలన పోరాట సమితి ప్రధాన కార్యదర్శి

చట్టబద్ధమైన పాలన లేకుండా పోయింది



రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చట్టబద్ధమైన పాలన లేకుండా పోయింది. ముఖ్యంగా పల్నాడులో వ్యాపారాలను స్వచ్ఛందంగా టీడీపీ నేతలకు అప్పగించాల్సిన పరిస్థితి. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతలకు తల వంచాల్సిన పరిస్థితులు చూస్తున్నాం. ముఖ్యంగా కుల ఆధిపత్యం చెలరేగిపోతోంది. ఈ దుష్పరిణామాలపై ప్రజా సంఘాలన్ని సంఘటితంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

– కోలా నవజ్యోతి, భారత్ బచావో గుంటూరు, కృష్ణా జిల్లాల ఆర్గనైజింగ్ సెక్రటరీ

అన్యాయంగా కేసులు పెడుతున్నారు



రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. అన్యాయంగా వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ అక్రమ కేసులను ఖండించాలి. బాధితుల పక్షాన ప్రజా సంఘాలన్నీ నిలబడి వారిలో మనోధైర్యాన్ని నింపాలి.

– జయసుధ, వీసీకే పార్టీ నాయకురాలు

ఐక్యతతో ముందుకు సాగాలి



రాష్ట్రంలో దాడులను ఐక్యతతో ఎదుర్కోవాలి. బాధితులకు అండగా ఉండాలి. వారి పక్షాన పోరాటం చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ప్రజా సంఘాలన్నీ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి.

– బాలరాజు, అంబేద్కరిస్ట్, నెల్లూరు

రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు



కూటమి సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయక ముందు నుంచే ఆ పార్టీల కార్యకర్తలు విధ్వంసం సృష్టిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సమంజసం కాదు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ గళం విప్పి కూటమి అరాచకాలను ఎండగట్టాలి.

– భాను, జర్నలిస్ట్

కలిసికట్టుగా ఒక తాటిపైకి రావాలి



రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ముఖ్యంగా దళితులు, బహుజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మాల, మాదిగలపై దాడులు పెరిగిపోయాయి. వీటిన్నింటిని అరికట్టాలంటే కలిసి కట్టుగా పోరాటం చేయాలి. దాడి చేయాలంటేనే భయపడే పరిస్థితులు రావాలి.

– వాసిమళ్ల విజయ్, క్రిస్టియన్ యూత్ ప్రెసిడెంట్

ఈవీఎంలు బ్యాన్ చేయాలి



ఈవీఎంలు బ్యాన్ చేయాలని కొన్ని సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నాం. వాటిని బ్యాన్ చేస్తేనే ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతాయి. ప్రజా సమస్యల మీద పోరాడే వారిపై దాడులు పరిపాటిగా మారాయి. గెలిచిన వారు ప్రజా రంజక పాలన అందించాలే గానీ, వ్యక్తిగత రాజకీయాలు చేయకూడదు.

– పొందుగల చైతన్య, హైకోర్టు న్యాయవాది

రాష్ట్రంలో యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన



77 సంవత్సరాల స్వాతంత్ర్యం అనంతరం కూడా రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా జరగడం గర్హనీయం. రాష్ట్రంలో మనిషిని మనిషిగా గౌరవించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మనుషుల మధ్య జరుగుతున్న హింసను అరికట్టాలి. బాధితుల తరపున హైకోర్టులో పోరాడటానికి మేం సిద్ధం.

– వేముల ప్రసాద్, హైకోర్టు అడ్వొకేట్

ప్రతి ఎన్నికల్లో దళిత పల్లెల్లో రక్తం పారుతోంది



ఎన్నికలు ఎప్పుడు జరిగినా దళిత పల్లెలే దాడులకు గురవుతున్నాయి. దాడుల్లో దళితుల రక్తం ఏరులై పారుతోంది. ఏపీలో కూటమి నేతలు దళిత పల్లెల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా గట్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– బూరం అభినవ్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ

విలాసాలు వద్దన్నందుకు తండ్రిని పొట్టన పెట్టుకున్న యువతి

- చపాతీ కర్ర, తాళం కప్ప, పరీక్ష అట్టతో తండ్రిపై దాడి
- తీవ్రంగా గాయపడి ఇంట్లోనే ప్రాణాలొదిలిన తండ్రి
- కటకటాల పాలైన ఉన్నత విద్యావంతురాలు
- నిందితురాలికి కొందరు యువకులతో సన్నిహిత సంబంధాలు
- పెళ్లి చేసుకోమని తండ్రి ఒత్తిడి చేయడంతో వివాదం



దొరస్వామి (ఫైల్)

మదనపల్లె: ఏడాదిన్నర క్రితం తల్లి చనిపోయింది. తండ్రి పర్యవేక్షణ కొరవడింది. పర్యవసానంగా ఉన్నత విద్యావంతురాలైన యువతి విలాసాలకు అలవాటుపడింది. పలువురు యువకులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించింది. చదువు, నేర్చుకున్న జ్ఞానం సంస్కారం నేర్పకపోగా.. మితిమీరిన విచ్చలవిడితనంతో కన్నతండ్రినే పొట్టన పెట్టుకునే స్థాయికి దిగజార్చింది. ఈ నెల 12న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కన్నతండ్రిపై కుమార్తె దాడి చేసిన ఘటన విదితమే. దీనిపై హత్య కేసు నమోదు చేసిన మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు ఆ యువతి (24)ను అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను మదనపల్లె డీఎస్పీ ప్రసాదరెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లా సదుం మండలం నాయనపాకాల పంచాయతీ చెరుకువారిపల్లెకు చెందిన ఈ.దొరస్వామి ఉద్యోగం నిమిత్తం 30 ఏళ్ల క్రితం మదనపల్లెకు వచ్చి పీ అండ్ టీ కాలనీలో స్థిరపడ్డాడు. కురవంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయన ఈ నెల 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అతడికి భార్య లత, కుమార్తె (24) ఉన్నారు. భార్య లత అనారోగ్యంతో ఏడాదిన్నర క్రితం మృతి చెందింది. ఆ దంపతుల ఏకైక కుమార్తె బీఎస్సీ, బీఈడీ పూర్తిచేసి ఇంటిపట్టునే ఉంటోంది.

పెళ్లి చేసుకోమని ఒత్తిడి తేవడంతో..

తల్లి చనిపోవడం, తండ్రి ఉద్యోగానికి వెళుతుండటంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న కుమార్తె కొందరు యువకులతో పరిచయాలు పెంచుకుని, వారితో సన్నిహితంగా ఉంటూ వచ్చింది. తల్లి నగలు, ఇంట్లోని డబ్బును తండ్రికి తెలియకుండా బాయ్ ఫ్రెండ్స్‌కు ఇవ్వడం మొదలుపెట్టింది. గమనించిన తండ్రి కూతురిని మందలించాడు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐలు వలీబాషు, యువరాజు, ఎన్.శేఖర్

ఒక్కగానొక్క కూతురు చెడిపోతుంటే చూస్తూ ఉండలేక బైరెడ్డిపల్లెలో తెలిసిన సంబంధం చూశాడు. పెళ్లి చేసుకోవాలని కూతురిపై ఒత్తిడి తేవడం మొదలుపెట్టాడు. స్నేహితులతో సరదాగా, చీకూచింతా లేకుండా సంతోషంగా ఉండటానికి అలవాటుపడిన ఆ యువతి తండ్రి మాటలను లెక్కపెట్టకపోగా ఎదురుతిరిగి గొడవకు దిగేది. ఈ క్రమంలో మొదట రమేష్ అనే వ్యక్తితో సన్నిహితంగా ఉంటూ వచ్చిన యువతి అతడికి కారు కొనుగోలుకు, ఇతర అవసరాలకు ఫైనాన్స్ కంపెనీల్లో నగలు కుదువపెట్టి రూ.11.40 లక్షలు ఇచ్చింది. విషయం తండ్రి దొరస్వామికి తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేసి రమేష్ నుంచి కొంతమేర డబ్బులు వసూలు చేసుకున్నాడు. తర్వాత సాయికృష్ణ అనే మరో యువకుడితో సన్నిహితంగా ఉంటూ అతడికి రూ.8 లక్షలిచ్చింది. తర్వాత హరీష్‌రెడ్డి అనే యువకుడితోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగించింది. పెళ్లీడుకొచ్చిన పిల్ల రోజుకో యువకుడితో సన్నిహితంగా ఉంటూ తన పరువు, ప్రతిష్టలకు మచ్చ తెస్తోందన్న భయంతో తండ్రి దొరస్వామి.. పెళ్లిచేస్తే కూతురు దారికి వస్తుందని భావించాడు. పెళ్లి కోసం కూతురిపై ఒత్తిడి తీసుకొచ్చాడు. నెల రోజులుగా ఇదే విషయమై తండ్రి, కుమార్తె మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 12న రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటి మిద్దెపైన రూమ్‌లో ఉంటున్న కూతురితో దొరస్వామి గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఆవేశంలో కూతురు ఇంటి తాళం కప్పతో తండ్రిపై దాడికి పాల్పడింది. తీవ్రంగా గాయపడిన దొరస్వామి కిందకు వచ్చి గాయాలను సెల్‌ఫోన్‌లో వీడియో రూపంలో చూసుకుని, బాధలో మద్యం సేవించాడు. తిరిగి కూతురితో గొడవ పడేందుకు పైకి వెళ్లాడు. అప్పటికే ఆవేశంతో రగిలిపోతున్న ఆ యువతి మళ్లీ తండ్రి గొడవపడేందుకు పైకి రావడంతో పట్టరాని కోపంతో వంటింట్లో ఉన్న చపాతీ కర్రతో విచక్షణా రహితంగా దాడి చేసింది. తర్వాత పరీక్ష రాసే అట్ట, చెంబు.. ఇలా అందుబాటులో ఉన్న వస్తువులన్నింటినీ వాడి తండ్రిని అపస్మారక స్థితిలోకి వెళ్లేలా కొట్టింది. తండ్రి, కూతురి అరుపులు విన్న స్థానికులు ఏమైందోనని పైకి వెళ్లి చూడగా.. తండ్రి దొరస్వామి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వాహనం వచ్చేలోపు ఘటనా స్థలంలోనే ఊపిరి వదిలేశాడు. దొరస్వామికి బంధువు నారాయణయ్య ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సాంకేతికతను వినియోగించి అరెస్ట్

జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో సీఐలు వలీబాషు, యువరాజు, ఎస్.శేఖర్ ఈ కేసును దర్యాప్తు చేశారు. హత్య జరిగిన ప్రదేశంలో లభించిన వస్తువులు, క్లూస్‌టీం, పోలీస్ జాగిలాలతో జరిపిన తనిఖీలు, నిందితురాలు ఫోన్‌లోని కాల్‌డేటాలో లభించిన అన్ని అంశాలు, సాంకేతికతను వినియోగించి దొరస్వామి కుమార్తెను నిందితురాలిగా నిర్ధారించారు. శనివారం పీ అండ్ టీ కాలనీలోని ఇంటివద్ద ఆమెను అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలికి వైద్యపరీక్షలు నిర్వహించి, కోర్టులో హాజరుపరిచారు.

'బొండా'.. నీది అధికార మదం

దళితుడినైన నన్ను వేధిస్తున్నావు.. నీ పతనం ప్రారంభమైంది

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేస్తే అరాచకం చేస్తావా?
- టీడీపీలో ఉండగా నీ చేతులతోనే నా ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశావు
- అప్పుడు అక్రమాలు కనిపించలేదా? ఇప్పుడు కూలగొట్టించావు
- నీ అరాచకాలకు నిరసనగా గుండు గీయించుకుంటున్నా
- విజయవాడ టీడీపీ ఎమ్మెల్యేపై వైఎస్సార్‌సీపీ దళిత నేత నందెపు జగదీష్ ఫైర్



కండువాతో తనను తాను బంధించుకుని నిరసన తెలియజేస్తున్న దళిత నేత జగదీష్

సాక్షి ప్రతినిధి, విజయవాడ/పాయకాపురం (విజయవాడ రూరల్): 'ఉమా.. నీకు అధికార మదం తలకెక్కింది. ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పనిచేసిన నన్ను వేధిస్తున్నావు. అక్రమ నిర్మాణం పేరుతో మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి నా ఇంటిని కూలగొట్టించావు. నేను టీడీపీలో ఉండగా నీ చేతుల మీదుగానే భవన నిర్మాణానికి భూమిపూజ, గృహ ప్రవేశం చేశావు. ఈరోజు నేను పార్టీ మారగానే సక్రమ నిర్మాణం కాస్తా అక్రమమైందా? ఎన్నికల్లో నీకు వ్యతిరేకంగా పని చేశానని దళితుడినైన నాపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నావు.. అరాచకం సృష్టిస్తున్నావు. ఉమా.. నీ పతనం ప్రారంభమైంది'.. అంటూ వైఎస్సార్‌సీపీ దళిత నేత, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు నందెపు జగదీష్ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా ఆగడాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపులకు పాల్పడడాన్ని నిరసిస్తూ సోమవారం జగదీష్ విజయవాడ ప్రకాష్‌నగర్‌లోని తన ఇంటి వద్ద గుండు గీయించుకుని, అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

2012లో నేను ప్రకాష్‌నగర్‌లో కాట్రగడ్డ హరిబాబు అనే వ్యక్తి నుంచి 224 గజాల స్థలాన్ని కొని అన్ని అనుమతులు తీసుకుని ఇల్లు కట్టుకున్నా. 2014లో టీడీపీలో ఉన్న సమయంలోనే అక్కడ ఇంటి నిర్మాణం జరిగింది. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న బొండా చేతుల మీదుగానే భూమి పూజ జరిగింది. ఉమా తీరు, ఆయన విధానాలు నచ్చక నేను ఈ మధ్య వైఎస్సార్‌సీపీలో చేరి ఉమాకు వ్యతిరేకంగా మొన్నటి ఎన్నికల్లో పనిచేశా. ఇది మనసులో పెట్టుకుని ఎన్నికల్లో గెలవగానే దళితుడినైన నాపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. గతంలో నేను టీడీపీలో ఉన్నా. కార్పొరేటర్‌గా కూడా గెలుపొందా. అప్పుడు బొండా ఉమా ఎమ్మెల్యేగా గెలుపొందడానికి ఎంతో కృషిచేశా. తిరువూరులో ఎమ్మెల్యేగా పోటీచేస్తానని చెప్పగా 'నా కింద పనిచేసే దళితుడవు.. ఎమ్మెల్యేగా పోటీచేస్తావా' అంటూ ఆయన నాపై కక్ష పెంచుకున్నారు. ఇప్పుడు నా ఇల్లు అక్రమ నిర్మాణం అంటూ మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి కూలగొట్టించారు. 2014లో భూమిపూజ చేసిన రోజు సక్రమంగా ఉండి ఈరోజు అదెలా అక్రమం అయ్యిందో బొండా సమాధానం చెప్పాలి. నా ఇంటిని క్రమబద్ధీకరించాలని గతంలోనే దరఖాస్తు చేశా. కానీ, బొండా ఒత్తిడికి మున్సిపల్ అధికారులు తలొగ్గి అది అక్రమ నిర్మాణమంటూ నోటీసులు జారీ చేశారు. నోటీసుల్లో 24 గంటల వ్యవధి అంటూ పేర్కొని.. నేను లేనప్పుడు నోటీసిచ్చిన ఎనిమిది గంటల్లోపే కూల్చేశారు. ఎక్కడ అక్రమం జరిగిందో చెబితే నేనే నిర్మాణాన్ని తొలగించేవాడిని. కానీ, బొండా కక్ష సాధింపులకు అధికారులు సహకరిస్తున్నారు. నేను, నా భార్య ఎమ్మెల్యే కాళ్లపై పడితే వదిలేస్తానని చెబుతున్నారు. కానీ, నేను ఏ తప్పూ చేయలేదు.. ఎవరి కాళ్లపై పడాల్సిన అవసరంలేదు. ఇకపై బొండా అరాచకాలను నియోజకవర్గంలో ప్రచారం చేస్తా. కూల్చిన భవనం ఫొటోలు ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రచారం చేస్తా.


నేను సమరయోధుల భూములు ఆక్రమించుకోలేదు..


ఇక బొండా ఉమా మాదిరిగా నేను స్వాతంత్ర్య సమరయోధుల స్థలాలను ఆక్రమించుకోలేదు. నేను స్థలం కొని ఇల్లు కట్టాను. అప్పట్లో ఎమ్మెల్యే బొండా ఉమా స్వాతంత్ర్య సమరయోధుల స్థలాలు ఆక్రమించుకున్నారని, టీడీపీ ప్రభుత్వంలోనే ఆయన భార్యపై కేసు నమోదైంది. ఇక అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామంటున్న మున్సిపల్ అధికారులు భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లోని బొండా అక్రమ భవనాలను కూల్చగలరా? ఇదే రోడ్డులో వందల అక్రమ నిర్మాణాలు ఉన్నా వాటినెందుకు కూల్చలేదు? నేను వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నానని, దళితుడిని కావడంవల్లే నాపై వేధింపులకు పాల్పడుతున్నారు.

అధికారులు తస్మాత్ జాగ్రత్త..

బొండా ఉమాతో మున్సిపల్, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి. గతంలో ఎంతోమంది అధికారులపై దురుసుగా ప్రవర్తించిన చరిత్ర అతనిది. ఎల్లకాలం ఒకే ప్రభుత్వం ఉండదు.. అధికారులు చట్టబద్ధంగా నడుచుకోవాలి. ఉమా ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ఏ అధికారి పనిచేయలేరు. సెంట్రల్ నియోజకవర్గం నుంచి బదిలీ చేసుకుని వెళ్లిపోవాలి. బంగారంలాంటి ఉద్యోగ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. నాకు జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటం చేస్తా. బొండా అరాచకాలను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తా.

పద్మావతీ అమ్మవారి తెప్పోత్సవాలు ప్రారంభం





చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే తెప్పోత్సవాల్లో తొలిరోజు రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత శ్రీకృష్ణ స్వామిని సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి నాలుగు గంటల వరకు స్వామి వారి ముఖ మండపంలో వేదపారాయణం, మంగళవాయిద్యాల నడుమ ఉభయదేవేర్లతో సహా స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ఉభయదేవేర్లతో సహా స్వామి వారిని వేంచేపుగా ఆలయం నుంచి అమ్మవారి పుష్కరిణికి తీసుకొచ్చి తెప్పపై కొలువుదీర్చారు. అనంతరం 6.30 గంటలకు సర్వాంగ శోభితుడైన స్వామి వారు ఉభయదేవేర్లతో సహా మూడు పర్యాయాలు పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. రాత్రి 7.30 గంటలకు స్వామి వారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కాగా, తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసుందరరాజస్వామికి స్నపన తిరుమంజనం జరుగనుంది. సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు.

నేడు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ నెల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ నెల కోటాను మంగళవారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎల్రక్టానిక్ డిప్ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందాక ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల కోటాను ఉదయం 11 గంటలకు, వయో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అలాగే ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో ఆగస్టు నెల గదుల కోటాను ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటలకు, తిరుమల–తిరుపతి శ్రీవారి సేవ కోటాను ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ టికెట్లు మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ టికెట్లు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ బాట గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 69,870 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి స్వామివారి దర్శనం 24 గంటల సమయం పడుతోంది.



బెంగాల్‌లోని రంగపాణి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం గూడ్స్ రైలు వెనుక నుంచి ఢీకొనడంతో పైకి లేచిన కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ బోగీ

● పశ్చిమ బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టిన గూడ్స్ రైలు

పట్టాలు తప్పిన మూడు కోచ్‌లు

9 మంది దుర్మరణం.. 41 మందికి గాయాలు

న్యూజల్పాయ్‌గురి/కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. వేగంగా వస్తున్న గూడ్స్ రైలు రెడ్ సిగ్నల్‌ను జంప్ చేసి అదే ట్రాక్‌పై నిలిచిఉన్న కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. త్రిపురలోని అగర్తలా నుంచి బెంగాల్‌లోని సీల్దాకు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి మూడు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఇందులో ఒక గార్డు కోచ్, రెండు పార్సిల్ కోచ్‌లు ఉన్నాయి. అదృష్టవశాత్తూ ప్రయాణికుల కోచ్‌లకు నష్టం వాటిల్లలేదు. ఉత్తర బెంగాల్‌లో న్యూజల్పాయ్‌గురి రైల్వేస్టేషన్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని రంగపాణి స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. 41 మంది గాయపడ్డారు. గూడ్స్ రైలు లోకో పైలట్, ఎక్స్‌ప్రెస్ రైలు గార్డు తోపాటు ఏడుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని రైల్వేశాఖ అధికారులు వెల్లడించారు. రైలు ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే రైల్వేశాఖతోపాటు పశ్చిమ బెంగాల్ అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. కోచ్‌ల్లో ఇరుక్కుపోయిన ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

రెడ్ సిగ్నల్ పడినా..

గూడ్స్ రైలు లోకో పైలట్ నిర్లక్ష్యం వల్లే రైలు ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో మానవ తప్పిదం ఉండొచ్చని, రెడ్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ లోకో పైలట్ ఆగకుండా ముందుకు దూసుకెళ్లడంతో ఎక్స్‌ప్రెస్ రైలును వెనుకనుంచి ఢీకొట్టినట్లు భావిస్తున్నామని రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మ సిన్హా చెప్పారు. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు చోటుచేసుకున్నాయా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఒకే సింగిల్ ట్రాక్‌పై రెండు రైళ్లు అత్యంత సమీపంలోకి వచ్చేలా సిగ్నల్ ఎలా ఇచ్చారన్న దానిపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద తీవ్రతకు కాంచనజంగ్ ఎక్స్‌ప్రెస్ చివరి భాగంలోని మూడు కోచ్‌లు పట్టాలు తప్పాయి. రెండు కోచ్‌లు పూర్తిగా పక్కకు ఒరిగిపోగా, మరో కోచ్ గాల్లోకి లేచి అలాగే వేలాడుతోంది. గూడ్స్ రైలు ఇంజన్ దానికిందికి చొచ్చుకొచ్చింది. వేలాడుతున్న కోచ్‌ను అధికారులు తొలగించారు. మధ్యాహ్నం 12.40 గంటలకు మిగిలిన కోచ్‌లతో ఎక్స్‌ప్రెస్ రైలు ఘటనా స్థలం నుంచి కోల్‌కతా వైపు ప్రయాణం సాగించింది.

కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ దర్యాప్తు

ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షించడానికి రైల్వేశాఖ మంత్రి వైష్ణవ్ రంగంలోకి దిగారు. లిఫ్ట్ అడిగి బైక్‌పై ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంపై కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షల చొప్పున, స్వల్పగాయాలైన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు.

రాష్ట్రపతి, ప్రధానమంత్రి దిగ్భ్రాంతి

సాక్షి, న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఘోర ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

ఇదంతా మోదీ సర్కారు నిర్వాకం: కాంగ్రెస్

బెంగాల్ రైలు ప్రమాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ నేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్వాకం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం రైల్వేశాఖను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. మోదీ పదేళ్ల పాలనలో రైల్వేశాఖ తల్లిదండ్రులు లేని అనాథగా మారిందని సీఎం మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. రైల్వే శాఖ గత వైభవాన్ని కోల్పోయిందన్నారు.

ఆ మార్గంలో 'కవచ్' లేదు

రైళ్లు పరస్పరం ఢీకొట్టకుండా కవచ్ వ్యవస్థను రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. అయితే, గౌహతి-ఢిల్లీ మార్గంలో ఈ వ్యవస్థను ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు. కాంచనజంగ ప్రమాదం జరిగిన ప్రాంతం ఇదే మార్గంలో ఉంది.

కొంపముంచిన టీఏ912 లెటర్!

కాంచనజంగ రైలు ఘటనలో మరో కోణం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రమాదం వెనుక గూడ్స్ రైలు లోకో పైలట్ తప్పిదం లేదని తెలుస్తోంది. రాణిపాత్ర స్టేషన్, ఛత్తర్‌హట్ జంక్షన్ మధ్యలో కాంచనజంగ రైలును గూడ్స్ రైలు ఢీకొట్టింది. అయితే, సోమవారం ఉదయం 5.50 గంటల నుంచి ఈ మార్గంలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయక పోవడంతో రెడ్‌సిగ్నల్ ఉన్నప్పటికీ ముందుకెళ్లాలని లోకో పైలట్‌కు సూచించినట్లు వెల్లడయ్యింది. ఈ మేరకు రైల్వేశాఖ అంతర్గత నివేదిక ఒకటి వెలుగులోకి వచ్చింది. ఈ నివేదిక ప్రకారం.. రాణిపాత్ర స్టేషన్ మాస్టర్ టీఏ912 పేరిట లోకో పైలట్‌కు లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. రాణిపాత్ర స్టేషన్, ఛత్తర్‌హట్ జంక్షన్ మధ్యలో ఏ సిగ్నల్ పడినా దాటుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. అదే ట్రాక్‌పై మరో రైలు లేకపోతే సిగ్నల్‌తో సంబంధం లేకుండా ముందుకెళ్లడానికి టీఏ912 లెటర్ జారీ చేస్తుంటారని రైల్వేవర్గాలు వెల్లడించాయి. ప్రమాదం జరిగిన ట్రాక్‌పై అంతకుముందే ఒక రైలు వెళ్లింది. మరో సెక్షన్‌లోకి ప్రవేశించింది. దాంతో ట్రాక్‌పై రైలు లేదన్న అంచనాతో స్టేషన్ మాస్టర్ టీఏ912 జారీ చేసినట్లు అనుమానిస్తున్నారు. కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం 8.27 గంటలకు రంగపాణి స్టేషన్‌ను దాటేసింది. రాణిపాత్ర స్టేషన్, ఛత్తర్‌హట్ జంక్షన్ మధ్యలో ట్రాక్‌పై నిలిచిపోయింది. ఎందుకు నిలిచిందన్నది తెలియడంలేదు. గూడ్స్ రైలు ఉదయం 8.42 గంటలకు రంగపాణి స్టేషన్‌ను దాటేసి సరిగ్గా 8.55 గంటలకు కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఏడాది క్రితం జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనను గుర్తుకుతెచ్చింది.

వయనాడ్ నుంచి ప్రియాంక

రాయ్‌బరేలీ ఎంపీగానే రాహుల్ గాంధీ ● ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ స్థానాల్లో ఎంపీగా విజయం సాధించిన రాహుల్ గాంధీ ఇకపై రాయ్‌బరేలీ నుంచే కొనసాగుతారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. రెండింటా గెలిస్తే చట్టం ప్రకారం ఒక స్థానంలోనే కొనసాగాలి కాబట్టి రాయ్‌బరేలీ నుంచే రాహుల్ గాంధీ కొనసాగుతారని స్పష్టం చేశారు. ఎంతో అంతర్మథనం, చర్చల తర్వాత పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని అంగీకరించిన రాహుల్‌కు ఖర్గే ధన్యవాదాలు తెలిపారు. రాయ్‌బరేలీ స్థానంతో రాహుల్ కుటుంబానికి తరతరాలుగా అనుబంధం ఉందని గుర్తుచేశారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు కూడా రాయ్‌బరేలీ నుంచే రాహుల్ కొనసాగాలని కోరుకుంటున్నారని చెప్పారు. వయనాడ్ ప్రజల ప్రేమాభినాలు రాహుల్‌కు లభించాయన్నారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రియాంకా గాంధీ ఎంతో సహకరించారని ఖర్గే అభినందించారు. రాహుల్ ఏ స్థానం వదులుకోవాలన్న అంశంపై కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకా గాంధీ, కె.సి.వేణుగోపాల్ తదితరులు సోమవారం ఢిల్లీలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే, రాహుల్ మీడియాతో మాట్లాడారు. రాయ్‌బరేలీతోపాటు వయనాడ్‌తో తనకు భావోద్వేగపూరిత అనుబంధం ఉందని రాహుల్ గాంధీ అన్నారు. వయనాడ్‌ను వదులుకోవడం చాలా కఠిన నిర్ణయమేనని వెల్లడించారు. గత ఐదేళ్లపాటు వయనాడ్ ఎంపీగా కొనసాగడం అద్భుతమైన అనుభవం అని చెప్పారు. వయనాడ్ ప్రజలు తనకు అండగా నిలిచారని, సంక్షోభ సమయాల్లో తనకు కొత్త శక్తిని ఇచ్చారని కొనియాడారు. వారిని ఎప్పటికీ మర్చిపోలేనని వ్యాఖ్యానించారు. ఇకపై కూడా వయనాడ్‌ను సందర్శిస్తానే ఉంటానని, అక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని ఉద్ఘాటించారు. ఐదేళ్లపాటు ఎంతో ప్రేమాభిమానాలు పంచిన వయనాడ్ ప్రజలకు రాహుల్ ధన్యవాదాలు తెలియజేశారు. వయనాడ్ నుంచి తన సోదరి ప్రియాంక పోటీ చేస్తుందని తెలిపారు. తమకు ఇద్దరు ఎంపీలు ఉన్నట్లుగా భావించాలని వయనాడ్ ప్రజలకు రాహుల్ సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న రాహుల్, ప్రియాంక

సంతోషంగా ఉంది: ప్రియాంకా గాంధీ

వయనాడ్ నుంచి తాను పోటీ చేయాలని పార్టీ తీసుకున్న నిర్ణయంపై ప్రియాంకా గాంధీ సంతోషం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా రాయ్‌బరేలీ, అమేథీలో పనిచేశానని, ఆ బంధం ఎట్టి పరిస్థితుల్లోనూ తెగిపోదని అన్నారు. ఆ బంధాన్ని కొనసాగించేందుకు తాను, రాహుల్ ఉన్నామని చెప్పారు. రాయ్‌బరేలీ, వాయనాడ్‌లో తనతో పాటు రాహుల్ ఉంటూ ఇద్దరం కలిసి పనిచేస్తామని తెలిపారు. రాహుల్ అందుబాటులో లేరన్న అభిప్రాయం వయనాడ్ ప్రజల్లో కలగకుండా చూస్తానని ప్రియాంక గాంధీ చెప్పారు.

తొలిసారిగా పోటీ చేస్తున్న ప్రియాంక

ప్రియాంకా గాంధీ 2019లో క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టారు. అతిత్వరలోనే కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. సార్వత్రిక ఎన్నికల్లో యూపీలోని రాయ్‌బరేలీ లేదా అమేథీ లేదా వారణాసిలో పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, పోటీకి దూరంగానే ఉన్నారు. ప్రచారంలో పాల్గొన్నారు. రాయ్‌బరేలీ, అమేథీలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. రాహుల్ ఖాళీ చేస్తున్న వయనాడ్ రాడ్ స్థానానికి ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక జరుగనుంది. 52 ఏళ్ల ప్రియాంక ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తుండడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

పోప్‌ను అవమానించడం మా ఉద్దేశం కాదు

క్రైస్తవులకు క్షమాపణ చెప్పిన కేరళ కాంగ్రెస్

తిరువనంతపురం: పోప్-మోదీ భేటీపై సోషల్ మీడియాలో చేసిన కామెంట్ పట్ల కేరళ కాంగ్రెస్ క్రైస్తవ సమాజానికి క్షమాపణలు చెప్పింది. పోప్‌ను అవమానించడం తమ ఉద్దేశం కాదని స్పష్టత ఇచ్చింది. జీ7 సదస్సులో పోప్ ఫ్రాన్సిస్‌తో మోదీ భేటీపై కేరళ కాంగ్రెస్ పార్టీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో చేసిన పోస్టు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. మోదీ-పోప్ ఫోటోను పోస్టు చేసిన కేరళ కాంగ్రెస్.. దానికి "చివరకు దేవున్ని కలిసే అవకాశం పోప్‌కు దక్కింది" అని క్యాప్షన్ రాసింది. ఆ పోస్టుపై బీజేపీతో పాటు ఇతర పార్టీలు విమర్శలు గుప్పించాయి. దీంతో తన సోషల్ మీడియా అకౌంట్ నుంచి ఆ పోస్టును తొలగించిన కేరళ కాంగ్రెస్, క్రైస్తవులకు క్షమాపణలు చెప్పింది.

ఎన్ఐఏ చేతికి 'బస్సుపై ఉగ్రదాడి' కేసు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఇటీవల బస్సుపై ఉగ్రవాదుల దాడి కేసు దర్యాప్తును కేంద్రం హోంశాఖ... జాతీయ పరిశోధన సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది. జమ్మూకశ్మీర్ శాంతిభద్రతలు, అమర్‌నాథ్ యాత్రకు సంబంధించిన సన్నాహాలపై వరుస సమీక్షా సమావేశాల అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ నుంచి మాతా వైష్ణోదేవీ ఆలయానికి వెళ్తున్న యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై రియాసి జిల్లాలో జూన్ 9న ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. డ్రైవర్‌కు బుల్లెట్ తగలడంతో బస్సు అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మహిళలు సహా తొమ్మిది మంది మరణించారు. 41 మంది గాయపడ్డారు.

జార్ఖండ్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి

చైబాసా: జార్ఖండ్ రాష్ట్రం పశ్చిమ సింహ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. గువా పోలీస్‌స్టేషన్ పరిధిలోని లిపుంగా ప్రాంతంలో సోమవారం ఉదయం 5 గంటల సమయంలో కాల్పులు చోటుచేసుకున్నట్లు ఐజీ అమోల్ వి హోంకార్ చెప్పారు. మావోయిస్టు పార్టీ ఏరియా కమాండర్ టైగర్ అలియాస్ పాండు హన్స్‌దా, బత్రి దేవ్‌గమ్‌లను అదుపులోకి తీసుకోవడంతోపాటు ఒక ఇన్సాస్ రైఫిల్, రెండు ఎస్ఎల్ఆర్‌లు, మూడు రైఫిళ్లు, ఒక పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతులను జోనల్ కమాండర్ కండె హొన్హాగా, సబ్ జోనల్ కమాండర్ సింగ్‌రాయ్ అలియాస్ మనోజ్, ఏరియా కమాండర్ సూర్య అలియాస్ ముండా దేవ్‌గమ్, మహిళా నక్సల్ జుంగా పుర్తి అలియాస్ మర్లా, సప్ని హన్స్‌డాగా గుర్తించామన్నారు.

నిక్కీ హేలీ తండ్రి కన్నుమూత

ఫాదర్స్ డే రోజు ప్రొఫెసర్ అజిత్ సింగ్ మృతి

సౌత్ కరోలినా(యూఎస్ఏ): సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీకి పితృ వియోగం కలిగింది. తన తండ్రి ప్రొఫెసర్ అజిత్ సింగ్ రణ్‌ధవా(64) ఫాదర్స్ డే నాడు 16న తుదిశ్వాస విడిచారని ఆమె ప్రకటించారు. ఎంతో దయార్ద్ర హృదయం కలిగిన వ్యక్తిగా పేర్కొంటూ తన తండ్రిని హత్తుకున్నప్పటి ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేశారు. 'నా తండ్రి లేరనే విషయం తెలిసి నా హృదయం బరువెక్కింది. నలుగురు పిల్లలకు శ్రమించే తత్వం, విశ్వాసం, దయాగుణాలను ఆయన నేర్పారు. ముత్తాత, తాత, తండ్రి, భర్తగా ఆయన ఎంతో ప్రియమైన వ్యక్తి. హ్యాపీ ఫాదర్స్ డే డాడీ. మేమంతా మిమ్మల్ని కోల్పోతున్నాం'అని పేర్కొన్నారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న అజిత్ సింగ్.. నిక్కీ జీవితంలో ప్రతి నిర్ణయం వెనుక ప్రేరణగా నిలిచారు.

నేడు ఉత్తర కొరియాకు పుతిన్

● రెండు రోజుల పర్యటనను ధ్రువీకరించిన ఇరు దేశాలు
● గతేడాది రష్యాలో పర్యటించిన ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్



కిమ్‌తో పుతిన్ (ఫైల్)

సియోల్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మంగళవారం ఉత్తర కొరియాకు వెళ్లనున్నారు. కిమ్ ఆహ్వానం మేరకు పుతిన్ మంగళ, బుధవారాల్లో తమ దేశంలో పర్యటించనున్నట్లు కొరియన్ సెంట్రల్ అధికారిక న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రకటనను ఇరు దేశాలు ధ్రువీకరించాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు, ఉత్తర కొరియా ప్యాంగ్యాంగ్ క్షిపణుల పరీక్షల నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. గతేడాది చివరలో ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ రష్యాలో పర్యటించడం సంచలనమైంది. ఉక్రెయిన్‌పై రష్యా తీవ్రమైన దాడులు చేస్తుండటంతో రష్యాకు అవసరమైన ఆయుధ సంపత్తిని ఉత్తర కొరియా సరఫరా చేస్తోందని, అందుకు బదులుగా రష్యా నుంచి అణు సాంకేతికతను పొందుతోందని దక్షిణ కొరియాతోపాటు అమెరికా ఆరోపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వమున్న రష్యా.. ఉత్తర కొరియాతో ఆయుధ వాణిజ్యం చేస్తే యూఎన్ తీర్మానాలను ఉల్లంఘించడమేనని అంటున్నాయి. అయితే, ఉత్తర కొరియా, రష్యా ఈ కథనాలను ఖండించాయి. కాగా, రష్యా అధ్యక్షుడు ఉత్తర కొరియాలో పర్యటించడం 24 ఏళ్లలో ఇది ప్రథమం. పుతిన్ మొదటిసారి జూలై 2000లో ఉత్తర కొరియాలో పర్యటించారు. మొదటి ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత, అప్పుడు ఉత్తర కొరియాను పాలిస్తున్న కిమ్ తండ్రి కిమ్ జోంగ్ ఇల్‌తో సమావేశమయ్యారు.

పుతిన్ కోసం విలాసవంతమైన వేడుక

1991లో సోవియట్ పతనం తర్వాత ఉత్తర కొరియాతో రష్యా సంబంధాలు బలహీన పడ్డాయి. కిమ్ జోంగ్ ఉన్ తొలిసారిగా 2019లో రష్యాలోని తూర్పు నౌకాశ్రయం వ్లాడివోస్టాక్‌లో పుతిన్‌తో సమావేశమయ్యారు. మళ్లీ పుతిన్, కిమ్‌లు ఇరుదేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. ఈ సంవత్సరం ప్రారంభంలో పుతిన్.. కిమ్‌కు హై-ఎండ్ ఆరస్సెనాట్ కారును పంపారు. ఇప్పుడు ఇరు దేశాల మధ్య అనుబంధాన్ని బయటి ప్రపంచానికి తెలిపేందుకు పుతిన్ కోసం విలాసవంతమైన వేడుకను కిమ్ సిద్ధం చేస్తున్నారు. రాజధాని ప్యాంగ్యాంగ్‌లోని ఒక చౌరస్తాలో భారీ కవాతు కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉపగ్రహ చిత్రాలు తెలుపుతున్నాయని ఓ న్యూస్ వెబ్‌సైట్ విశ్లేషించింది. ఉక్రెయిన్‌పై యుద్ధం తరువాత పుతిన్‌ను స్వాగతించే దేశాలు తక్కువగా ఉన్నా.. ఉత్తర కొరియాలో పుతిన్ పర్యటన కిమ్ విజయం అంటున్నారు ఉత్తరకొరియా రాజకీయ విశ్లేషకులు. మాస్కోతో ఆర్థిక, ఇతర సహకారాలను పెంపొందించుకోవడానికి ఈ పర్యటనలు ఉపయోగపడతాయని చెబుతున్నారు.

రాజ్‌భవన్ ఆవరణను తక్షణమే ఖాళీ చేయండి

కోల్‌కతా పోలీసులకు బెంగాల్ గవర్నర్ ఆదేశం

కోల్‌కతా: రాజ్‌భవన్ వద్ద బందోబస్తు విధుల్లో ఉండే కోల్‌కతా పోలీసు సిబ్బంది తక్షణమే అక్కడి నుంచి ఖాళీ చేయాలని పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్ సోమవారం ఉదయం ఆదేశాలు జారీ చేశారు. రాజ్‌భవన్ నార్త్‌గేట్ వద్ద ఉన్న పోలీస్ ఔట్ పోస్టును ప్రజావేదికగా మార్చాలని గవర్నర్ భావిస్తున్నట్లు సమాచారం. గవర్నర్, మమతా బెనర్జీ మధ్య విభేదాలు కొనసాగుతున్న సమయంలోనే ఇటీవల చోటుచేసుకున్న ఒక పరిణామమే దీనికి కారణమని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనిపై గవర్నర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన సువేందు అధికారి సారథ్యంలోని బీజేపీ నేతల బృందాన్ని రాజ్‌భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయంటూ బీజేపీ నేతలను వెనక్కి పంపించి వేశారు. గవర్నర్ రాతపూర్వకంగా అనుమతి ఇచ్చినప్పటికీ పోలీసులు ఇలా వ్యవహరించడం వివాదస్పదమైంది. దీనిపై సువేందు కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించడం.. గవర్నర్‌ను గృహ నిర్బంధంలో ఉంచారా అంటూ మమతా బెనర్జీ ప్రభుత్వంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

కశ్మీర్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్‌ల్లో మరికొద్ది నెలల్లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీలు, సహ ఇన్‌చార్జీలను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. జమ్మూకశ్మీర్ బాధ్యతలను కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి అప్పగించారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా, మహారాష్ట్ర ఇన్‌చార్జీగా పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను, సహ ఇన్‌చార్జీగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను నియమించారు. జార్ఖండ్ ఎన్నికల ఇన్‌చార్జీగా వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహ ఇన్‌చార్జిగా అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వ్యవహరించనున్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు, సహ ఇన్‌చార్జి బాధ్యతలను త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బిప్లబ్ కుమార్ దేబ్‌కు అప్పగించారు.

దక్షిణ చైనా సముద్రంలో కలకలం

చైనా గస్తీ నౌకను ఢీకొట్టిన ఫిలిప్పీన్స్ సరుకు నౌక

బీజింగ్/మనీలా: దక్షిణచైనా సముద్రంలో గుత్తాధిపత్యం కోసం చైనా ప్రయత్నిస్తున్న వేళ ఆ సముద్రజలాల్లో సోమవారం జరిగిన ఓడల ప్రమాదం ఇరుదేశాల మధ్య మాటల మంటలు రాజేసింది. మీ వల్లే ప్రమాదం జరిగిందని ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకున్నారు. దక్షిణచైనా సముద్రంపై తమకు హక్కు ఉందని ఫిలిప్పీన్స్, మలేసియా, వియత్నాం, బ్రూనై, తైవాన్‌లు అంతర్జాతీయ స్థాయిలో వాదిస్తున్న విషయం విదితమే. రెండు ఓడల ప్రమాదంలో ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు ఇంకా వెల్లడికాలేదు.

అసలేం జరిగింది?

నన్షా ద్వీపాల సమీపంలోని రెనాయ్ జియో పగడపు దిబ్బ దగ్గర తమ గస్తీ నౌక ఉందని తెల్సికూడా ఉద్దేశపూర్వకంగా అదే దిశలో దూసుకొచ్చి ఫిలిప్పీన్స్‌కు చెందిన సరకు రవాణా నౌక ఢీకొట్టిందని చైనా కోస్ట్ గార్డ్(సీసీజీ) ఆరోపించింది. చైనా కొత్త చట్టం ప్రకారం అనధికారికంగా ప్రయాణించిన ఆ నౌకపై మేం నియంత్రణ సాధించామని సీసీజీ ప్రకటించింది. చైనా చర్యను ఫిలిప్పీన్స్ తీవ్రంగా తప్పుబట్టింది. "చైనా విధానాలు వాస్తవ పరిస్థితిని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి. సమీపంలోని సెకండ్ థామస్ షావల్ స్థావరంలోని మా బలగాలకు సరకులు, నిర్మాణ సామగ్రిని తీసుకెళ్తున్న మా నౌకకు అడ్డంగా చైనా వారి నౌకను నిలిపింది" అని ఫిలిప్పీన్స్ సాయుధ విభాగ అధికార ప్రతినిధి ఎరేస్ ట్రినిడాడ్ వెల్లడించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం గతంలో ఫిలిప్పీన్స్ ప్రత్యేక ఆర్థిక మండలి(ఈఈజెడ్) పరిధిలో ఉండేది. 2012 ఏడాదిలో ఈ ప్రాంతాన్ని చైనా ఆక్రమించింది. అప్పటి నుంచి ఈ వివాదం కొనసా గుతోంది. దక్షిణ చైనా సముద్రజలాల గుండా ప్రయాణించే పొరుగుదేశాల సరకు రవాణా నౌకలపై తరచూ జల ఫిరంగులను ప్రయోగిస్తూ చైనా నావికాదళాలు తెగ ఇబ్బంది పెట్టడం తెల్సిందే. విదేశీ నౌకల సిబ్బందిని ఎలాంటి ముందస్తు విచారణ లేకుండా 60 రోజులపాటు నిర్బంధించేలా చేసిన చట్టం అమల్లోకి వచ్చిన రెండు రోజులకే ఈ ప్రమాదం జరగడం గమనార్హం.

వార్ కేబినెట్‌ను రద్దు చేసిన నెతన్యాహూ



టెల్ అవీవ్: యుద్ధక్షేత్రంలో ముందుకు దూసుకెళ్తున్న ఇజ్రాయెల్ సైనిక బలగాలకు సూచనలు చేసే కీలకమైన వార్ కేబినెట్‌ను సోమవారం ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అనూహ్యంగా రద్దుచేశారు. దీంతో గాజాస్ట్రిప్‌లో సైనికులు అనుసరించాల్సిన వ్యూహాలు, వారికి పూర్తి స్వేచ్ఛనిస్తూ తుది నిర్ణయాలను ఇకపై ఎవరు తీసుకుంటారన్న దానిపై సర్వత్రా చర్చ నెలకొంది. విపక్ష నేతలు ఈ యుద్ధ మండలి నుంచి వైదొలగడమే వార్ కేబినెట్ నిర్వీర్యానికి అసలుకారణమని తెలుస్తోంది. హమాస్ మిలిటెంట్లు మెరుపుదాడి చేసి 1,200 మంది ఇజ్రాయెలీలను పొట్టనబెట్టుకోవడంతో ఇజ్రాయెల్‌లోని విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. గాజా స్ట్రిప్‌పై దురాక్రమణకు తెగబడిన ఇజ్రాయెల్ సేనలకు బాసటా నిలిచాయి. దేశంపై దాడి నేపథ్యంలో రాజకీయపక్షాల మధ్య ఐక్యత ఉందని చాటుతూ ప్రభుత్వానికి మద్దతుపలుకుతూ నెతన్యాహూ ఏర్పాటుచేసిన వార్ కేబినెట్‌లో సభ్యులుగా నెతన్యాహూకు బద్ధశత్రువులైన విపక్ష నేతలు బెన్నీ గాంట్జ్ తదితరులు చేరారు. గాంట్జ్, నెతన్యాహూ, రక్షణ మంత్రి మొఆవ్ గాలంట్‌లు వార్ కేబినెట్‌లో కీలక సభ్యులుగా ఉండేవారు. అయితే ఇటీవలి కాలంలో యుద్ధంలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని వేలాది మంది అమాయక పాలస్తీనియన్లను చంపేస్తోందని ప్రపంచదేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా సైతం పొరసష్టంలేని సైనిక చర్యకే మొగ్గుచూపింది. బందీలను విడిపించడంపై దృష్టి సారించాల్సింది పోయి హమాస్ అంతం తమ లక్ష్యమన్నట్లు ఇజ్రాయెల్ సేనలు వ్యవహరిస్తున్నారని విపక్ష నేతలు బెన్నీ గాంట్జ్ తదితరులు నెతన్యాహూ ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. కాల్పుల విరమణకు నెతన్యాహూ ససేమిరా అనడంతో యుద్ధ రీతులు మారిపోయాయని భావించి బెన్నీ తదితరులు కేబినెట్ నుంచి వైదొలిగారు.

పాఠ్యపుస్తకాల్లో లింగసమానత్వ చిత్రాలు

పురుషులు ఇంటిపనుల్లో ఉన్నట్లు పుస్తకాల్లో ఫొటోల ముద్రణ

కొచ్చి: వంటగది అనగానే అమ్మ వండుతున్నట్లు చూపే ఫొటోలు పాఠ్యపుస్తకాల్లో ముద్రిస్తుంటారు. ఇలాంటి ధోరణికి చెల్లుచీటి ఇస్తూ కేరళ ప్రభుత్వం లింగసమానత్వ చిత్రాలకు పాఠశాల పాఠ్యపుస్తకాల్లో చోటు కల్పించింది. అమ్మ అంటే ఉద్యోగం చేయదని, ఇంట్లోనే ఉంటుందనే భావన బడిఈడు పిల్లల్లో నాటుకుపోకుండా ఉండేందుకు, సమానత్వాన్ని వారి మెదడులో పాదుకొల్పేందుకు కేరళ సర్కార్ కృషిచేస్తోంది. ఈ ప్రయత్నానికి ఉపాధ్యాయుల నుంచి మద్దతు లభిస్తోంది. మూడో తరగతి మలయాళం మాధ్యమం పాఠ్యపుస్తకం పేజీలను కేరళ సాధారణ విద్యాశాఖా మంత్రి వి.శివాన్ కుట్టి సోషల్‌మీడియాలో షేర్‌చేశారు. తండ్రి వంటింట్లో కూర్చుని పచ్చి కొబ్బరి తురుము తీస్తున్నట్లు ఒక పేజీలో డ్రాయింగ్ ఉంది. తన కూతురు కోసం తండ్రి అల్పాహారం సిద్ధంచేస్తున్నట్లు మరో పేజీలో డ్రాయింగ్ ఉంది. ఇంటి పనిలో పురుషులు ఎంత బాధ్యతగా ఉండాలని ఈ చిత్రాలు చాటిచెబుతున్నాయని నెటిజన్లు మెచ్చుకున్నారు.

పన్నూ హత్యకు కుట్ర ఆరోపణలు..

అమెరికాకు నిఖిల్ గుప్తా అప్పగింత

వాషింగ్టన్: ఖలిస్తానీ ఉగ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలపై భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తాను చెక్ రిపబ్లిక్ గత వారం అమెరికాకు అప్పగించింది. గుర్తు తెలియని భారతీయ అధికారి ఆదేశాల మేరకు కెనడా, అమెరికా ద్వంద పౌరసత్వమున్న పన్నూను అమెరికా గడ్డపైనే చంపేందుకు నిఖిల్ గుప్తా కిరాయి హంతకుడికి డబ్బులిచ్చినట్లు అమెరికా ఆరోపిస్తోంది. అమెరికా ప్రభుత్వ వినతి మేరకు చెక్ రిపబ్లిక్‌లో ఉన్న నిఖిల్‌ను అక్కడి ప్రభుత్వం గత ఏడాది అరెస్ట్ చేసింది. అయితే, అమెరికా ఆరోపణలను భారత్ ఖండించింది. నిఖిల్ ప్రస్తుతం అమెరికాలోని బ్రూక్లిన్‌లో ఫెడరల్ మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో ఉన్నారు.

నేడు వారణాసికి ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధానిగా వరుసగా మూడో విడత బాధ్యతలు చేపట్టిన మోదీ ఈ నెల 18న మొదటిసారిగా తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించనున్నారు. వారణాసిలో జరిగే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ పథకం కింద 17వ విడతలో రూ.20 వేల కోట్ల నిధులను దేశవ్యాప్తంగా ఉన్న రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయనున్నారు. 'కృషి సఖి'లుగా శిక్షణ పొందిన స్వయం సహాయక బృందాల మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 7 గంటలకు దశాశ్వమేధ ఘాట్‌లో జరిగే గంగా ఆరతి కార్యక్రమంలో పాల్గొంటారు.

పులి గర్జన..

• కోవైలో అన్నాడీఎంకే పోస్టర్ కలకలం

తిరువొత్తియూరు: కోయంబత్తూరు నగరమంతా సోమవారం అన్నాడీఎంకే నిర్వాహకులు కొందరు సంచలన పోస్టర్లను అతికింతారు. ఆ పోస్టర్లలో ఎంజీఆర్, జయలలిత, ఎడప్పాడి పళనిస్వామి, ఎస్పీ వేలుమణి, కోయంబత్తూరు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల ఫొటోలను పొందుపరిచారు. అలాగే, 2026లో పులి పాయుమ్ (పులి పంజా విసురుతుంది) అనే నినాదంతో పులి చిత్రాన్ని కూడా చిత్రించారు. కోయంబత్తూరులోని పలు రోడ్ల పక్కన గోడలకు ఈ పోస్టర్లు అతికించారు. ఆదివారం కోయంబత్తూరులో డీఎంకే తరఫున వేడుక నిర్వహించిన విషయం విదితమే. ఈ క్రమంలో సీఎం ఎంకే స్టాలిన్‌కు స్వాగతం పలుకుతూ పలు నినాదాలతో కూడిన పోస్టర్లు వేశారు. కాగా దీనికి సమాధానంగా అన్నాడీఎంకే అతికించిన పోస్టర్ కలకలం రేపింది.

న్యూస్‌రీల్

మత్స్యకార కుటుంబాలకు రూ.3 లక్షల వంతున సాయం

• ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన

కొరుక్కుపేట: రామనాథపురం జిల్లా మండపం సమీపంలో సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు రూ.3 లక్షల వంతున సాయం చేస్తామని సీఎం స్టాలిన్ ప్రకటించారు. రామనాథపురం జిల్లా మండపానికి చెందిన మత్స్యకారులు ఆరోగ్యం (50), పరుఖ్ అబ్దుల్లా (45), ఖలీల్ రహమాన్ (32) సముద్రంలో చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగిపోయారు. సీఎం స్టాలిన్ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే సాధారణ సహాయ నిధుల నుంచి ఒక్కొక్కరికి రూ.3 లక్షల ఆర్థికసాయం అందించాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు.

ఒట్టన్ చత్రం సెజ్‌కు పళణి వ్యతిరేకత

సాక్షి, చెన్నై : దిండుగల్ జిల్లా ఒట్టన్ చత్రంలో పారిశ్రామికవాడ ఏర్పాటును అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణిస్వామి వ్యతిరేకించారు. పారిశ్రామికవాడ కోసం ఎంపిక చేసిన గ్రామాల్లో సోమవారం పళణిస్వామి పర్యటించారు. దిండుగల్‌జిల్లా ఒట్టన్ చత్రంలో రైతులు పండించే పంటలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. అయితే, ఇక్కడి రైతుల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తూ, పంట పొలాలను పారిశ్రామిక వాడలుగా మార్చేందుకు డీఎంకే పాలకులు ప్రయత్నించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తక్షణం ఇక్కడ సెజ్ ఏర్పాటు ప్రయత్నాలను వీడాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి పాలకులు, ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

20న పన్నీరు శిబిరం భేటీ



సాక్షి, చెన్నై : మాజీ సీఎం పన్నీరు సెల్వం తన మద్దతుదారులతో చెన్నైలో ఈనెల 20వ తేదీన సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నట్టు సమాచారం వెలువడింది. 2022లో అన్నాడీఎంకే నుంచి పన్నీరు సెల్వంను బహిష్కరించిన విషయం తెలిసిందే. ఆయన అప్పటి నుంచి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి, రాజకీయ ప్రయాణాన్ని సాగిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి తరఫున రామనాథపురంలో పోటీ చేసి, ఓటమి పాలయ్యారు. ఈ ఓటమితో అన్నాడీఎంకేలో అందరూ ఏకం కావాలన్న కొత్త నినాదాన్ని అందుకున్నారు. అదే సమయంలో ఆయన శిబిరంలో ఉన్న ముఖ్య నేతలు జేసీటీ ప్రభాకర్, పుగలేంది, కేసీ పళణిస్వామి ఈ శిబిరం నుంచి బయటకు వచ్చేశారు. అన్నాడీఎంకేలో అందర్నీ ఒకే వేదిక మీదకు తెచ్చేలా ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ తరఫున దివంగత సీఎం జయలలిత నెచ్చెలి, చిన్నమ్మ శశికళ, అమ్మమక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, మాజీ సీఎం పన్నీరు సెల్వంకు ఈ కమిటీ లేఖలు రాసింది. అన్నాడీఎంకేను బలోపేతం చేయడానికి అందరూ ఏకం కావాలని కోరుతూ సమావేశానికి విజ్ఞప్తి చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో తన శిబిరంలోని మద్దతుదారులతో సమావేశమై తదుపరి నిర్ణయం తీసుకోవాలని పన్నీరు నిర్ణయించారు. ఇందుకోసం ఈ నెల 20వ తేదీన చెన్నైలో తన మద్దతుదారుల సమావేశం నిర్వహించనున్నారు.

విదేశీ శిక్షణ పూర్తి

• చెన్నైకు విద్యార్థుల రాక



చెన్నైకు చేరుకున్న విద్యార్థులు

సాక్షి, చెన్నై : నాన్ మొదల్వన్ పథకం ద్వారా లండన్‌లో శిక్షణకు వెళ్లిన తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సోమవారం తిరిగి చెన్నైకు చేరుకున్నారు. వీరికి అధికారులు ఆహ్వానం పలికారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నైపుణ్యాల అభివృద్ధితో పాటు వివిధ శిక్షణలు, ఉద్యోగ అవకాశాల కల్పనలో నాన్‌మొదల్వన్ పథకం కీలక పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద వివిధ పరీక్షలు, పరిశోధనల నిమిత్తం 25 పాఠశాలల నుంచి ఒక్కరి వంతున ఎంపిక చేశారు. వీరందరూ వారం రోజుల పాటు లండన్‌లోని వర్సిటీలో శిక్షణ పొందే అవకాశం కల్పించారు. ఈ శిక్షణ ముగించుకుని సోమవారం బ్రిటీషు ఎయిర్ వేస్ విమానంలో విద్యార్థులు చెన్నైకు చేరుకున్నారు. విమానాశ్రయంలో అధికారులు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విదేశీ పర్యటన తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని చెప్పారు. తమను విదేశాలకు పంపించి, శిక్షణ ఇప్పించేందుకు కృషి చేసిన సీఎం స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను సోమవారం రాష్ట్రంలోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గా మైదానాలు, సముద్ర తీరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇళ్ల వద్ద ఖుర్బానీ ఇచ్చారు. ఈ మాంసాన్ని పేదలు, బంధు మిత్రులకు పంచి పెట్టారు.

• రాష్ట్రవ్యాప్తంగా మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
• పేదలకు ఖుర్బానీ పంపిణీ



వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు







తిరుచెంగోడులోని సంగగిరి రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చైన్నైలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మహిళలు

సాక్షి, చెన్నై : భక్తి భావాన్ని చాటే రంజాన్ పర్వదినం తర్వాత అత్యంత ప్రధాన పండుగగా బక్రీద్‌ను ముస్లింలు జరుపుకుంటారు. త్యాగ నిరతిని చాటే ఈ పండుగను ఈదుల్ జుహా, ఈదుజ్జుహా అని కూడా పిలుస్తారు. ఈ పండుగ వెనుక త్యాగాన్ని చాటే కథ ఉంది. ఆ మేరకు దైవ ప్రవక్తల్లో ఒకరైన హజ్రత్ ఇబ్రహీం తాను నిద్రిస్తున్న సమయంలో వచ్చిన కలను అల్లా ఆదేశంగా భావించిన ఆయన తన తనయుడు ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధ పడతారు. బలి ఇచ్చే సమయంలో ఆయన భక్తికి మెచ్చిన అల్లా ఇస్మాయిల్ స్థానంలో ఓ గొర్రెను ఉంచుతారు. అప్పటి నుంచి వారి త్యాగాన్ని స్మరిస్తూ ముస్లింలు బక్రీద్ పండగ చేసుకుంటున్నారు. ఇస్లాం సూచించిన ఐదు సూత్రాల్లో ఒకటైన హజ్ యాత్ర కూడా ఈ మాసంలోనే నిర్వహిస్తారు. బక్రీద్ పర్వదినాన మక్కాలో నమాజు చేసే అవకాశంతో దక్కడంతో ఈ ఏడాది రాష్ట్రం నుంచి వేలాది మంది హజ్ యాత్రకు వెళ్లారు. ఈ పరిస్థితుల్లో సోమవారం బక్రీద్ పర్వదినం కావడంతో రాష్ట్రంలో ముస్లింలు అత్యధికంగా ఉండే ప్రాంతాల్లో భక్తి భావం మిన్నంటింది.

ప్రత్యేక ప్రార్థనలు.. ఖుర్బానీ

బక్రీద్ పర్వదినాన ప్రార్థనే కాదు.. ఖుర్బానీ ఇవ్వడం ముఖ్యం. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరిస్తూ ప్రతి ఇంటా గొర్రె లేదా ఒంటెను ఖుర్బానీ ఇస్తారు. సోమవారం ఇళ్ల వద్ద ఖుర్బానీ ఇచ్చే కార్యక్రమాలు జరిగాయి. ఖుర్బానీ ఇచ్చిన గొర్రె లేదా ఒంటె మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి, ఒక భాగం తమ కుటుంబానికి, రెండో భాగం బంధు మిత్రులకు, మూడో భాగం పేదలకు పంచి పెట్టారు. విందులతో సందడి చేశారు. ముందుగా ఉదయాన్నే మసీదులు, ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కొత్త దుస్తులను ధరించి తమ ప్రాంతంలోని మసీదులు, ఈద్గా మైదానాలకు ముస్లింలు కుటుంబాలతో కలిసి కదిలారు. జట్లుజట్లుగా మసీదులు, ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో లీనమయ్యారు. మత గురువులు బక్రీద్ పండుగ విశిష్టతను వివరిస్తూ ఉపదేశం ఇచ్చారు. అందరితో ప్రార్థనలు చేయించారు. అనంతరం ఒకరిని మరొకరు ఆలింగనం చేసుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చెన్నై, శివారు జిల్లాలు, మధురై, రామనాథపురం, నాగపట్నం, తిరునల్వేలి, తెన్‌కాశి తదితర జిల్లాలో ఉదయం ఎనిమిది - ఎనిమిదిన్నర గంటలకే ప్రార్థనలు ముగించారు. మరికొన్ని చోట్ల ఎనిమిదిన్నర, తొమ్మిది, తొమ్మిదిన్నర గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రార్థనలు జరిగే ప్రాంతాల్లో పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. నాగూర్ సముద్ర తీరంలో ప్రత్యేక ప్రార్థన జరిగింది. పుదుచ్చేరి సముద్ర తీరంలోని గాంధీ విగ్రహం ఎదురుగా ప్రత్యేక ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. విల్లుపురం మైదానంలో జరిగిన ప్రార్థనలకు మైనారిటీ శాఖ మంత్రి సెంజి మస్తాన్, బ్రాడ్వే ఈద్గా మైదానంలో ప్రార్థనలకు మనిద నేయమక్కల్ కట్చి నేత జవహిరుల్లా హాజరయ్యారు.

సోమన్నా.. ఇది పద్ధతేనా?

• రామన్న ప్రశ్న



రాందాసు

సాక్షి, చెన్నై: మేఘధాతు వ్యవహారంలో కేంద్ర జలశక్తి మంత్రి సోమన్న చేసిన వ్యాఖ్యలను పీఎంకే వ్యవస్థాపకుడు రాందాసు తీవ్రంగా ఖండించారు. బాధ్యత గల పదవిలో ఉండి, ఒక రాష్ట్రానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేయడం పద్ధతేనా అని ప్రశ్నించారు. తమిళనాడు-కర్ణాటక మధ్య కావేరి జల వివాదం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం తమిళనాడు వైపుగా ఈ జలాలను అడ్డుకునేందుకు మేఘధాతులో డ్యామ్ నిర్మాణం దిశగా కర్ణాటక తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకునేందుకు కుస్తీలు పడుతూ వస్తున్నది. ఈ పరిస్థితుల్లో కర్ణాటకకు చెందిన సోమన్న కేంద్ర జలశక్తి మంత్రి కావడంతో ఈ వివాదం మున్ముందు రాజుకునే అవకాశాలు ఉన్నాయని, రెండు రాష్ట్రాల మధ్య భగ్గుమనే వాతావరణం ఉండవచ్చని ఇప్పటికే సంకేతాలు వెలువడ్డాయి. ఇందుకు అద్దం పట్టే విధంగా ప్రస్తుతం సోమన్న వ్యాఖ్యలు చేయడం చర్చకు దారి తీసింది. మేఘధాతుకు అనుకూలంగా ఆయన వ్యాఖ్యలు ఉండడాన్ని తమిళ రైతులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ పీఎంకే వ్యవస్థాపకుడు రాందాసు ఓ ప్రకటన చేశారు.

నమ్మకం సన్నగిల్లుతోంది

కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సోమన్న రెండు రాష్ట్రాలకు మధ్యవర్తిగా ఉండాల్సిన అవసరం ఉందని రాందాసు సూచించారు. న్యాయ బద్ధంగా వ్యవహరించాల్సిన మంత్రి ఏక పక్షంగా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మేఘధాతుకు సానుకూలంగా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై నమ్మకం అన్నది సన్నగిల్లుతోందన్నారు. మేఘధాతు విషయంపై కేంద్రం నుంచి చర్చలకు ఆహ్వానిస్తే తమిళనాడు ప్రభుత్వం బహిష్కరించే విధంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మేఘధాతులో డ్యామ్ నిర్మాణాలను అడ్డుకోవాలని, ఈ వ్యవహారంలో కేంద్రం జోక్యం, స్వయంగా కేంద్ర మంత్రి చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తలను విస్తృతం చేయాలని కోరారు.

లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యం

• విక్రవాండిలో ఎన్నికల వ్యూహాలకు డీఎంకే పదును
• ఒక రోజు ప్రచారానికి సీఎం నిర్ణయం



డీఎంకే కార్యాలయం

సాక్షి, చెన్నై: విక్రవాండి అసెంబ్లీ ఉపఎన్నికలో లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో అభ్యర్థి గెలుపు లక్ష్యంగా వ్యూహాలకు డీఎంకే పదును పెట్టింది. నామినేషన్లు ముగియనేగా తొలి వారం రోజులు పార్టీ అధికార ప్రతినిధులు, సెలబ్రటీల ద్వారా ప్రచారాలు చేయాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే మంత్రులందరూ నియోజకవర్గం బాట పట్టేలా కార్యచరణ సిద్ధం చేశారు. విక్రవాండి అసెంబ్లీ ఉప ఎన్నికల నామినేషన్లు వేగం పుంజుకుంటున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు పలువురు సోమవారం కూడా నామినేషన్లు వేశారు. ఈ ఎన్నికలను అన్నాడీఎంకే, డీఎండీకేలు బహిష్కరించడంతో త్రిముఖ సమరంగా డీఎంకే, పీఎంకే, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. డీఎంకే తరఫున అన్నియూరు శివ, పీఎంకే తరఫున సీ అన్బుమణి, నామ్‌తమిళర్ కట్చితరఫున డాక్టర్ అభినయ పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికలను అన్నాడీఎంకే, డీఎండీకేలు బహిష్కరిచడంతో అన్నియూరు శివ లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో గెలవాలన్న టార్గెట్‌ను డీఎంకే నిర్ణయించింది. ఇందుకోసం పార్టీ నేతలు విక్రవాండి బాట పట్టనున్నారు. ఈనెల 20 నుంచి అసెంబ్లీ సమావేశాలు పది రోజుల పాటు జరగనుండడంతో మంత్రులు చెన్నైలోనే అందుబాటులో ఉండాల్సిన అవశ్యం ఏర్పడింది. దీంతో పార్టీ ముఖ్యనాయకులు, అధికార ప్రతినిధులు, సినీ సెలబ్రటీల ద్వారా తొలుత గ్రామాల్లో ప్రచారాలు విస్తృతం చేయాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే డీఎంకే మంత్రులు అందరూ ఒక్కో నియోజక వర్గాన్ని ఎంపిక చేసుకుని ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేయబోతున్నారు. 29వ తేదీ అసెంబ్లీ సమావేశాలు ముగిసినా, 30వ తేదీ నుంచి వారం రోజుల పాటుగా ప్రచారంలో బిజీ అయ్యే దిశగా డీఎంకే వర్గాలు కార్యచరణ సిద్ధం చేసుకున్నాయి. అలాగే, సీఎం స్టాలిన్ సైతం ఒక రోజు పర్యటించేందుకు నిర్ణయించడం గమనార్హం. ఇదిలా ఉండగా తమ అభ్యర్థిని ఓడించేందుకు బీజేపీ వ్యూహాలకు అనుగుణంగా అన్నాడీఎంకే అడుగులు వేస్తున్నదన్న డీఎంకే సీనియర్ నేత ఆర్‌ఎస్ భారతి, కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాకూర్ విమర్శించారు. అందుకే ఉప ఎన్నికను వారు బహిష్కరించారని ఆరోపించారు. డీఎంకే పాలకులపై నింద వేసి ఎన్నికలు బహిష్కరించడాన్ని ఖండించారు. మోదీ, అమిత్ షాల వ్యూహాలను అమలు పరిచేలా బీజేపీ కూటమిలోని పీఎంకే అభ్యర్థి కోసం అన్నాడీఎంకే పనిచేయబోతున్నట్టుందని ఆరోపించారు.

ఈవీఎంలు

ఉప ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోల్ ప్యానల్‌లు సోమవారం విక్రవాండి తాలుకా కార్యాలయానికి చేరాయి. వీటిని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పళణి పరిశీలించారు. నగదు బట్వాడా కట్టడి లక్ష్యంగా 21 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, మూడు ప్రత్యేక అధికారుల బృందాలు, మరో మూడు సిట్టింగ్ బృందాలను రంగంలోకి దించారు. ఈఎన్నికలో 575 ఈవీఎంలను ఉపయోగించనున్నారు.

ప్రొఫెసర్ రేలాకు జీవిత సాఫల్య పురస్కారం



రేలాకు పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సాక్షి, చెన్నై: కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయడంలో అగ్రగామిగా పేరుగడించిన ప్రొఫెసర్ మహ్మద్ రేలాకు అసోసియేషన్ ఆఫ్ హెల్త్ ప్రొవైడర్స్ ఇండియా(ఏహెచ్‌పీ) నేతృత్వంలో ఏహెచ్‌పీ ఐకాన్–2024 జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సోమవారం ఏహెచ్‌పీ నేతృత్వంలో ఏహెచ్‌పీ ఐకాన్–2024 అవార్డుల ప్రదానోత్సవం, ఆరోగ్య సంరక్షణ రంగంలో పర్యావరణ, ఆర్థిక స్థిరత్వంపై సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ సేవలలో రాణిస్తున్నవారిని, 15 ఆస్పత్రులకు చెందిన అత్యుత్తమ ప్రతిభావంతులను గుర్తించి సత్కరించారు. ఇందులో రేలాకు జీవిత సాఫల్య పురస్కారాన్ని నిర్వాహకులు ప్రదానం చేశారు. కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణుల్లో ప్రపంచంలోనే రేలా ఒకరు అని తెలిపారు. ఆయన ఇప్పటి వరకు 6 వేలకు పైగా కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్టు ఈ సందర్భంగా ప్రకటించారు. ఐదు రోజుల శిశువుకు సైతం కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించి, గిన్నిస్‌బుక్ లోనూ చోటు సంపాదించుకున్నారని వివరించారు.

సెమ్మంచేరిలో మెగా స్పోర్ట్స్‌సిటీ

కొరుక్కుపేట: సెమ్మంచేరిలో ఏర్పాటు చేయనున్న మెగా స్పోర్ట్స్ సిటీకి సంబంధించి సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనానికి టెండర్లు ఆహ్వానించినట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. చెన్నైలో క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ తదితర క్రీడల కోసం ప్రత్యేక పెద్ద మైదానాలు ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించే రీతిలో అక్కడి క్రీడాహాళ్లు అప్‌గ్రేడ్ చేశారు. అయినా చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) నిధులతో చెన్నైలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రకటించారు. ఈ మేరకు పాత మహాబలిపురం రహదారిలోని షోలింగనల్లూరు పక్కనే ఉన్న సెమ్మంచేరి గ్రామం, తూర్పు తీర రహదారిలోని తిరువిడంతై తదితర ప్రదేశాలను ఇప్పటికే అధికారులు సందర్శించి, పరిశీలించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 105 ఎకరాల్లో విస్తరించనున్న ఈ స్పోర్ట్స్ సిటీలో 10కి పైగా క్రీడా వేదికలు, క్రీడాకారులకు హాస్టళ్లు, రెస్టారెంట్లు నిర్మించాలని యోచిస్తున్నారు. ఈ మెగా స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు సంబంధించి సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని సిద్ధం చేసేందుకు సీఎండీఏ టెండర్లు ఆహ్వానించడం గమనార్హం.

పాల నురగల.. పరుగులు

పాడి సమృద్ధిగా ఉన్న పల్లెలు.. సిరిసంపదలతో తులతూగుతాయని పెద్దల చెప్పిన మాటను సీఎం స్టాలిన్ ప్రభుత్వం అవిన్ సంస్థ ద్వారా అక్షరాల నిజం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం తీసుకున్న పలు చర్యలతో పాల ఉత్పత్తిలో రాష్ట్రం పరుగులు పెడుతోంది. ఫలితంగా రాష్ట్రం దేశంలోనే పాల దిగుబడిలో చారిత్రక రికార్డు నమోదు చేసింది.

పాల ఉత్పత్తిలో రికార్డు...!

• ప్రజానమ్మకాన్ని చూరగొన్న ఆవిన్
• పాడి రైతులకు తోడ్పాటు



ఈరోడ్‌లో పాల ఉత్పత్తుల నిర్మాణాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం

సాక్షి, చెన్నై : ద్రావిడ మోడల్ సీఎం ఎంకే స్టాలిన్ తీసుకున్న చర్యలతో డెయిరీ రంగంలో 10.10 మిలియన్ టన్నుల పాల ఉత్పత్తి జరుగుతోందని ప్రభుత్వ రంగ సంస్థ ఆవిన్ ప్రకటించింది. దేశ మొత్తం పాల ఉత్పత్తిలో చారిత్రక రికార్డును నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. డీఎంకే ప్రభుత్వం మూడేళ్ల ప్రగతిలో భాగంగా ఆవిన్ పాల పంపిణీ, ఇతర పాల ఉత్పత్తులను గురించి సోమవారం సమగ్ర నివేదికను అధికారులు విడుదల చేశారు. పాడి రైతుల సంక్షేమం, నాణ్యమైన పాలు ప్రజల ఇంటి ముంగిటకు తీసుకెళ్లి పంపిణీ చేయడం లక్ష్యంగా 1972లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన దివంగత నేత కరుణానిధి తమిళనాడు డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. ఆ తరువాత రక రకాల మార్పులతో చివరకు ఆవిన్ ప్రభుత్వ రంగ సంస్థగా, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి కేంద్రంగా మారినట్టు వివరించారు. దేశం మొత్తం పాల ఉత్పత్తిలో తమిళనాడు వాటా 4.57 శాతంగా ఉన్నట్టు ప్రకటించారు. గ్రామ స్థాయిలో 10,814 ప్రాథమిక పాల ఉత్పత్తి సహకార సంఘాలు ఉన్నట్టు గుర్తుచేశారు. ఇందులో 9,189 సొసైటీల్లో 1,856 సొసైటీలు మహిళా సంఘాలు నేతృత్వంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. పాడి పరిశ్రమ ప్రాథమిక లక్ష్యం గ్రామ స్థాయిలో రైతులు, పేదల జీవనోపాధిని మెరుగుపరచడానికి, పశుపోషణ ప్రోత్సహించడం, తద్వారా పాల ఉత్పత్తిని పెంచడం, స్వయం సంవృద్ధితో వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో ఉన్నత లక్ష్యాలను సాధిస్తున్నామని అధికారులు తెలిపారు. గత 50 ఏళ్లలో తమిళనాడు ప్రజల మదిలో ఆవిన్ సుస్థిర స్థానాన్ని సంపాదించుకుందన్నారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా మిల్క్ కార్డుల ద్వారా అతి తక్కువ ధరకు స్వచ్ఛమైన పాలు ప్రజలకు పంపిణీ చేస్తూ వస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల ప్రాథమిక అవసరాల్లో పాల వినియోగం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గత 3 సంవత్సరాల్లో డెయిరీ రంగాన్ని మెరుగుపరచడానికి వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేశారని గుర్తుచేశారు. ప్రత్యేకంగా పాల సేకరణ, ఉత్పాదకతను పెంచడం, ఆధునిక సాంకేతికత, ఉత్పత్తి, పాల శీతలీకరణ, పాల నిల్వ గిడ్డంగులను ఏర్పాటు చేయడం, వినియోగదారుల అవసరాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా ముందుకు సాగినట్టు తెలిపారు. అలాగే ఆవిన్ నెయ్యి, ఐస్‌క్రీమ్, పెరుగు, పాయసం మిక్స్ సైతం విక్రయిస్తున్నామని పేర్కొన్నారు.

పాడి రైతులకు తోడ్పాటు..

పాడి రైతుల ద్వారా పాలపాడి ఉత్పత్తిని పెంచడం ఎప్పటికప్పుడు కొనుగోలు ధరను పెంచడంతో సహా ఇతర ప్రాజెక్టులను సమర్థవంతంగా ప్రభుత్వం అమలు చేస్తూ వస్తున్నట్టు ఆ నివేదికలో వివరించారు. పాల సేకరణ చేస్తూ పంపిణీ తమిళనాడు వ్యాప్తంగా 9,189 స్టార్టప్ పాల ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ఉత్పత్తి జరుగుతుందని, అలాగే, సహకార సంఘాల ద్వారా రోజుకు 3.85 లక్షల పాలు అందజేస్తున్నామన్నారు. రోజుకు 35.67 లక్షల లీటర్ల పాలను ఉత్పత్తి చేసున్నామన్నారు. ఇందులో 4 లక్షల లీటర్ల పాలను స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా సంఘాల ద్వారా విక్రయిస్తున్నామన్నారు. 2021 సంవత్సరం జూలై 22వ తేదీన ఆవిన్ సంస్థ రికార్డు స్థాయిలో 43.05 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేసినట్టు ప్రకటించారు. కొనుగోలు ధరను పెంచినా, విక్రయ ధరను పెంచకుండా పాడి రైతులకు తోడ్పాటు అందిస్తూ ముందుకెళుతున్నామన్నారు. 2023 సంవత్సరం డిసెంబర్ 18 నుంచి నుంచి ఏప్రిల్ 2024 వరకు రూ.108.30 కోట్లను పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకంగా అందజేశామని వివరించారు. భారత దేశంలో పాల ఉత్పత్తిలో అగ్రగామి రాష్ట్రాల్లో తమిళనాడు ఒకటి అని పేర్కొన్నారు. రూ.21.75 కోట్ల వ్యయంతో 2వేల లీటర్ల సామర్థ్యంతో నాలుగు పాల శీతలీకరణ కేంద్రాలు, 5 వేల లీటర్ల సామర్థ్యంతో మరో 143 శీతలీకరణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. రూ.18.76 కోట్లతో 866 ఆటోమేటిక్ మిల్క్ కలెక్టింగ్ యూనిట్లు, 350 ప్రాసెసింగ్ డేటా పాల సేకరణ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. మాధవరం, విల్లుపురం, అచ్చరపాక్కం, కడలూరు, ధర్మపురి, తిరువణ్ణామలై, కరూర్‌లలోని డెయిరీ ఫారాలు ఇన్‌స్టాలేషన్ ప్రోగ్రెస్‌లో ఉందని, నామక్కల్‌లో రోజుకు 2 లక్షల లీటర్లు నిర్వహిణ లక్ష్యంగా సమర్థవంతమైన మిల్క్ ప్రాసెసింగ్ ఫామ్ ఏర్పాటుకు రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రకటించారు. రోజుకు 6 వేల లీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో కొత్త ఐస్ క్రీం ఫ్యాక్టరీని ఇటీవలే ప్రారంభించామని గుర్తుచేశారు. గ్రామ స్థాయిలో గేదె దూడల పెంపకాన్ని ప్రోత్సహించడం, పాడి రైతుల 5 లక్షల పాడి ఆవులకు 85 శాతం సబ్సిడీతో కూడిన పశువుల బీమా పథకం అమలు చేస్తున్నామని ప్రకటించారు. 2023–2024 సంవత్సరంలో ఆవిన్ పాలు, పాల ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో రూ.30.19 కోట్లకు విక్రయాలు జరిపినట్టు వివరించారు. తమిళనాడు ప్రజల పాల డిమాండ్‌ను తీర్చడంలో ఆవిన్ ఉద్యోగ, కార్మికులు అంకిత భావంతో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. అలాగే ఉద్యోగులు, ప్రజల అవసరాలను వెంటనే తెలుసుకుని వాటి పరిష్కరించే దిశగా ముందుకెళుతున్నామన్నారు.

క్లుప్తంగా

ఆంధ్ర యువకుడిపై కేసు నమోదు

వేలూరు: సెయ్యారు సమీపంలో 17 ఏళ్ల బాలికను వివాహం చేసుకున్న ఆంధ్ర యువకుడితో పాటు వధూవరుల తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు సమీపంలోని ఒక గ్రామానికి చెందిన రైతు తన 17 ఏళ్ల కుమార్తె ప్లస్‌టూ పూర్తి చేసింది. వీరి బంధువు ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా నాయుడుపేట గ్రామానికి చెందిన సెల్వరాజ్ కుమారుడు విజయ్‌కు ఇరు కుటుంబ సభ్యులు కలిసి గత ఏప్రిల్ 4వ తేదీన పెద్దల సమక్షంలో సెయ్యారు సమీపంలోని సోరంబట్టు గ్రామంలో వివాహం జరిపించారు. ఈ విషయమై బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలన అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో సెయ్యారు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దేవిక, సెయ్యారు పోలీసులు బాలిక ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. విచారణలో 18 ఏళ్లు పూర్తి కాక ముందే బాలికకు వివాహం చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు చిన్నారి కుటుంబ సభ్యులతోపాటు పెళ్లి కుమారుడు విజయ్ అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేయడంతో పాటు బాలికను అదుపులోకి తీసుకుని తిరువణ్ణామలైలోని చిన్నారుల ఆశ్రమంలో చేర్పించారు. ఈ విషయమై పోలీసులు విచారణ చేస్తున్నారు.

షికారుకొచ్చి.. చెట్టెక్కిన ఎలుగుబంటి



అన్నానగర్: ఎలుగుబంటి చెట్టెక్కి కూర్చొంది. నెల్లై జిల్లాలోని అంబై సమీపంలోని మణిముత్తారు పశ్చిమ కనుమల్లో పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు, జింకలతోపాటు వివిధ వన్యప్రాణులు ఉన్నాయి. ఇవి ఆహారం కోసం అప్పుడప్పుడూ పట్టణంలోకి వస్తుంటాయి. ఈ స్థితిలో ఆదివారం సెలవుదినం కావడంతో అ క్కడి జలపాతంలో స్నానాలు చేసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మణిముత్తార్ డ్యామ్ సమీపంలోని ప్రధాన రహదారిపై మధ్యాహ్నం ఎలుగుబంటి జనావాసంలోకి ప్రవేశించింది. ఇది చూసి కార్లు, వ్యాన్లు, ఇతర వాహనాల్లో వచ్చిన పర్యాటకులు భయాందోళనకు గురయ్యా రు. అయితే ఎలుగుబంటి అక్కడి 9వ పోలీస్ బెటాలియన్ దలావై హాస్టల్ వద్ద చెట్టు ఎక్కి కూ ర్చుంది. దీంతో బెటాలియన్ పోలీసులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగి చెట్టుపై కూర్చున్న ఎలుగుబంటిని అడవిలోకి తమిరికొట్టారు.

ఐదోసారి బాంబు బెదిరింపు

- చెన్నై విమానాశ్రయంలో పటిష్ట భద్రతా చర్యలు

కొరుక్కుపేట: ఆదివారం రాత్రి చెన్నై విమానాశ్రయానికి ఐదోసారి బాంబు బెదిరింపు వచ్చింది. తర్వాత చేపట్టిన సోదాల్లో అది కేవలం బూటకమని తేలింది. సంఘ విద్రోహశక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని విమానాశ్రయ అధికారులు తెలిపారు. చెన్నై ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌కు ఆదివారం రాత్రి పంపిన ఈ–మెయిల్‌లో చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో బాంబులు పెట్టామని, అవి నిర్ణీత సమయంలో పేలుతాయని సంక్షిప్తంగా పేర్కొన్నారు. దీంతో కార్యాలయ సిబ్బంది చెన్నై ఎయిర్‌పోర్టు డైరెక్టర్, బాంబు డిటెక్షన్ బృందానికి సమాచారం అందించారు. చెన్నై విమానాశ్రయంలో సీనియర్ భద్రతా అధికారుల అత్యవసర సంప్రదింపు సమావేశం నిర్వహించారు. ఫ్లైట్ సెక్యూరిటీ, ఎయిర్‌లైన్ కంపెనీ,



విమానాశ్రయంలో తనిఖీలు

పోలీసు అధికారులతో సహా చాలా మంది సిబ్బంది భద్రతలో నిమగ్నమయ్యారు. గత కొన్ని వారాలుగా ఇదే పరిస్థితి. ఇదిలావుండగా చెన్నై విమానాశ్రయంలోని పార్కింగ్ ప్రాంతం, విమానాలకు ఇంధనం నింపే ప్రాంతం, కార్గో పార్శిల్స్ లోడింగ్ ప్రాంతాలతోపాటు పలు ముఖ్యమైన ప్రదేశాల్లో భద్రతా బలగాలు విమానాశ్రయ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అలాగే విమానాశ్రయానికి వచ్చే అనుమానాస్పద వాహనాలను ఆపి సోదాలు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూడా బాంబు బెదిరింపు రావడంతో అది కూడా బూటకమేనని తెలుస్తోంది. అయితే ముందు జాగ్రత్త చర్యగా అన్ని ప్రాంతాల్లో భద్రతా తనిఖీలను ముమ్మరం చేశారు. దీంతో విమాన సర్వీసులపై ఎలాంటి ప్రభావం పడలేదు, నష్టం జరగలేదు. అన్ని విమానాలు ఆదివారం రాత్రి నుంచి యథావిధిగా ప్రయాణిస్తున్నాయి. బాంబు బెదిరింపు బూటకాలను ప్లాన్ చేసే సంఘ వ్యతిరేకులపై నిఘా ఉంచాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను విమానాశ్రయ అధికారులు ఆదేశించారు. బాంబు బూచీ ఇది ఐదోసారి అని ఇప్పటి వరకు ఫోన్, ఈ–మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చినట్టు విమానాశ్రయ అధికారి తెలిపారు.

అంకిత భావంతోనే విజయాలు సొంతం



పదేళ్ల చరిత్రతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చాంగ్ న్యూన్‌కిమ్

- కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్‌కిమ్

కొరుక్కుపేట: అంకితభావంతో పనిచేస్తే విజయాలు తప్పక సొంతమవుతాయని చెన్నైలోని కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్‌కిమ్ తెలిపారు. చెన్నై గిండిలో హిందుస్తాన్ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్‌లోని హిందుస్థాన్ ఇంటర్నేషనల్ స్కూల్(హిస్) పదో వార్షికోత్సవం, గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిండి క్యాంపస్‌లో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా చాంగ్ న్యూన్‌కిమ్ పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హిందుస్థాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభించిన సందర్భంగా 10 ఏళ్ల స్కూల్ చరిత్రను హిస్ స్టోరీ పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమగ్ర విద్య కోసం అంకిత భావంతో ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు పనిచేయడం, ఇలాంటి గొప్ప విద్యా సంస్థ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సైతం అంకిత భావంతో ముందుకెళితే విజయాలు సొంతం చేసుకోవచ్చని హితవు పలికారు. హిందుస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ అధ్యక్షత వహించారు. విద్యతో ప్రతిభను చాటుకున్న విద్యార్థులు ఘనంగా సత్కరించారు. క్రేమ్ బిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సీనియర్ రీజినల్ మేనేజర్ దిలీప్ కొట్టపదాత్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఉరుములతో కూడిన వర్షాలు

- వాతావరణ శాఖ వెల్లడి

కొరుక్కుపేట: వేసవి కాలం ముగుస్తున్న తరుణంలో నైరుతి రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చడంతో రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని, చెన్నైలో కూడా వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. వాయుగుండం కారణంగా తమిళనాడు, పుదుకోట్టై, కారైకాల్‌లోని కొన్ని చోట్ల సోమ, మంగళవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నైలోని వాతావరణ కేంద్రం తెలిపింది.ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు తమిళనాడులోని చెన్నైతోపాటు పుదుకోట్టై, కారైకల్ ప్రాంతాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

వినాయక ఆలయంలో కంచి స్వామీజీ



ఆలయంలో విజయేంద్రసరస్వతి స్వామీజీ

కొరుక్కుపేట: తిరువొత్తియూరు దక్షిణ మాడ రోడ్డులో నూతనంగా నిర్మించిన వినాయగర్ ఆలయాన్ని కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీ దర్శించుకున్నారు. తిరువొత్తియూరు దక్షిణ మాడ రోడ్డులోని శంకర కాలనీలో నూతనంగా వినాయక ఆలయాన్ని నిర్మించనున్నారు. ఇందుకోసం ఆలయ ప్రదేశాన్ని సందర్శించేందుకు విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఆలయానికి చేరుకుని గణేశుడి విగ్రహం ఉంచిన పీఠం వద్ద పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. పూజలను వైభవంగా నిర్వహించాలని ఆశీర్వదించారు. అనంతరం శంకర కాలనీలో కొలువై ఉన్న 55వ కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామీజీ పీఠాన్ని దర్శించుకుని భక్తులకు నైవేద్యాలు సమర్పించి అక్కడి గోశాల వద్దకు కూడా వెళ్లి సందర్శించారు.

అమ్మవారికి 58 కిలోల నాణేలు

అన్నానగర్: మారియమ్మన్‌కు ఓ భక్తుడు 58 కిలోల బరువుగల నాణేలను సమర్పించాడు. తిరుచ్చిలోని సమయపురం మారియమ్మన్ అమ్మవారి దర్శనానికి తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారి కోరికలు నెరవేరితే మొ క్కులు తీర్చుకుంటారు. ఈ క్రమంలో కుంభకోణం నగరానికి చెందిన సుధాకర్ అనే భక్తుడు తన కోరిక నెరవేరడంతో ఆదివారం సమయపురం మారియమ్మన్ ఆలయానికి సుమారు 58 కిలోల బరువున్న రూపాయి, రూ.2 , ఐదు రూపాయల నాణేలను తీసుకొచ్చి హుండీ కానుకగా చెల్లించాడు.

నామినేటెడ్ పదవుల జాప్యంతో వివాదం

- ఎమ్మెల్యేలకు రంగన్న ఝలక్
- బీజేపీ ఎమ్మెల్యేల గరంగరం



రంగస్వామి

సాక్షి, చెన్నై : నామినేటెడ్ పదవుల కేటాయింపులో జాప్యమే పుదుచ్చేరిలో బీజేపీ అభ్యర్థి నమశ్శివాయం ఓటమికి కారణంగా తేలింది. ఇకనైనా తమకు ఆ పదవులు ఇస్తారా..? లేదా అని ప్రశ్నించేందుకు సిద్ధమైన బీజేపీ ఎమ్మెల్యేలకు సీఎం రంగస్వామి ఝలక్ ఇవ్వడం వెలుగులోకి వచ్చింది. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తి అయినా ఇంతవరకు నామినేటెడ్ పదవులను భర్తీ చేయ లేదు. ఎమ్మెల్యేలకు ఆయా బోర్డుల్లోని చైర్మన్ తది తర పదవులే ఇక్కడం కీలకంగా ఉంటున్నాయి. కీల పదవులపై బీజేపీ ఎమ్మెల్యేలు గురిపెట్టడంతో ఎ వరికి ఏ ఒక్క పదవి ఇవ్వకుండా మూడేళ్ల కాలాన్ని సీఎం రంగస్వామి గడిపేశారు. ఈ ఆగ్రహమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నమశ్శివాయం ఓటమికి కారణంగా వెలుగు చూసింది. తమను నిర్లక్ష్యంగా చూడడంతో ఎన్నికల్లో ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో పనిచేయక పోవడం ఘోర పరాభావాన్ని చవి చూడాల్సిన పరిస్థితి బీజేపీ అభ్యర్థికి ఏర్పడింది. ఈ ఓటమి ద్వారా బీజేపీ ఢిల్లీ పెద్దలు రంగస్వామిని ఇరకాటంలో పెట్టవచ్చని బీజేపీ ఎమ్మెల్యేలు భావించినట్టుంది. అందుకే తమ అభ్యర్థిని చేజేతులా వారే ఓడించినట్టు చర్చ తెర మీదకు వచ్చింది. ఇకనైనా తమకు నామినేటెడ్ పదవులు ఇస్తే సరి లేకుంటే, రంగస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళాన్ని విప్పేందుకు సిద్ధమన్న సంకేతాన్ని శనివారం బీజేపీ ఎమ్మెల్యే ఇవ్వడం గమనార్హం.

విందుతో సరి పెట్టేందుకు..

బీజేపీ ఎమ్మెల్యేలు తనకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్న సమాచారంతో మేల్కొన్న రంగస్వామి అందర్నీ ఆదివారం విందుకు ఆహ్వానించినట్టుంది. బీజేపీ ఎమ్మెల్యేలు ముందుగానే రంగన్నకు సంధించాల్సిన ప్రశ్నల జాబితాను సిద్ధం చేసుకుని వచ్చినట్టు సమాచారం. ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు హోటల్‌లో విందుకు వెళ్లిన ఎమ్మెల్యేలకు షాక్ తప్పలేదట. అక్కడ అధికారులు అందరూ ఉండడంతో సీఎం రంగస్వామిని నిలదీయలేని పరిస్థితి ఏర్పడినట్టు సంకేతాలు వెలువడ్డాయి. చివరిలో తమతో రంగస్వామి మాట్లాడుతారని భావించిన బీజేపీ ఎమ్మెల్యేలకు నిరాశే మిగిలింది. ఈ విందును ముగించుకుని సీఎం వెళ్లి పోవడం బీజేపీ ఎమ్మెల్యేలు జీర్ణించుకోలేకుండా పోయారు. అయితే ఈ విందు తను బుజ్జగించేందుకు కాదని తెలుసుకుని మరింత ఆగ్రహానికి లోనైనట్టు చర్చ జరుగుతోంది. ఎన్నికలను విజయవంతం చేసినందుకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, అధికారులకు సీఎం విందు ఇచ్చినట్టు తెలిసి కంగు తినాల్సిన పరిస్థితి పుదుచ్చేరి బీజేపీ ఎమ్మెల్యేలకు తప్పలేదట. ఈ విందును డీఎంకే మిత్ర పక్షాలు, స్వతంత్ర ఎమ్మెల్యేలు బహిష్కరించడం గమనార్హం.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చెన్నై హైకోర్టు అదనపు జడ్జి సెంథిల్‌కుమార్

వేలూరు: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెన్నై హైకోర్టు అదనపు న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ సూచించారు. వేలూరు శ్రీపురంలోని బంగారుగుడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ నారాయణి విద్యాలయ పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమం పీఠాధిపతి శక్తిఅమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి అమ్మ పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ప్లస్‌టూ పరీక్షా ఫలితాల్లో పాఠశాలలో ఉన్నత మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు సర్టిఫికెట్లు, ఉత్తమ టీచర్లకు సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ శక్తిఅమ్మ నిరుపేదలకు అవసరమైన అన్ని సేవా కార్యక్రమాలను చేస్తున్నారన్నారు. అటవీ ప్రాంతంగా ఉన్న ఈ భూమిలో బంగారు గుడి నిర్మించి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులను ఇక్కడకు వచ్చి వెళ్లేలా చేశారన్నారు. ప్రస్తుతం తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు కూడా విద్యలో అధిక మార్కులు సాధించేలా ప్రయత్నం చేయాలన్నారు. జీవితంలో పట్టుదలతో ప్రయత్నం చేస్తే ఎటువంటి వాటినైనా సాధించవచ్చాన్నారు. ఇక్కడ విద్యను అభ్యసించిన మీరందరూ ఉన్నత శిఖరాలకు చేరుకున్న అనంతరం శక్తిఅమ్మ తరహాలోనే మీ ప్రాంతంలో ఉన్న నిరుపేద విద్యార్థులకు విద్యను అందజేసేందుకు సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సురేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శక్తిఅమ్మ ఆశీస్సులు అందుకున్నారు.

రాశీ చీర కట్టింది



నటి రాశీఖన్నా

తమిళసినిమా: అందాలతో కనువిందు చేయడంలో అతి కొద్దిమంది హీరోయిన్లలో నటి రాశీఖన్నా ఒకరని చెప్పవచ్చు. ఈమెను మోడరన్ డ్రస్‌లో ఏ యాంగిల్‌లో చూసినా సొగసులు గుభాళిస్తాయి. తొలుత మెడ్రాస్ కఫే అనే హిందీ చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించిన ఈ వయ్యారి ఆ తరువాత టాలీవుడ్, కోలీవుడ్ అంటూ తన పరిధిని విస్తరించుకుంటూ వచ్చారు. ముఖ్యంగా కోలీవుడ్‌లో ఇమైకా నొడిగళ్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత అడంగా మరు, దుల్కర్ దర్బార్, తిరుచిత్రంఫలం, సర్దార్ మొదలగు చిత్రాల్లో నటించి తనకుంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ఇటీవల సుందర్.సీ దర్శకత్వంలో తమన్నాతో పోటీ పడి (అందాలారబోతలో) నటించిన అరణ్మనై 4 చిత్రం వసూళ్ల వర్షం కురిపించింది. ఈ చిత్రం హిందీలోనూ అనువాదమై విడుదల కావడం విశేషం. అయితే సాధారణంగా గ్లామర్ పాత్రల్లో నటిస్తే క్రేజ్ వస్తుందని అంటుంటారు. అయితే రాశీఖన్నా ఆలోచనలు ఇప్పుడు అందుకు భిన్నంగా ఉన్నట్లు సమాచారం. గ్లామరస్‌గా నటించి బోర్ కొట్టిందో ఏమోగానీ, అందాలారబోతను మాత్రమే నమ్ముకుంటే సినిమాలో ఉన్నత స్థాయికి చేరుకోవడం కష్టమని, అభిమానుల మనసుల్లో పది కాలాల పాటు నిలిచి పోవడానికి, అవకాశాలు పెరగడానికి వైవిధ్యభరిత కథా చిత్రాలను ఎంపిక చేసుకుని నటించడం ముఖ్యం అని ఈ అమ్ముడు ఇటీవల ఒక భేటీలో పేర్కొన్నారు. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లోనూ నటిస్తున్న రాశీఖన్నాకు నటనకు అవకాశం ఉన్న పాత్రలు ఇప్పటికిప్పుడు రావడం అంటే ఆలోచించాల్సి ఉంటుంది. ఎందుకంటే గ్లామరస్ హీరోయిన్‌గా ముద్ర వేసుకున్న ఈమె ఆ ఇమేజ్ నుంచి బయట పడడానికి గట్టిగా ప్రయత్నించాల్సి ఉంటుందంటున్నాయి సినీ వర్గాలు. ఎందుకంటే రాశీఖన్నా ఇటీవల చీర ధరించిన ఫొటోలు సామాజిక మాధ్యమాలకు విడుదల చేశారు. అందులో ఆమె కట్టింది చీరే అయినా, మోడరన్ దుస్తులకు మించిన సొగసులు తొంగి చూస్తున్నాయనే కామెంట్స్ వస్తున్నాయి.

ఫాంటసీ డ్రామాతో రాకెట్ డ్రైవర్



రాకెట్ డ్రైవర్ చిత్రంలో విశ్వంత్ తదితరులు

తమిళసినిమా: వైవిధ్యంతో కూడిన కథా చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ కచ్చితంగా ఉంటుంది. అలాంటి విభిన్న కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం రాకెట్ డ్రైవర్. స్టోరీస్ బై ది షోర్ ప్రొడక్షన్ హౌస్ పతాకంపై అనిరుధ్ వల్లభ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా ఆనంద్ శంకర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫాంటసీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నటుడు విశ్వంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నాగవిశాల్, కాత్తాడి రామమూర్తి, నటి సునైనా, జగన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కౌశిక్ క్రిష్ సంగీతాన్ని, రెజిమల్ సూర్య థామస్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. అక్షయ్ పూళ్ల, ప్రశాంత్.ఎస్, శ్రీరామ్ అనంత శేఖర్ కథను అందించిన ఈ చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ తాను చేసిన తప్పిదాల కారణంగా జీవితంలో నిరాశకు గురైన ఒక ఆటో డ్రైవర్ ప్రపంచాన్నే మార్చాలని కలలు కంటాడన్నారు. అయితే ఆ కల కూడా ఫలించక పోవడంతో తన రోల్ మోడల్‌ను 17 వయసులో కలుస్తాడన్నారు. ఆ తరువాత జరిగే చిత్ర విచిత్రాలు కూడా విపరీతాలకు దారి తీస్తాయన్నారు. ఆ తరువాత ఏం జరిగిందన్న పలు ఆసక్తికరమైన అంశాలతో రాకెట్ డ్రైవర్ చిత్ర కథ సాగుతుందని చెప్పారు. చిత్ర షూటింగ్ పూర్తి అయ్యిందనీ, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు చేసుకుంటున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ నెలలో తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు.

కోలీవుడ్ టాక్స్

ఇది జీవితంలో గర్వపడే ఫాదర్స్‌డే



ఫీనిక్స్ చిత్ర టీజర్ ఆవిష్కరణ వేదికపై నటుడు విజయ్‌సేతుపతి, దర్శకుడు అనల్ అరసు, సూర్య తదితరులు

తమిళసినిమా: కోలీవుడ్‌లో మరో వారసుడు ఉద్భవించాడు. తమిళం, తెలుగు, మలయాళం, హిందీ తదితర భాషల్లో వివిధ రకాల పాత్రలు పోషిస్తూ విలక్షణ నటుడిగా రాణిస్తున్న విజయ్‌సేతుపతి వారసుడు సూర్య. ఇతను ఇంతకు ముందు నానుమ్ రౌడీదాన్, సింధుబాద్ వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో మెరిశాడు. కాగా తాజాగా ఫీనిక్స్ చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రముఖ స్టంట్ మాస్టర్ అణల్ అరసు దర్శకుడిగా పరిచయం అవుతూ ఏకే బ్రేవ్‌మెన్ పిక్చర్స్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రం ఇది. నటి వర్షా విశ్వనాథ్, అభినక్షత్ర, విఘ్నేష్, వరలక్ష్మీ శరత్‌కుమార్, సంపత్, దివ్యదర్శిని తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ సంగీతం, వేల్‌రాజ్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. ఈ చిత్ర టీజర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రపంచ ఫాదర్స్‌డే సందర్భంగా ఆదివారం సాయంత్రం చెన్నైలోని లీ మ్యాజిక్ ల్యాంటర్న్ ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో నటుడు విజయ్ సేతుపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదే రోజు ఆయన పుట్టిన రోజు కావడం విశేషం. ఈ సందర్భంగా విజయ్‌సేతుపతిని ఆయన కొడుకు, ఫీనిక్స్ చిత్ర కథానాయకుడు సూర్య శాలువాతో సత్కరించి ఆలింగనం చేసుకున్నారు. నటుడు విజయ్‌సేతుపతి మాట్లాడుతూ తాను ఇప్పటి వరకూ సూర్యకు తండ్రిగా 19 ఫాదర్స్‌డే లను చూశానని, అయితే ఈ ఫాదర్స్ డే తన జీవితంలో స్పెషల్ అని పేర్కొన్నారు. తాను విమానంలో పయనిస్తుండగా స్టంట్‌మాస్టర్ అణల్ అరసు కలిసి ఒక కథ చెప్పారన్నారు. అప్పుడు ఆయన రాసుకున్న కథను వినిపిస్తున్నారని భావించానన్నారు. కొద్ది రోజుల తరువాత ఆయన దర్శకత్వం వహించనున్న చిత్రంలో తన కొడుకు సూర్యను హీరోగా పరిచయం చేయాలనుకుంటున్నట్లు చెప్పారన్నారు. అందుకు మీకు ఇష్టం అయితే చేయమని చెప్పానన్నారు. అలా తెరకెక్కిన చిత్రం ఫీనిక్స్ అని చెప్పారు. కాగా చిత్ర టీజర్‌ను చూస్తే మంచి ఎమోషనల్‌తో కూడిన యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఉంటుందనిపించిందని చెప్పారు. త్వరలోనే చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు దర్శక, నిర్మాత అణల్ అరసు ఈ సందర్భంగా తెలిపారు.

మళ్లీ బాలీవుడ్ చిత్రమేనా?



సల్మాన్‌ఖాన్, దర్శకుడు అట్లీ

తమిళసినిమా: దక్షణాది చిత్రాల దర్శకులకు బాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. ముఖ్యంగా తమిళ దర్శకులు ఏఆర్ మురుగదాస్, అట్లీ వంటి వారు అక్కడ మంచి విజయాలు సాధించారు. ఏఆర్ మురుగదాస్.. గజని చిత్రంతో బాలీవుడ్‌లో విజయ జెండాను పాతారు. ఇక ఇటీవల అట్లీ జవాన్ చిత్రంతో విజయ కేతనాన్ని ఎగురవేశారు. ఈ చిత్రం ఏకంగా రూ.వెయ్యి కోట్లు క్లబ్‌ను సునాయాసంగా అధిగమించింది. కాగా అట్లీ మరోసారి బాలీవుడ్‌పై మొగ్గు చూపుతున్నట్లు తాజా సమాచారం. నిజానికి ఈయన అల్లు అర్జున్ హీరోగా తెలుగు చిత్రం చేయబోతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే దానికి సంబంధించిన చర్చలు విఫలం అయినట్లు తాజా సమాచారం. దీంతో అట్లీ మరోసారి హిందీ చిత్రాన్ని తెరకెక్కించడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. షారూక్ ఖాన్ కథానాయకుడిగా జవాన్ చిత్రాన్ని తెరకెక్కించి సక్సెస్ అయిన అట్లీ ఇప్పుడు మరో స్టార్ హీరో సల్మాన్‌ఖాన్‌తో చిత్రం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈయన సల్మాన్‌ఖాన్‌కు కథ చెప్పగా ఆయనకు బాగా నచ్చినట్లు, అందులో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా దీనికి సంబంధించిన అధికార ప్రకటన వెలువడాల్సి ఉందన్నది గమనార్హం. దాని తరువాత అట్లీ దర్శకత్వంలో సల్లుబాయ్ నటించే అవకాశం ఉందని సమాచారం. ఈ చిత్రాన్ని కూడా అట్లీ రూ.వెయ్యి కోట్ల క్లబ్‌లో చేర్చడానికి ప్రయత్నిస్తున్నట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వాస్తవమేమిటన్నది వేచి చూడాలి.



నటి త్రిష

ఆ హీరో పెళ్లికి త్రిష అడ్డుపడ్డారా?

తమిళసినిమా: నటిగా త్రిష వయసు 25 ఏళ్లు. ఇంతకాలం అగ్ర కథానాయకిగా రాణించడం సాధారణ విషయం కాదు. ఇప్పటికీ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ అయిన త్రిష అందం నానాటికీ పెరుగుతోందనే చెప్పాలి. 1999లో ప్రశాంత్, సిమ్రాన్ హీరో హీరోయిన్లుగా నటించిన జోడీ చిత్రంలో చిన్నపాత్రలో కనిపించిన నటి త్రిష. అంతకు ముందు అందాల పోటీల్లో పాల్గొని, చెన్నై బ్యూటీగా కిరీటాన్ని గెలుచుకున్న ఈమె ఆ తరువాత సూర్య హీరోగా నటించిన మౌనం పేసియదే చిత్రంతో మంచి గుర్తింపు పొందారు. ఇక విక్రమ్ సరసన నటించిన సామి చిత్ర విజయం ఆమెను స్టార్ హీరోయిన్ చేసింది. ఆపై తెలుగు, కన్నడం, హిందీ చిత్రాల్లోనూ నటించే అవకాశాలు వరించాయి. ఒక స్టేజీలో లేడీ ఓరియంటెడ్ కథా చిత్రాల నాయకి స్థాయికి చేరుకున్న త్రిషకు ఆ తరహా చిత్రాలు సక్సెస్‌ను అందించలేదు. దీంతో కెరీర్ బాధింపునకు గురైందనే చెప్పాలి. అలాంటిది మణిరత్నం దర్శకత్వంలో నటించిన పొన్నియిన్ సెల్వన్ చిత్రంతో మరోసారి ఈమె కెరీర్ ఉవ్వెత్తున ఎగిసింది. ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో బిజీ బిజీగా ఉన్నారు. ఎంతగా అంటే రూ.10 కోట్ల వరకు పారితోషికం డిమాండ్ చేసేంత స్థాయిలో ఉన్నారు. అయితే త్రిషకు సంబంధించిన చాలా విషయాలు సంచలనం అనే చెప్పాలి. ముఖ్యంగా ఈమె పెళ్లి నిశ్చితార్థం వరకు వచ్చి ఆగిపోవడం, ఇక ప్రేమ వదంతులు చాలానే ప్రచారంలో ఉన్నాయి. కాగా తాజాగా చాలా కాలం క్రితం జరిగిన ఒక సంఘటన ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అందేమిటంటే నటుడు శ్రీకాంత్ పెళ్లిని త్రిష చెడగొట్టే ప్రయత్నం చేశారన్నది. శ్రీకాంత్, త్రిష జంటగా మనసెల్లామ్ అనే చిత్రంలో నటించారు. కాగా ఆ చిత్ర కథానాయకుడు శ్రీకాంత్ నటి త్రిషపై సంచలన ఆరోపణ చేశారు. ఆయనకు వందన అనే యువతితో 2007లో పెళ్లి జరిగింది. అయితే వందనకు నటి త్రిషకు అంతకు ముందే పరిచయం ఉందట. దీంతో పెళ్లికి ముందు వందనతో నువ్వు శ్రీకాంత్‌ను పెళ్లి చేసుకోవద్దని, అతగాడు మంచి వాడు కాదని, ఇంగ్లిషు భాషను సరిగా మాట్లాడడం కూడా తెలియదని చెప్పారు. ఇదే విషయాన్ని వందన తన భర్త శ్రీకాంత్‌తో చెప్పారట. అలాగే త్రిషతో ఎందుకలా చెప్పావు అని అడిగారట. అందుకు త్రిష బదులిస్తూ నువ్వు తన మంచి మిత్రుడిని పెళ్లి చేసుకోబోతున్నావనే అలా చెప్పానని చెప్పారట. అయితే అదంతా ప్రాంక్ (సరదాగా) కోసం చేసినట్లు త్రిష అలా చెప్పినట్లు నటుడు శ్రీకాంత్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

మద్యం విక్రయం కేసులో యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: బ్లాక్ మార్కెట్‌లో మద్యం విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని ఓట్టేరి ప్రాంతంలో మద్యం దుకాణాలు తెరవకముందే మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు సమచారం అందింది. దీంతో ఆదివారం ఉదయం ఒట్టేరి కులకరై రోడ్డు ప్రాంతంలో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, తనిఖీ చేయగా అతడి వద్ద 20 మద్యం బాటిళ్లు ఉన్నట్లు తేలింది. అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయగా ఒట్టేరి ప్రాంతానికి చెందిన ఆనంద్ కుమార్ (27) అని, బ్లాక్ మార్కెట్‌లో మద్యం విక్రయిస్తున్నట్లు తేలింది. అతడిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

ఇసుకలో కూరుకుపోయి యువకుడి మృతి

అన్నానగర్: నెల్లై జిల్లా చేరన్మాదేవి సమీపంలోని పుదుకుడి ప్రాంతానికి చెందిన అరుణాచలం కుమారుడు పాచిముత్తు(28) కూలీ కార్మికుడు. పుదుకుడి పంచాయతీ కార్యాలయం సమీపంలోని చెల్లపిళ్లయార్ ఆలయంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో ఆలయం ముందు ఇసుకను కుప్పలుగా పోసి ఉంచారు. పాచిముత్తు ఆదివారం రాత్రి ఆ ఇసుక మీద పడుకున్నాడు. ఈ స్థితిలో అర్ధరాత్రి ట్రక్కులో ఇసుక తెచ్చి గుడి ముందు పోశారు. ఆ సమయంలో డ్రైవర్ లారీని వెనక్కు నడపడంతో ఆలయం ముందు ఇసుకపై పాచిముత్తు పడుకుని ఉన్న విషయం తెలియక డ్రైవర్ ఇసుకను అతనిపై పోశాడు. దీంతో ఇసుకలో కూరుకుపోయిన పాచిముత్తు ఊపిరి ఆడక సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి వీరవల్లూరుకు చెందిన లారీ డ్రైవర్ శక్తివేల్(23)ను అరెస్టు చేశారు. అతని వద్ద విచారణ జరుపుతున్నారు.

పుట్టిన 20 రోజులకే శిశువు..

అన్నానగర్: కోయంబత్తూరులోని సింగానల్లూరు పక్కనే ఉన్న ఒండిపుదూరు ప్రాంతానికి చెందిన రాజేష్ భార్య దీపారాణి(34). ఈమెకు ఇదివరకే మరొకరితో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త నుంచి విడిపోయిన దీపారాణికి రాజేష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఈ స్థితిలో సింగానల్లూరు ఈఎస్ఐ ఆసుపత్రిలో దీపారాణికి 20 రోజుల ముందు మగబిడ్డ జన్మించాడు. బాబు బరువు తక్కువగా ఉండడంతో ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచారు. చికిత్స తర్వాత పసికందును ఇంటికి తీసుకెళ్లారు. ఈ స్థితిలో సోమవారం పిల్లవాడు కదలకుండా ఉండడంతో హుటాహుటిన బిడ్డను ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బిడ్డ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని రైతు ..

తిరువళ్లూరు: పొలం పనుల్లో నిమగ్నమైన రైతుపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడిన రైతును వైద్యశాలకు తరలించే క్రమంలో మృతి చెందిన సంఘటన తిరువళ్లూరు జిల్లా వెంగల్ సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా వెంగల్ సమీపంలోని గురువాయల్ ప్రాంతానికి చెందిన పాల్యం(52). ఇతను తన కున్న రెండు ఎకరాల పొలంలో పంట సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆదివారం సాయంత్రం దుక్కి దున్నాలని నిర్ణయించి, అద్దె ట్రాక్టర్‌ను పిలిపించి పనులను ప్రారంభించాడు. అయితే దుక్కి దున్నే సమయంలో ట్రాక్టర్‌ను డ్రైవర్ వేగంగా నడపడంతో అదుపు తప్పి పనుల్లో నిగ్నమైన రైతు పాల్యంపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రైతు పాల్యం తీవ్రంగా గాయపడగా స్థానికులు తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ రైతును పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి కుమారుడు భూపాలన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తును చేపట్టారు.

కారు ఢీ కొని తల్లీకొడుకు..

అన్నానగర్: కారు ఢీకొని తల్లీకొడుకు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. తిరుచ్చిలోని పెట్టవైతలి శక్తినగర్‌కు చెందిన డీఎంకే ప్రముఖుడు ఇస్మాయిల్. ఇతనికి అదే ప్రాంతంలో కట్టెల దుకాణం ఉంది. ఇతని భార్య పర్వీన్ (30). కుమారుడు అఫ్జల్ మహ్మద్ (10). కూతురు పరిత ఉన్నారు. ఈ స్థితిలో పర్వీన్ ఆదివారం రాత్రి కుమారుడితో చెక్కల దుకాణానికి వెళ్లి బక్రీద్ పండుగ సందర్భంగా తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసింది. అప్పుడు నడుచుకుంటూ రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా తిరుచిరాపల్లి నుంచి కరూర్ వైపు వెళుతున్న కారు వారిని ఢీకొంది. ఈ ఘటనలో పర్వీన్, అఫ్జల్ మహ్మద్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్టు

అన్నానగర్: చెన్నై, తండయార్ పేట, కైలాసం వీధి, స్పెషల్ స్క్వాడ్ పోలీసులు ఆదివారం రాత్రి ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని పట్టుకున్నారు. వారి బ్యాగును తనిఖీ చేయగా అందులో డ్రగ్స్ ఉన్నాయి. దీంతో వారిని తండయార్‌పేట పోలీసులకు అప్పగించారు. విచారణలో తిరువొత్తియూరు కార్గిల్‌నగర్‌కు చెందిన కార్తీక్(25), రెడ్‌హిల్స్ ప్రాంతానికి చెందిన దినేష్(26), ఎన్నూర్‌కు చెందిన అబ్దుల్ కరీం(25), మదన్ కుమార్(20)గా గుర్తించారు. హైదరాబాద్ నుంచి రైలు మార్గంలో నైట్రోవెట్ మాత్రలను అక్రమంగా తెప్పించి చెన్నైలోని తండయార్‌పేటకు తీసుకుని వచ్చినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో పది మాత్రలను రూ.250కి కొనుగోలు చేసి ఇక్కడ 10 మాత్రలు రూ.1000కి విక్రయిస్తున్నట్లు తెలిసింది. నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి రూ.70 వేల విలువైన మత్తు మాత్రలు స్వాధీనం చేసుకున్నారు.

తీపాంజీ అమ్మవారి ఆలయంలో చోరీ



చోరీ జరిగిన ఆలయం



సీసీ టీవీలో నమోదైన నిందితుడి చిత్రం

తిరువళ్లూరు: తీపాంజీ అమ్మవారి ఆలయంలోని తాళాలు, హుండీ పగలగొట్టి విలువైన ఆభరణాలు, హుండీలోని మొత్తాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా చిన్న ఈకాడు గ్రామంలో ప్రసిద్ధి చెందిన తీపాంజీ అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఈకాడు, చిన్న ఈకాడు, తిరువళ్లూరు, పున్నపాక్కం తోపాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు నిత్యం ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత అర్చకుడు తాళం వేసుకుని ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం యథావిధిగా ఆలయానికి రాగా అప్పటికే తాళం పగలగొట్టి ఉండడంతోపాటు హుండీకి సమీపంలో నాణాలు చిందరవందరగా పడి ఉండడాన్ని గుర్తించి అర్చకుడికి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు చోరీ జరిగినట్టు నిర్ధారించి వేలిముద్రల నిపుణులను పిలిపించి, వివరాలను సేకరించి విచారణ చేపట్టారు. పోలీసులు చేపట్టిన విచారణలో అమ్మవారి బంగారు ఆభరణాలతో పాటు హుండీలోని సుమారు లక్ష రూపాయల మేరకు చోరీ జరిగినట్టు నిర్ధారించి విచారణ ముమ్మరం చేశారు. చోరీ చేసి పరారైన వ్యక్తి ఫొటోలు సీసీ టీవీ కెమెరాల్లో చిక్కింది. వాటి ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తిరునెల్వేలి రైల్వే స్టేషన్‌కు బాంబు బెదిరింపు

కొరుక్కుపేట: తిరునెల్వేలి రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టినట్టు బెదిరించిన ఓ కూలీని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునెల్వేలి జంక్షన్ రైల్వే స్టేషన్ పురాతనమైనది. నెల్‌లై ఎక్స్‌ప్రెస్‌తో సహా వివిధ రైళ్లు ఇక్కడ నుంచి నడుస్తాయి. చెన్నై, కోయంబత్తూరుతో సహా తమిళనాడు నగరాల మధ్య, కర్ణాటకలోని బెంగళూరు, ముంబయి తదితర ఇతర రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకు రైళ్లు నడుపుతున్నారు. చెన్నై పోలీసు కంట్రోల్ రూంకు ఆదివారం మధ్యాహ్నం 2.35 నుంచి 2.51 గంటల మధ్య ఒకే నంబర్ నుంచి కాల్స్ వచ్చాయి. ఆ నంబర్‌లో మాట్లాడిన వ్యక్తి.. నెల్లై జంక్షన్ రైల్వే స్టేషన్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు పేలుడు పదార్థాలు పెట్టారని.. అది కాసేపట్లో పేలుతుంది అని చెప్పి ఫోన్ పెట్టేశారు. దీంతో షాక్ తిన్న పోలీసులు వెంటనే తిరునెల్వేలి మున్సిపల్ పోలీస్ కంట్రోల్ రూం, తిరునెల్వేలి జంక్షన్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. కాల్ చేసిన ఫోన్ నంబర్‌ను పోలీసులు పరిశీలించారు. అది శివ పెరుమాళ్ అనే పేరుతో ఉంది. ఇతనిది నెల్లై సమీపంలోని తర్యుతు ప్రాంతం అని కూడా వెల్లడించారు. దీంతో నెల్లై జంక్షన్ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆ వ్యక్తి ఏడాది క్రితమే చెన్నైలోని వన్నార్‌పేటకు వెళ్లినట్లు సమాచారం. అనంతరం పోలీసులు అక్కడికి వెళ్లి సోదాలు నిర్వహించారు. విచారణలో అతను ఎక్కడ ఉన్నాడు ఆరా తీశారు. ఎట్టకేలకు పోలీసులు ఆ వ్యక్తిని పట్టుకుని విచారించారు. విచారణలో అతడు శివపెరుమాళ్ (40), కూలీ పని చేసే కరుప్పసామి కొడుకు అని, మద్యం మత్తులో నెల్లై రైల్వే స్టేషన్‌కు బాంబు ఉందని బెదిరించినట్లు తేలింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి శివపెరుమాళ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వెంటనే పేలుడు పదార్థాలు, బాంబ్ ప్రివెన్షన్ యూనిట్, పేలుడు స్క్వాడ్ పోలీసుల ఎండీ డిటెక్టర్ పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌లు, స్టోరేజీ రూమ్‌లు, ప్రయాణికుల వసతి గృహాల్లో సోదాలు చేశారు. ప్రయాణికుల వస్తువులపై కూడా సోదాలు చేశారు. ఇది బూటకం అని తేలింది. పోలీసులు కార్మికుడు శివ పెరుమాళ్‌ను అరెస్టు చేశారు.

రూ.9 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

అన్నానగర్: పొల్లాచ్చి, ఆనైమలై పరిసర ప్రాంతాల్లో గంజాయి నిల్వలు, విక్రయాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ బద్రీనారాయణన్ చర్యలు తీసుకుంటున్నారు. ఈ స్థితిలో ఆదివారం పొల్లాచ్చి మరపేట్టై సమీపంలో ప్రత్యేక బలగాలు వాహనాల తనిఖీలో నిమగ్నమయ్యాయి. అనంతరం అటుగా వస్తున్న అనుమానాస్పద కారును నిలిపి తనిఖీ చేశారు. అందులో రెండు బస్తాల్లో మొత్తం 60 కిలోల గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కారులో ఉన్న కేరళ రాష్ట్రానికి చెందిన రషీద్(24), కలీల్ రెహమాన్(44)లను పట్టుకుని విచారించారు. దర్యాప్తులో వారు ఆంధ్రప్రదేశ్ నుండి గంజాయిని తీసుకుని వచ్చి పొల్లాచ్చి మీదుగా కేరళకు అక్రమంగా తరలించి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు వెలుగులోకి వచ్చింది. అనంతరం వారి నుంచి పోలీసులు రూ.9 లక్షల విలువైన గంజాయిని, వారి వద్ద ఉన్న తుపాకీని, అక్రమంగా తరలిస్తున్న కేరళ రిజిస్ట్రేషన్ కారును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న రషీద్, కలీల్ రెహమాన్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

అన్నాడీఎంకే మాజీ మంత్రి కేపీ అన్బళగన్‌పై ఫిర్యాదు

కొరుక్కుపేట: వాహనం ఢీకొని పంచాయతీ మాజీ అధ్యక్షుడు మృతి చెందిన కేసులో అతని భార్య అన్నాడీఎంకే మాజీ మంత్రి కె.పి.అన్బళగన్‌పై సందేహం ఉన్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేపీ అన్బళగన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ధర్మపురి జిల్లా పాపిరెడ్డి పట్టి మేకపాళయం ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి (41) పంచాయతీ మాజీ అధ్యక్షుడు. ఇతని భార్య కవితా (34). వీరికి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ స్థితిలో కృష్ణమూర్తి కారిమంగళం – పెరియామ్పట్టి కామరాజర్ నగర్‌లో ఉన్న మామ ఇంట్లో ఉన్నాడు. అప్పుడు సొంత పని నిమిత్తం బయటకు వెళ్లి వస్తానని చెప్పి బైకుపై వెళ్లాడు. తర్వాత ధర్మపురి – కృష్ణగిరి జాతీయ రహదారిపై పూలాంపట్టి వంతెన సమీపంలో వెళుతుండగా అటువైపుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం కృష్ణమూర్తిని ఢీకొని నిలవకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స ఫలించక మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారించగా కృష్ణమూర్తి అన్నాడీఎంకేకు చెందిన మాజీ మంత్రి కె.పి అన్బళగన్‌పై మొట్ట మొదట అర్హతకు మించి ఆస్తులు కూడబెట్టిన కేసు పెట్టాడని తెలిసింది. ఈ స్థితిలో కృష్ణమూర్తి గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కారిమంగళం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు. ఈ స్థితిలో కృష్ణమూర్తి భార్య కవిత కారిమంగళం పోలీసు స్టేషన్‌లో ఒక ఫిర్యాదు చేసింది. అందులో తన భర్త మృతిలో సందేహం ఉందని, ఆయన మృతికి అన్నాడీఎంకే మాజీ మంత్రి కె.పి.అన్బళగన్, ఆయన కుటుంబసభ్యులకు సంబంధం ఉండవచ్చని సందేహం వ్యక్తం చేసింది. పోలీసులు తగు విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరింది. ఈ సంఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది.


రూ.3 లక్షలు విలువైన గుట్కా స్వాధీనం

వేలూరు: పట్టణంలోని సత్‌వచ్చారిలో పోలీసులు చేపట్టిన వాహన తనఖీల్లో రూ. 3 లక్షలు విలువ చేసే గుట్కా, మత్తు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. వేలూరు ఎస్పీ మణివన్నన్‌కు వచ్చిన రహస్య సమాచారంతో వేలూరు డీఎస్పీ తిరునావకరసు ఆధ్వర్యంలో పోలీసులు సత్‌వచ్చారిలోని గాంధీనగర్ వద్ద ఆదివారం సాయంత్రం వాహన తనఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనుమానంగా వచ్చిన ఒక కారు, రెండు బైకులను ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో కారు, బైకుల్లో 225 కిలోల గుట్కా ప్యాకెట్లు, ఐదు కిలోల మత్తు పదార్థాలు, హాన్స్ తదితరాలు సంచుల్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా, మత్తుపదార్థాల విలువ రూ.3 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వీటిని అక్రమంగా తరలిస్తున్న రాజస్థాన్‌కు చెందిన సునీల్ పటేల్, సుమర్‌నాథ్, సత్‌వచ్చారిలోని పొన్నియమ్మన్ ఆలయ వీధికి చెందిన కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి, కారు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు.

రైలు ఇంజిన్‌లో యువకుడి మృతదేహం

తిరువొత్తియూరు: రైలు ఇంజిన్‌లో ఓ యువకుడి మృతదేహం చిక్కుకుని ఉండడాన్ని ప్రయాణికులు గుర్తించి, రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై, సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి అలప్పులా ఎక్స్‌ప్రెస్ ఆదివారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరి, కాట్పాడి స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో రైలు ఇంజిన్ ముందు భాగంలో కాళ్లు తెగిపడిన స్థితిలో ఉన్న యువకుడి మృతదేహం చిక్కుకుని ఉంది. ఇది చూసిన ప్రయాణికులు దిగ్భ్రాంతి చెంది రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైలు ఇంజిన్‌లో చిక్కుకుపోయిన యువకుని మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. ఆ సమయంలో యువకుడి రెండు కాళ్లు తెగిపోయి ఉన్నాయి. మృతుడు ఎర్రటి చొక్కా, నలుపు రంగు జట్టి ధరించి ఉన్నాడు. అతను ఎవరు అనే వివరాలు తెలియలేదు. అతను ఎక్కడ రైలులో చిక్కుకున్నాడో తెలియలేదు. ఛిద్రమైన యువకుడి కాళ్లు ఎక్కడ పడి ఉన్నాయో కూడా తెలియలేదు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఉత్సాహంగా బక్రీద్ సంబరాలు



తిరుత్తణిలో ఈద్ ఉల్ అదా ప్రార్థనల్లో ముస్లింలు

తిరుత్తణి: తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో ముస్లింలు బక్రీద్ పర్వదినం వేడుకలను సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. పేదలకు కానుకలు పంపిణీ చేశారు. తిరుత్తణి, పళ్లిపట్టు, పొదటూరుపేట, ఆర్కేపేట, సీఎస్.కండ్రిగ, కొళత్తూరు సహా వివిధ ప్రాంతాల్లో మసీదుల్లో ఈద్ ఉల్ అదా(బక్రీద్) వేడుకలు చేపట్టారు. తిరుత్తణి శివారు చెన్నై తిరుపతి జాతీయ రహదారిలోని ముస్లిం నగర్‌లో జామా మసీదులో 500 మందికి పైగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదు గురువు ప్రత్యేక సందేశం ఇచ్చారు.

వేలూరులో..

వేలూరు: ముస్లింల ముఖ్య పండుగైన బక్రీద్ పండుగను సోమవారం ఉదయం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేలూరు ఈద్గా మైదానంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విషారం, తిరుపత్తూరు, వాణియంబాడి, గుడియాత్తం, వాలాజ, ఆంబూరు, జోలార్‌పేటలోనే కాకుండా జిల్లాలో 150 ప్రాంతాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తిరువణ్ణామలై జిల్లాలో కూడా మసీదులన్నీ ముస్లింలతో నిండి పోయాయి. వేలూరు కోట మైదానంలో పలు సంవత్సర కాలంగా మూసి వేసిన మసీదును తెరవాలని ముస్లింలు పోరాటాలు చేస్తారనే ఉద్దేశంతో ముందుస్తుగా కోట ముందు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తిరువళ్లూరులో...

తిరువళ్లూరు: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తిరువళ్లూరు, పేరంబాక్కం, పూందమల్లి, పొన్నేరి, గుమ్మిడిపూండి, ఆవడితోపాటు పలు ప్రాంతాల్లోని మసీదులు, దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిరుపేదలకు ముస్లింలు ఖుర్బానీ కింద బియ్యం, మాంసం, దుస్తులను అందజేశారు.

మిద్దె పైనుంచి దూకి వ్యాపారి ఆత్మహత్య

అన్నానగర్: వ్యాపారంలో నష్టం రావడంతో ఓ వ్యాపారి ఆదివారం ఇంటి 3వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నైలోని అన్నామలైపురం బోట్ క్లబ్ ప్రాంతానికి చెందిన ముకుంద్(65) వ్యాపారవేత్త. ఇతను ఈస్ట్‌కోస్ట్ రోడ్‌లోని వంగేణి ప్రాంతంలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ ఫ్యాక్టరీని నడుపుతున్నాడు. ఇతనికి వ్యాపారంలో తీవ్ర నష్టం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో గత కొన్ని రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. వ్యాపారంలో నష్టం వాటిల్లిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఈ క్రమంలో ముకుంద్ ఆదివారం రాత్రి తన ఇంటి 3వ అంతస్తులోని బాల్కనీ నుంచి అకస్మాత్తుగా కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో షాక్ తిన్న ముకుంద్ భార్య ప్రభ కన్నీరుమున్నీరుగా విలపించింది. దీని గురించి సమాచారం అందుకున్న అభిరామపురం పోలీసులు వచ్చి ముకుంద్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో మిద్దెపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకుని..

వేలూరు: ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. వేలూరు సైదాపేటలోని వినాయకనగర్‌కు చెందిన రేణుక కుమారుడు బాల మురుగన్(28) ప్రైవేటు ఆస్పత్రికి మందులు, మాత్రలను సరఫరా చేసేవాడు. రెండేళ్ల కిందట సత్‌వచ్చారికి చెందిన కోటి కుమార్తె తమిళ్‌సెల్విని వివాహం చేసుకున్నాడు. నాలుగు నెలలు గర్భిణిగా ఉన్న భార్యను వరకట్నం కోసం వేధింపులకు గురి చేసినట్లు తెలుస్తుంది. దీంతో తమిళ్ సెల్వి మూడు నెలల కిందట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయమై తమిళ్‌సెల్వి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్‌వచ్చారి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి, బాల మురుగన్‌ను అరెస్టు చేసి వేలూరు సెంట్రల్ జైలులో ఉంచారు. 60 రోజులు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించిన బాల మురుగన్ గత మాసంలో జైలు నుంచి బయటకు వచ్చారు. ఇతను ప్రతి రోజూ సత్‌వచ్చారి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సత్‌వచ్చారి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేసి బయటకు వచ్చి ఒడుగత్తూరుకు బైకులో వెళ్లాడు. సాయంత్రం ఏరిపుదూరు వద్ద నడిరోడ్డుపై బైకును ఆపి, అందులోని పెట్రోల్‌ను తీసి శరీరంపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఈ విషయం గుర్తించిన వాహన చోదకులు అతన్ని కాపాడి అంబులెన్స్‌లో వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. భార్య మృతి చెందడంతోనే ఆ బాధను తట్టుకోలేక బాల మురుగన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

లారీ డ్రైవర్..

అన్నానగర్: కుమారులకు స్కూలు ఫీజులు కట్టలేక మనస్తాపం చెందిన లారీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపంలోని కుమారపాళయం ప్రాంతానికి చెందిన వేలుచ్చామి (43), లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య శృతి, సంజయ్ (12), అజయ్ (10) కుమారులు ఉన్నారు. వీరు ఇదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సంజయ్ ఆరో తరగతి, అజయ్ నాలుగో తరగతి చదువుతున్నారు. ఈ స్థితిలో శృతి ఆదివారం రాత్రి తన భర్తతో ఇద్దరు కొడుకులకు స్కూల్ ఫీజు చెల్లించాలని చెప్పింది. ఫీజు కట్టకపోవడంతో పాఠశాలకు వెళ్లడం లేదని కూడా చెప్పింది. ఇది విని వేలుచ్చామి తీవ్ర మనస్తాపం చెందాడు. ఎలాగోలా డబ్బులు ఇచ్చే ఏర్పాటు చేస్తానని చెప్పి, పడక గదిలోకి వెళ్లాడు. తర్వాత లోపలికి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఆ తర్వాత తలుపు తట్టినా ఎంతసేపటికీ తెరవకపోవడంతో కిటికీలోంచి చూడగా వేలుచ్చామి బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సహాయంతో వేలుచ్చామిని రక్షించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే వేలుచ్చామి మృతి చెందినట్లు తెలిపారు.

ఏనుగు దంతాల స్మగ్లర్ల అరెస్ట్

అన్నానగర్: కన్నివాడి సమీపంలో సోమవారం రూ.50 లక్షల విలువైన ఏనుగు దంతాలను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. దిండుక్కల్ జిల్లా కన్నివాడి ప్రాంతంలో ఏనుగు దంతాలను అక్రమంగా తరలించి విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు తమిళనాడు అటవీ, వన్యప్రాణుల క్రైమ్ కంట్రోల్ విభాగానికి రహస్య సమాచారం అందింది. సోమవారం వేకువజామున కన్నివాడిలో అటవీశాఖ తీవ్ర నిఘా పెట్టింది. కన్నివాడి బైపాస్ ప్రాంతంలో ముగ్గురితో కూడిన ముఠా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించింది. అటవీశాఖ అధికారులు వారిని పట్టుకుని విచారించారు. విచారణలో వారు పన్నైకాడు ప్రాంతానికి చెందిన రామన్(53), కన్నివాడికి చెందిన రైతు సోమసుందరం(49), పళని వాయలూరుకు చెందిన గణేశన్(59) అని తేలింది. దీంతో అటవీశాఖ వారు ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 2 ఏనుగు దంతాలు స్వాధీనం చేసుకున్నారు. అవి సుమారు ఒక్కొక్కటి రెండు కిలోల బరువు ఉంటాయని, వాటిని రూ.50 లక్షలకు విక్రయించేందుకు బేరం కుదుర్చుకున్నట్లు వారు తెలిపారు.

తిరుత్తణిలో వర్షపునీటితో ఇబ్బందులు



తిరుత్తణి రైల్వేస్టేషన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

తిరుత్తణి: పట్టణ ప్రధాన రోడ్డులో వర్షపు నీరు నిల్వ చేరడంతో ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుత్తణిలో ఆదివార రాత్రి 9 గంటల నుంచి గంట సమయం జోరువాన కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బస్టాండ్ సమీపంలోని మపోసి రోడ్డులో రైల్వేస్టేషన్ వద్ద వర్షపు నీరు ప్రవహించకుండా ట్రాకు నిండి రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయనే కారణంతో రైల్వే అధికారులు వర్షపునీరు ప్రవహించే మార్గాలను మూసివేశారు. దీంతో వర్షపు నీరు మపోసి రోడ్డులో నాలుగు అడుగుల లోతు వర్షపు నీరు నిల్వ చేరింది. దీంతో మార్కెట్ ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్ వరకు దుకాణాల్లో సైతం వర్షపు నీరు చేరడంతో వ్యాపారులు ఆందోళన చెందారు. అటు వైపుగా ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు వీలుకాకపోవడంతో వాహన చోదకులు ఇక్కట్లు పడ్డారు. వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు, మురుగన్ ఆలయానికి వచ్చిన భక్తులు మపోసి రోడ్డులో రాకపోకలు సాగించ లేక తీవ్ర ఇబ్బందులు చెందారు. రైల్వే అధికారులతో తిరుత్తణి మున్సిపాలిటీ అధికారులు చర్యలు జరిపి, వర్షపు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వ్యాపారులు కోరారు.

హార్స్ రైడింగ్ శిక్షణ కేంద్రంలో బాలికకు లైంగిక వేధింపులు

- యజమాని, ట్రైనర్ అరెస్టు

తిరువొత్తియూరు: పట్టుకోట్టైలోని హార్స్ రైడింగ్ శిక్షణ కేంద్రంలో ఓ డాక్టర్ కూతురిని లైంగికంగా వేధించిన ట్రైనర్, శిక్షణ కేంద్రం యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. తంజావూరు జిల్లా, పట్టుకోట్టైలోని కార్నర్ బైపాస్ రోడ్డులో గుర్రపుస్వారీ శిక్షణ కేంద్రం ఉంది. ఈ కేంద్రాన్ని రాజ్‌కుమార్ (41) నడుపుతున్నాడు. ఇందులో తమిళరసన్ (26) శిక్షకుడిగా పనిచేస్తున్నాడు. ఇక్కడ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పాఠశాల, కళాశాల విద్యార్థులు గుర్రపు స్వారీ శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో పదో తరగతి చదువుతున్న పట్టుకోట్టైకి చెందిన ప్రముఖ డాక్టర్ కుమార్తె(14) ఈ కేంద్రంలో ఏడాది కాలంగా గుర్రపు స్వారీ శిక్షణ పొందుతోంది. ఈమెకు తమిళరసన్ శిక్షణ ఇస్తున్నాడు. ఇతర విద్యార్థులు వెళ్లిన తర్వాత, డాక్టర్ కుమార్తెను అదనపు సమయం ఉండమని చెప్పి, ఆమెకు శిక్షణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో ఆమెకు లైంగికంగా వేధించినట్లు తెలిసింది. అలాగే సంవత్సరం కాలంగా విద్యార్థినిని లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని విద్యార్థిని తన తండ్రికి చెప్పి బోరున విలపించింది. దీంతో గుర్రపు శిక్షణ కేంద్రం యజమాని రాజ్‌కుమార్‌ను డాక్టర్ ఖండించారు. దీనిపై డాక్టర్ పట్టుకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తమిళరసన్, రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి పుదుకోట్టై జైలులో పెట్టారు.

ఇన్‌కంటాక్స్ అధికారులమంటూ దోపిడీ

- వ్యాపారి ఇంట్లో రూ. 5 లక్షలు నగదు, నగలు దోచుకున్న ముఠా

తిరువొత్తియూరు: ఇన్‌కమ్ టాక్స్ అధికారుల మని చెప్పి ఓ వ్యాపారి ఇంట్లో రూ.5లక్షల నగదు, నగలు దోచుకెళ్లిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. తిరుచ్చి జిల్లా తురైయూరు మార్కెట్ ప్రాంతానికి చెందిన మధురైవీరన్ (64) హోల్‌సేల్ జౌళి దుకాణం నడుపుతున్నాడు. అలాగే కేరళలో ఉన్న జౌళి దుకాణానికి చిల్లర విక్రయం కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో మదురైవీరన్ భార్య, ఇద్దరు కుమార్తెలతో చెన్నైలో నివాసం ఉంటున్నారు. తురైయూరులో ఉన్న ఇంట్లో మదురైవీరన్, అతని చెల్లెలు కృష్ణవేణి (60) నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున మధురైవీరన్ వాకింగ్‌కు వెళ్లిన సమయంలో తెలుపు రంగు కారులో వచ్చిన ఐదుగురి ముఠా తాము ప్రభుత్వ ఇన్‌కమ్ టాక్స్ అధికారులమని చెప్పి, పన్ను చెల్లించలేదని అతని ఇంట్లో తనిఖీ చేయాలని మధురైవీరన్ ఇంట్లోకి హద్దు మీరి ప్రవేశించారు. కృష్ణవేణిని సోఫాలో కూర్చోబెట్టి ఇల్లంతా తనిఖీ చేశారు. అలమారలో ఉన్న తాళం తీసుకుని బీరువా తెరిచి, అందులోని రూ.5 లక్షల నగదు, 5 సవర్ల నగలు, బంగారం రుద్రాక్ష మాల తదితర వస్తువులను దోచుకుని, అక్కడి నుంచి కారులో పారిపోయారు. వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన మధురైవీరన్‌తో జరిగిన సంఘటన గురించి కృష్ణవేణి చెప్పారు. దీంతో అతను తెలిసిన వారి మూలంగా ఐటీ ప్రభుత్వ కార్యాలయంలో సంప్రదించి, వివరణ కోరగా ఇన్‌కమ్ టాక్స్ అధికారులు రైడింగ్‌కు రాలేదని తెలిపారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన మధురైవీరన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మూఢ నమ్మకానికి శిశువు బలి

- నీటిలో ముంచి చంపేసిన తాత

సాక్షి, చెన్నై: మూఢనమ్మకం ముక్కు పచ్చలారని పసికందును బలి తీసుకుంది. తన ప్రాణానికి గండంగా పుట్టిన మనవడిని తాతే నీటిలో ముంచి చంపేసిన ఘటన సోమవారం జయంకొండాం సమీపంలో వెలుగు చూసింది. అరియలూరు జిల్లా జయంకొండాం సమీపంలో ఓ గ్రామంలో వీరముత్తు(65), రేవతి(60) దంపతులు నివాసం ఉన్నారు. వీరి కుమార్తె సంగీతకు గత ఏడాది సమీప గ్రామానికి చెందిన బాల మురుగన్‌తో వివాహం జరిగింది. వీరికి 38 రోజుల క్రితం పండంటి మగబిడ్డ జన్మించాడు. తిరుపూర్ నుంచి తొలి కాన్పు నిమిత్తం తల్లిదండ్రుల వద్దకు మూడు నెలల క్రితం సంగీత వచ్చింది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఇక్కడే ఉంది. ఈ పరిస్థితులలో రెండు రోజుల క్రితం ఆ పసిబిడ్డ కనిపించకుండా పోయాడు. ఎవరో కిడ్నాప్ చేశారన్న సమాచారంతో పోలీసులు తీవ్రంగా గాలించారు. చివరకు ఆదివారం ఇంటికి సమీపంలో బిడ్డ మృత దేహం బయట పడింది. ఈ మరణం ఓ మిస్టరీగా మారడంతో పోలీసులు రహస్యంగా విచారిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆ ఇంట్లో ఉన్న రేవతి, బంధువు అనుసూయలను అదుపులోకి తీసుకుని విచారించగా, తాతయ్య బండారం బయట పడింది. ఈ బిడ్డ పుట్టిన ఘడియలు సక్రమంగా లేదని తెలిపారు. అతడు పుట్టిన వేళ తాతయ్యకు మరణ గండంతో పాటుగా కుటుంబం అంతా అప్పుల పాలై రోడ్డున పడుతుందని ఎవరో చెప్పినట్టు తెలిసింది. మూఢ నమ్మకానికి బానిసగా ఉన్న వీరముత్తు గుట్టు చప్పుడు కాకుండా తన పని ముగించాడు. ఇంట్లో ఉన్న అతి పెద్ద నీటి డ్రమ్‌లో ఆ బిడ్డను ముంచి చంపేశారు. అందులోనే ఒక రోజు ఉంచారు. మరుసటి రోజు తీసుకెళ్లి బయట పడేశాడు. ఈ విషయం సంగీతకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. రేవతి ఈ విషయాన్ని గుర్తించి బంధువు అనుసూయకు చెప్పేసింది. చివరకు పోలీసుల తమదైన శైలిలో రేవతి, అనుసూయ వద్ద జరిపిన విచారణలో మూఢ నమ్మకంతో హంతకుడిగా మారిన వీరముత్తు బండారం వెలుగు చూసింది. అతడిని అరెస్టు చేసిన పోలీసులు జైలుకు తరలించారు.

పేలుడు పదార్థాల తయారీ ఇంట్లో పేలుడు

- ఒకరి మృతి మరొకరికి తీవ్ర గాయాలు

కొరుక్కుపేట: తిరువారూర్ జిల్లా మన్నార్‌గుడిలో ఓ ఇంట్లో పేలుడు పదార్థాలను తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో పనుల్లో నిమగ్నమై ఉన్న ఒకరు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి. తిరువారూర్ జిల్లా తామరైకులం వడకరై సెల్వవినాయకర్ కోయిల్ వీధికి చెందిన విజయ్, అతని కుమారుడు సెల్వకుమార్ 30 ఏళ్లుగా కర్తనాథపురంలోని మఠం కోయిల్ వీధి వెనుక ఉన్న పొలంలో దేశీయ పేలుడు పదార్థాల తయారీ ప్లాంట్‌ను నడుపుతున్నారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీ యజమాని విజయ్ చిన్న కుమారుడు సతీష్‌కుమార్(35), అదే ప్రాంతానికి చెందిన కార్మికుడు అరుణ్‌కుమార్(19) ఇంట్లో పేలుడు పదార్థాలను కలిపే పని చేస్తున్నారు. అప్పుడు ఒక్కసారిగా పేలుడు పదార్థాలు పేలి భవనం పూర్తిగా ధ్వంసమైంది. సతీష్‌కుమార్ మృతి చెందగా కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటల్లో తీవ్రంగా గాయపడిన అరుణ్‌కుమార్, సతీష్‌కుమార్‌ను బయటకు తీశారు. సతీష్ కుమార్ మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన అరుణ్‌కుమార్‌కు నిరంతరం చికిత్స అందిస్తున్నారు.

తిరువొత్తియూరులో గేదె వీరంగం

- మహిళసహా ముగ్గురిపై దాడి

తిరువొత్తియూరు: తిరువొత్తియూరులో గేదె వీరంగం చేసింది. ఓ మహిళసహా ముగ్గురిపై దాడి చేసి, గాయపరిచింది. చెన్నై, శివారు ప్రాంతాల్లో రోడ్డుపై తిరిగే పశువులు, కుక్కల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. దీన్ని అడ్డుకునేందుకు కార్పొరేషన్ పలు ఆంక్షలు విధించింది. పశువులు రోడ్డుపై సంచరిస్తే వాటిని బంధించి, సంబంధిత యజమానులకు జరిమానా విధిస్తున్నారు. ఈ క్రమంలో తిరువొత్తియూరులో ఓ గేదె రోడ్డుపై నడిచి వెళ్లే వారిని వెంటాడి తరుముకుంది. దీంతో భయాందోళనకు గురైన పాదచారులు, వాహన చోదకులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఆ సమయంలో గేదె తన కొమ్ముతో ఒక మహిళను కుమ్మడంతో ఆమె దుస్తులు కొమ్ముకు చిక్కుకున్నాయి. గేదె ఆమెను రోడ్డుపై సుమారు 50 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ప్రజలు గేదెను తరిమివేసి మహిళను రక్షించారు. ఈ ఘటనలో మహిళ చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఆ గేదె మరో ఇద్దరిపై దాడి చేయడంతో గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. ఈ విషయం తెలుసుకున్న తిరువొత్తియూరు మండల కమిటీ చైర్మన్ తనియరసు, కార్పొరేషన అధికారులు, సిబ్బందితో సహా అక్కడికి చేరుకుని ఆ గేదెను పట్టుకుని పెరంబూరులోని సంరక్షణ కేంద్రానికి తరలించారు.

బిర్యానీ ఫెస్టివల్



సాక్షి, చెన్నై : తమిళనాడులో వంటకాలకు ప్రసిద్ధి చెందిన దిండుగల్ తలప్పాకట్టి నేతృత్వంలో బిర్యానీ ప్రియుల కోసం గ్రేట్ ఇండియా బిర్యానీ ఫెస్టివల్‌కు సోమవారం శ్రీకారం చుట్టారు. 23 రకాల వంటకాలతో ఆహార ప్రియులను ఆకర్షించేలా సిద్ధం చేసిన బిర్యానీ ఫెస్టివల్ లోగోను సోమవారం జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు సెంథిల్‌కుమార్, రవికన్నన్ ఆవిష్కరించారు.

ఆగని టీడీపీ అరాచకం

పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం

- పాఠశాల ప్రహరీ తొలగింపు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్త రేకుల షెడ్, ప్రహరీ ధ్వంసం
- పెద్ద ఎత్తున శిలాఫలకాలు ముక్కలు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం నేతలు, కార్యకర్తల అరాచకాలు కొనసాగుతున్నాయి. పలుచోట్ల విధ్వంసాలకు పాల్పడుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆస్తుల్ని, ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేయడమేగాక ప్రగతిపనుల శిలాఫలకాలను ముక్కలు చేస్తున్నారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం శివాపురంతండాలో ఆదివారం రాత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన విగ్రహాన్ని మాయం చేశారు. దీన్ని గమనించిన స్థానికులు సోమవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు పాల్పడినవారి ఆచూకీ కోసం వివరాలు సేకరిస్తున్నట్లు నకరికల్లు ఎస్‌ఐ కె.నాగేందర్‌రావు చెప్పారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. నాదెండ్ల మండలం సాతులూరులో వడ్డెరపాలెం వెళ్లే మెయిన్ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గ్రామానికి చెందిన ముగ్గురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం ధ్వంసం చేశారు. ఇది గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లా కుప్పంలో నాడు–నేడు కింద గత ప్రభుత్వంలో నిర్మించిన పాఠశాల ప్రహరీలను ఆదివారం టీడీపీ నాయకులు జేసీబీ యంత్రాలతో కూల్చేశారు. నాడు–నేడు కింద కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని తంబిగానిపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గత ప్రభుత్వం తీర్చిదిద్దింది. గ్రామ నడిబొడ్డున ఉన్న పాఠశాలకు ప్రత్యేకంగా రూ.20 లక్షలతో ప్రహరీ నిర్మించింది. ఈ గోడను కొందరు టీడీపీ నాయకులు ఇళ్లకు అడ్డంగా నిర్మించారని ఇప్పుడు కూల్చేశారు. టీడీపీ నాయకుల ఇళ్ల ముందు విశాలంగా స్థలం కావాలని రూ.20 లక్షలతో నిర్మించిన ప్రహరీని కూల్చి వేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుప్పం మండలంలోని మల్లానూరు గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆవిష్కరించిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. గుత్తార్లపల్లి వద్ద నిర్మించిన వన్నెకుల క్షత్రియ భవనం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని సైతం కూల్చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ జంగాలపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పచ్చికాల శీనయ్య రేకుల షెడ్డు, ప్రహరీని స్థానిక టీడీపీ కార్యకర్తలు సోమవారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. శీనయ్య రూ.5 లక్షలతో తన స్థలంలో షెడ్ వేసుకుని చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. ప్రహరీని, షెడ్‌ను ధ్వంసం చేస్తామని టీడీపీ కార్యకర్తలు బెదిరిస్తుండటంతో శీనయ్య రెండురోజుల కిందట వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలు సోమవారం తెల్లవారుజామున జేసీబీతో ప్రహరీని, రేకుల షెడ్‌ను ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అంకమరావు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురం నుంచి దొండపూడి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి మాజీ హోం మంత్రి తానేటి వనిత ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని దుండగులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. దీనిపై సోమవారం ఉదయం ఆ శిలాఫలకం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్ ఆర్మీ సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం నాలుగురోడ్ల కూడలి వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. తాము గత ఐదేళ్లలో ఎప్పుడూ ఇటువంటి దాడులు, శిలాఫలకాల ధ్వంసాలు చేయలేదని వారు చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడితే అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు.


టీడీపీ శ్రేణులు ధ్వంసం చేసిన గోపాలపురం -దొండపూడి రోడ్డు నిర్మాణ శిలాఫలకం


సాతులూరులో టీడీపీ శ్రేణులు ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం


శివాపురం తండాలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం తొలగించిన ప్రాంతంలోని దిమ్మె


తంబిగానిపల్లిలో జేసీబీతో ప్రభుత్వ పాఠశాల ప్రహరీని కూల్చి వేయిస్తున్న టీడీపీ వర్గీయులు


జంగాలపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శీనయ్య స్థలంలోని ప్రహరీ, రేకుల షెడ్‌ను టీడీపీ నేతలు ధ్వంసం చేసి చదును చేసిన దృశ్యం

వైఎస్సార్‌సీపీ ఏజెంట్ కిడ్నాప్‌నకు యత్నం

టీడీపీ నేతల దుశ్చర్యను అడ్డుకున్న నసనకోట గ్రామస్తులు


వైఎస్సార్‌సీపీ కార్యకర్త జగదీష్‌ను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ వర్గీయులు

సాక్షి, పుట్టపర్తి: ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత పంచాయతీ నసనకోటలో ఆదివారం రాత్రి టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఏజెంట్ మాల జగదీష్‌ను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. రామగిరి మండలం నసనకోటలో జగదీష్‌ను కొందరు బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీన్ని గమనించిన గ్రామస్తులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కిడ్నాప్‌నకు యత్నించినవారు ఉడాయించారు.

మంచికల్లులో ఇద్దరు మహిళలపై టీడీపీ వర్గీయుల దాడి

రెంటచింతల: పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మంచికల్లు గ్రామంలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు మహిళలపై టీడీపీ వర్గీయులు దాడిచేసి గాయపరిచారు. పసువుల పాకలో గేదెలను కడుగుతున్న పొట్లపాటి విజయమ్మపై టీడీపీకి చెందిన గోగుల లక్ష్మారెడ్డి, గోగుల వెంకటరామిరెడ్డి, గోగుల పున్నారెడ్డి, గోగుల నాగలక్ష్మి, పల్లెర్ల సునీత, గోగుల లక్ష్మారెడ్డి దాడి చేసి కొట్టారు. ఆ సమయంలో అడ్డువచ్చిన పొట్లపాటి లక్ష్మమ్మపైన కూడా దాడిచేసి గాయపరిచారు. బాధిత మహిళలు టీడీపీ వారు దాడిచేసిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన మహిళలను ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


గాయపడిన విజయమ్మ


గాయపడిన లక్ష్మమ్మ

అంగన్‌వాడీ స్థలం కబ్జా

పెద్దపంజాణి (చిత్తూరు జిల్లా): అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించిన ఘటన పెద్దపంజాణి మండలంలోని బెరబల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పెద్దపంజాణి పంచాయతీ బెరబల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అక్రమంగా తమ ఆధీనంలో ఉంచుకున్న సుమారు 10 సెంట్ల ప్రభుత్వ భూమిని దాదాపు రెండేళ్ల క్రితం గ్రామస్తుల వినతి మేరకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయిస్తూ ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ భూమిని తిరిగి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. జేసీబీతో ప్రహరీని తొలగించారు.


ప్రహరీని తొలగిస్తున్న జేసీబీ

క్లుప్తంగా...

సత్తెమ్మతల్లి ఆలయ ఉద్యోగుల గెంటివేత

- టీడీపీ నేతల దౌర్జన్యం
- తమవారిని నియమించుకుంటామంటూ బెదిరింపులు

అచ్చంపేట : మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభు సత్తెమ్మతల్లి ఆలయ ఉద్యోగులపై సోమవారం టీడీపీ నాయకులు దాడులకు తెగబడ్డారు. దేవదాయ శాఖ నిర్వహణలో ఉన్న ఆలయంలో అమ్మవారి దర్శన టికెట్లు విక్రయించేందుకు, వచ్చిన భక్తులను క్యూలో పంపేందుకు మాదిపాడుకు చెందిన చిట్టిపోతుల గోవర్ధన, కోటకొమ్ముల గోపి అనే ఇద్దరు ఉద్యోగులను దేవస్థాన కమిటీ నియమించింది. రోజూలాగానే వీరు విధులు నిర్వహించేందుకు వెళ్లగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. మీరు ఈ రోజు నుంచి విధులకు రానవసరం లేదని, తమ పార్టీ వారిని నియమించుకోవాలని అడ్డుపడ్డారు. తమను దేవస్థాన కమిటీ నియమించిందని, వారు చెబితేనే తప్పుకొంటాం.. ఉద్యోగులు స్పష్టం చేశారు. ఇంకెక్కడి కమిటీ, అసెంబ్లీ సమావేశాలు అయిపోగానే కమిటీనీ కూడా రద్దు చేయిస్తామని, తమ పార్టీ వ్యక్తే కమిటీ చైర్మన్‌గా ఉంటాడంటూ ఆలయంలోంచి వారిని బయటకు నెట్టేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ కొరివి నరేష్ మాట్లాడుతూ తమను తొలగించాలంటే దేవదాయశాఖ నుంచి ఉత్తర్వులు రావాలని, వీరికి ఆ అధికారం లేదని చెప్పారు.

ఏయూ వీసీకి బెదిరింపు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ఆంధ్ర యూనివర్సిటీ వీసీ పి.వి.జి.ప్రసాద్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలంటూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌కు బెదిరింపు కాల్స్ వచ్చాయి. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మాధవనాయుడు అనే వ్యక్తి ఏయూ రిజిస్ట్రార్‌కు పదేపదే ఫోన్ చేసి వీసీ తక్షణమే రాజీనామా చేసి విదేశాలకు వెళ్లిపోవాలని లేకుంటే తీవ్ర చర్యలు తీసుకుంటామని బెదిరించారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఆ వ్యక్తికి కాల్ చేసి విచారించారు. ఇలా బెదిరించటం సరైన పద్ధతి కాదని, ఇంకోసారి ఫోన్ చేసి బెదిరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామ సచివాలయంపై టీడీపీ ఫ్లెక్సీలు


అల్లూరివారిపాలెం గ్రామ సచివాలయంపై టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామ సచివాలయంపై టీడీపీ ఫ్లెక్సీలు వెలిశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎంపీ, ఎమ్మెల్యేలు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామ తెలుగుయువత నాయకులు వీటిని ఏర్పాటుచేశారు. గ్రామ సచివాలయం కనిపించకుండా భారీ ఫ్లెక్సీలతో మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలపై రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటుచేయడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జమ్మలమడుగు ఏఎంసీ వైస్ చైర్మన్‌పై దాడి


చికిత్స పొందుతున్న సుబ్బరాయుడు

జమ్మలమడుగు రూరల్: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ చాపాల సుబ్బరాయుడుపై ఎన్డీఏ కూటమికి చెందిన మైలవరం మండల నాయకులు సోమవారం రాళ్లు, కర్రలతో దాడిచేశారు. బాధితుడు సుబ్బరాయుడు కథనం మేరకు.. ఆయన కొంతకాలం నుంచి జమ్మలమడుగు మండలం పొన్నతోట పంచాయతీలో చేపల చెరువు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఎన్డీఏ కూటమికి చెందిన నిమ్మకాయల చంద్ర, పుల్లారెడ్డి, తిరుపాల్‌రెడ్డి మరికొందరు తనకు ఫోన్లుచేసి తమ ప్రభుత్వం వచ్చిందని, తమకు రూ.20 లక్షలు ఇవ్వకపోతే చేపల చెరువు నిర్వహించుకోలేవని బెదిరించారు. ఈ నేపథ్యంలో సోమవారం సొంత పనుల నిమిత్తం మైదుకూరు వెళ్లిన సుబ్బరాయుడు తిరిగి చేపల కేంద్రానికి వెళుతుండగా నర్సోజీ కొట్టాల వద్దకు చేరుకునేసరికి ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న హోంగార్డ్ వర్మ ఫోన్ చేశాడు. నిమ్మకాయల చంద్ర, పుల్లారెడ్డి, తిరుపాల్‌రెడ్డి మారెమ్మకట్ట వద్ద ఉన్నారని, మాట్లాడదాం.. అంటూ సుబ్బరాయుడిని వర్మ తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లగానే చంద్ర, పుల్లారెడ్డి, తిరుపాల్‌రెడ్డి రాళ్లు, కర్రలతో తనపై దాడిచేశారని సుబ్బరాయుడు తెలిపారు. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రి బయట రోడ్డుపైన వారు తనపై మరోసారి దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో సుబ్బరాయుడు తలకు, ఛాతీపైన గాయాలయ్యాయి. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

పెనుమూరులో టీడీపీ కార్యకర్తల బరితెగింపు

- తప్పతాగి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటిపై దాడి
- రెండు కార్లు ధ్వంసం
- చంపుతామంటూ బెదిరింపు

కార్వేటినగరం: చిత్తూరు జిల్లా పెనుమూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కామసాని విజయకుమార్‌రెడ్డి ఇంటిపై ఆదివారం రాత్రి టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. ఇంటి ఆవరణలోని రెండు కార్లను ధ్వంసం చేశారు. విజయకుమార్‌రెడ్డిని చంపుతామని బెదిరించారు. విజయకుమార్‌రెడ్డి పెనుమూరు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో నివాసం ఉంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రపోతుండగా పెనుమూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు పి.సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు పి.అనంత్‌రెడ్డి, పి.హేమాద్రినాయుడు కుమారుడు పి.ప్రదీప్, కె.బాబు కుమారుడు కె.రాజేష్ ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో మద్యం తాగి ఆ ఇంటిపై దాడిచేశారు. ఇంటి ఆవరణలో ఉన్న కారు అద్దాలు పగులగొట్టి ధ్వంసం చేశారు. వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలున్న కారు నంబరు ప్లేట్లను పెరికి ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న పెనుమూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి కమలాకరరెడ్డి కారు నంబర్ ప్లేటు తీసి పగులగొట్టారు. అనంతరం ఇంట్లో నిద్రపోతున్న విజయకుమార్‌రెడ్డికి ఫోన్‌చేసి బయటకు రమ్మని పిలిచారు. నిద్రలో ఉన్న విజయకుమార్‌రెడ్డి భార్యాపిల్లలతో బయటకు రాగా చంపుతామంటూ బెదిరించారు. భయంతో విజయకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. వీరి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆయన సోమవారం ఉదయం పెనుమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెనుమూరు ఎస్‌ఐ లోకేష్ సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు.


ధ్వంసమైన విజయకుమార్‌రెడ్డి కారు

నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలి

అర్ధరాత్రి ఇంటి పైకి వచ్చి కార్లు ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలను పోలీసులు తక్షణమే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాలని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వారు సోమవారం విజయకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన నారాయణస్వామి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ వర్గీయుల వెలి

- శ్రీశైలం ఎమ్మెల్యే స్వగ్రామం వేల్పనూరులో టీడీపీ అరాచకం
- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను సామాజికంగా వెలి వేయాలని హుకుం
- వారి భూములు ఎవరూ కౌలుకు తీసుకోవద్దని అల్టిమేటం

సాక్షి, నంద్యాల: టీడీపీ కార్యకర్తల అరాచకాలు హద్దు మీరుతున్నాయి. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేసిన నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా రెచ్చిపోతున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి స్వగ్రామం వేల్పనూరులో వైఎస్సార్‌సీపీ వర్గీయులను సామాజికంగా వెలివేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఏజెంట్లుగా వ్యవహరించిన వారిని టీడీపీ నాయకులు లక్ష్యంగా చేసుకుని వారి భూములను ఎవరూ కౌలుకు తీసుకోవడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. వారి పొలాల్లో పనులకు కూడా వెళ్లొద్దని ఆదేశించారు. వర్షాలు పడటంతో పొలాల్లో కౌలు రైతులు ఇప్పటికే దుక్కులు ప్రారంభించారు. ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు పెట్టారు. ఉన్నపళంగా భూముల్ని కౌలుకు తీసుకోవద్దని హుకుం జారీ చేయడంతో దుక్కులు చేసుకున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి తలెత్తింది. కౌలు డబ్బులు వెనక్కి ఇవ్వాలని రైతులను టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు గ్రామంలో అందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండేవారు. టీడీపీ గెలుపుతో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు ప్రజల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవడాన్ని పలువురు ఛీత్కరించుకుంటున్నారు.

విద్యుత్ ఉద్యోగిపై టీడీపీ కార్యకర్తల దాడి

- సబ్ స్టేషన్ వద్ద మద్యం తాగొద్దన్నందుకు దౌర్జన్యం
- సబ్ ఇంజనీర్‌కు గాయాలు
- నెలటూరులో ఘటన


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యుత్ ఉద్యోగి వెంకటేశ్వర్లు

గూడూరు రూరల్ (తిరుపతి జిల్లా): విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా మద్యం తాగవద్దని చెప్పినందుకు.. ఓ సబ్ ఇంజనీర్‌పై కొంతమంది టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన ఘటన గూడూరు రూరల్ పరిధిలోని నెలటూరు సబ్ స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. దాడిలో అతని కుడి కన్నుకు తీవ్రంగా గాయమైంది. అడ్డు వచ్చిన మరో ఉద్యోగి పైనా దాడికి పాల్పడ్డారు. బాధితుల వివరాల మేరకు గూడూరు రూరల్ పరిధిలోని నెలటూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన గోళ్ల వెంకటేశ్వర్లు సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శివప్రసాద్, నారాయణ, శీను సోమవారం సబ్ స్టేషన్ ఎదురుగా కూర్చుని మద్యం తాగుతున్నారు. ఇది గమనించిన వెంకటేశ్వర్లు వారి వద్దకు వెళ్లి ఇక్కడ మద్యం తాగవద్దని, వెళ్లిపోవాలని సూచించారు. దీంతో వారు అతనిపై దాడికి పాల్పడి గాయపరిచారు. ఇది గమనించిన మరో ఉద్యోగి సురేష్ అడ్డు రాగా.. అతనిపై కూడా దాడికి దిగారు. దీంతో గాయాలపాలైన వెంకటేశ్వర్లుకు గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, తరువాత మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. దీనిపై గూడూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయితే వెంకటేశ్వర్లుకు చెందిన మరికొంత మంది తమవారిపై దాడికి పాల్పడ్డారని టీడీపీ కార్యకర్తలు కూడా ఫిర్యాదుచేశారని, రెండు ఫిర్యాదులపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దర్శిలో అర్ధరాత్రి టీడీపీ రౌడీల వీరంగం

- వైఎస్సార్‌సీపీ నేత కుందురు నరసింహారెడ్డి ఇంటిపై దాడి
- 30 మందికి పైగా టీడీపీ రౌడీల దౌర్జన్యం
- బూతులు తిడుతూ కర్రలు, రాడ్లతో విధ్వంసం
- బాధితుని కుటుంబాన్ని పరామర్శించిన బూచేపల్లి

దర్శి: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రకాశం జిల్లా దర్శిలో ప్రజలు భయంతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు వచ్చి పడతారోనని ప్రజలు ఆందోళనతో బతుకుతున్నారు. ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. 30మందికి పైగా నరసరావుపేట నుంచి తెచ్చిన రౌడీలతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకుడు కుందురు నరసింహారెడ్డి ఇంటి విధ్వంసం సృష్టించారు. బాధితుడు నరసింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 11.40 సమయంలో కాలింగ్ బెల్ మోగడంతో ఇంటి తలుపు తీశారు. ఇంటి బయట ఉన్న రౌడీలు నరసింహారెడ్డి నువ్వేనా అంటూ ప్రశ్నించి దర్శిలో మేం ఓడిపోవడానికి కారణం నువ్వేనంటూ దుర్భాషలాడారు. ఈవీఎంలు ఎత్తుకెళుతుంటే అడ్డుకుంటావా అని బూతులు తిట్టారు. కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఇంటి దిమ్మెలను బాది పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ గేటుకు ఉన్న లైట్లు పగులగొట్టి వీరంగం వేశారు. నరసింహారెడ్డి వరండా గేటు తీయకుండా పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. బయట రౌడీలు దాడి చేయడంతో ఇంట్లో ఉన్న నరసింహారెడ్డి భార్య, పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపారు. నీతో పాటు మరో 30 మంది మా టార్గెట్‌లో ఉన్నారని, మీ అందరి అంతు చూస్తామంటూ నరసింహారెడ్డిని బెదిరించారు. ఈ లోగా పోలీస్ వాహనం రావడం, చుట్టుపక్కల వారు అక్కడకు రావడంతో వారంతా పారిపోయారు. ఈ ఘటనతో నియోజకవర్గం ఉలిక్కిపడింది. దర్శిలో ఎప్పుడూ ఇలాంటి సంస్కృతి లేదని, ఇప్పుడు గొట్టిపాటి లక్ష్మి వచ్చి కొత్తగా రౌడీ సంస్కృతిని తెచ్చిందని మండిపడుతున్నారు.


నరసింహారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బూచేపల్లి

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

టీడీపీ శ్రేణుల దాడిపై నరసింహారెడ్డి భార్య కుందురు సునీత స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల ఎన్నికల్లో తన భర్త నరసింహారెడ్డి బూత్ ఏజెంట్‌గా ఉన్న బూత్‌లో ఈవీఎంలు ఎత్తుకెళ్లనీయలేదని, అందుకే తమపై కక్ష కట్టి ఇంటిపైకి వచ్చి దాడి చేసి దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు.

బూచేపల్లి పరామర్శ..

టీడీపీ నాయకుల దాడి విషయం తెలుసుకున్న దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సోమవారం నరసింహారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎవ్వరూ భయపడాల్సిన పని లేదని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద రాకుండా అండగా ఉంటానని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.

బత్తులవారిగూడెంలో టీడీపీ కార్యకర్త హల్‌చల్

- వైఎస్సార్‌సీపీ నాయకుడిని చంపుతానని బెదిరింపు
- ఒకరిపై హత్యాయత్నం, మరొకరిపై దాడి
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని బత్తులవారిగూడేనికి చెందిన టీడీపీ కార్యకర్త సోలా లక్ష్మణరావు పేట్రేగిపోతున్నాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడిని చంపుతానని బెదిరించడమేగాక ఆ పార్టీకి చెందిన కార్యకర్తపై హత్యాయత్నం, మరొకరిపై దాడి చేశాడు. ఈ మేరకు బాధితులైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. లక్ష్మణరావు మూడురోజుల కిందట గ్రామానికి చెందిన మందాడ శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి వైఎస్సార్‌సీపీ నాయకుడు మందాడ వెంకటేశ్వరరావు (స్వామి)ని దుర్భాషలాడటమే కాకుండా పొడిచేస్తానని, చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయం తెలియడంతో స్వామి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్ష్మణరావు వల్ల తనకు ప్రాణహాని ఉందని, తనను చంపేస్తానని బెదిరిస్తుండటంతో తన కుటుంబ సభ్యులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం చేశానని తనపై లక్ష్మణరావు కక్షగట్టాడని పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని పోలీసుల్ని కోరారు. టీడీపీ కార్యకర్త సోలా లక్ష్మణరావు మూడురోజుల కిందట తనను కారుతో గుద్దించి చంపబోయాడని, సోమవారం గ్రామంలోని పాలకేంద్రం వద్ద తనపై దాడిచేసి కులం పేరుతో దూషించాడని గ్రామానికి చెందిన ఊసా విజయరాజు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్ష్మణరావు తనపై దాడిచేసి కొట్టాడని అదే గ్రామానికి చెందిన ఊసా శాంతకుమారి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16న గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బత్తుల మాధవరావు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా తమ ఇంటివద్ద లక్ష్మణరావు బాణసంచా కాల్చాడని శాంతకుమారి తెలిపారు. బాణసంచా మోతకు గేదెలు బెదురుతున్నాయని, కొద్దిగా దూరంగా వెళ్లి కాల్చుకోవాలని తాను చెప్పగా లక్ష్మణరావు తనను జుట్టు పట్టుకుని కొట్టాడని, పక్కనే ఉన్న రాళ్ల గుట్టపైకి తోసేశాడని ఆమె ఫిర్యాదులో తెలిపారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

13 రోజుల్లో మూడుసార్లు

ఆమె ఎవరెస్ట్‌ను జయించింది!



పూర్ణిమా శ్రేష్ఠ

పదమూడు రోజుల్లో మూడుసార్లు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి ప్రపంచంలోనే మొదటి మహిళగా పూర్ణిమా శ్రేష్ఠ గుర్తింపు పొందింది. నేపాల్‌లో వృత్తి రీత్యా ఫొటో జర్నలిస్ట్ అయిన 33 ఏళ్ల పూర్ణిమ, సాటి మహిళలను ప్రోత్సహించడానికి సవాళ్లనే సోపానాలుగా చేసుకుంటున్నాను అంటోంది.

'ప్రపంచంలో ఒకే సీజన్‌లో ఎవరెస్ట్ శిఖరాన్ని మూడుసార్లు అధిరోహించిన మొదటి మహిళగా గుర్తింపు రావడం ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. పర్వతారోహణలో పాల్గొంటున్న మహిళలను ఇప్పటికీ వేళ్లమీద లెక్కించవచ్చు. వారికి ఆసక్తి ఉంటుంది. కానీ, భయంతో వెనకంజ వేస్తుంటారు. ఇప్పుడు చాలామంది యువతులు పర్వతారోహణ గురించి నన్ను కలుస్తుంటారు. వారిలో ప్రభావవంతమైన మార్పును తీసుకు రాగలుగుతున్నందుకు ఆనందంగా ఉంది. రాబోయే రెండేళ్లలో 14 మంది మహిళలను ఎవరెస్ట్ అధిరోహణకు తీసుకెళ్లగలనని నమ్మకం ఉంది.

మూస పద్ధతికి స్వస్తి...

ఎప్పుడూ ఒక విధమైన జీవనంలో మూసపద్ధతిలో కొనసాగడం నాకు ఇష్టం ఉండదు. అలాగని నేనేమీ సంపన్నుల ఇంట్లో పుట్టలేదు. మా అమ్మానాన్నలు నేపాల్‌లోని గోర్ఖా ప్రాంతంలోని మారుమూల గ్రామంలో నివసిస్తున్న రైతులు. నా చిన్నప్పుడు ఇంట్లో ఎప్పుడూ నీటి కొరత ఉండేది. రాగిబిందెతో కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు మోసుకొచ్చేదాన్ని. ఆ కష్టం నాలో సవాళ్లకు మార్గం చూపింది. ఇప్పటివరకు ఎనిమిది శిఖరాలను అధిరోహించాను. నా సవాళ్ల సాధన కోసం నా స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యుల నుండి డబ్బు తీసుకున్నాను. గైడింగ్ కంపెనీ నుండి కొంత లోన్ తీసుకున్నాను. తిరిగి ఈ అప్పు తీర్చడానికి మౌంటనీయర్ గైడ్‌గా చేయాలనుకుంటున్నాను. రికార్డ్ సాధించి, పర్వతారోహణలో మహిళలు పాల్గొనడానికి ఉన్న అడ్డంకులను తొలగించాలన్నది నా లక్ష్యం. చాలామంది అడ్డు చెప్పారు. కానీ, 8,000 కిలోమీటర్ల రికార్డ్‌ను సాధించాను. 'ఒక సాధారణ అమ్మాయి రికార్డ్ బ్రేక్ చేసింది' అనే మాటలు విన్నప్పుడు, ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉన్నాను.

అలసట కలిగినా..

ఈ వసంత కాలంలో ఎవరెస్ట్ శిఖరాన్ని రెండుసార్లు సులువుగానే అధిరోహించాను. తర్వాత మూడవసారి కొంచెం అలసటతో కిందటి నెల 25వ తేదీని అధిరోహణ ప్రారంభమైంది. నా గైడ్, నేను ఈ అధిరోహణకు బయల్దేరాం. అలసటతో నా అడుగులు భారంగా అనిపించాయి. శిఖ



రాగ్రానికి చేరుకోవడానికి మధ్యలోనే అలసటతో కొంతసేపు నిద్రలోకి జారుకున్నాను. నిద్రలేపడానికి గైడ్ నా ముఖంపైకి మంచుగడ్డలను విసరాల్సి వచ్చింది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో త్వరగానే తేరుకున్నాను. ఒక్కో అడుగు వేయడంపై దృష్టి పెట్టి మధ్యాహ్నం ఒంటి గంటకు శిఖరాగ్రానికి చేరుకుని రికార్డ్ సృష్టించాను. దాదాపు ఒక గంటపాటు పై భాగంలోనే ఉన్నాం. నేను చాలా ఉద్వేగానికి లోనయ్యాను.

కలల సాధనకు కృషి

స్కూల్ చదువు పూర్తయ్యాక ఫొటో జర్నలిజం చేశాను. 2017లో ఎవరెస్ట్ మారథాన్ కవర్ చేసే ఫొటోగ్రఫీ అసైన్‌మెంట్ సమయంలో పర్వతారోహణ ప్రపంచానికి పరిచయం అయ్యాను. పర్వతాలను కలుసుకోవడానికి అంత సమయం పట్టిందే అని చాలా బాధపడ్డాను. శిఖరపు అంచున నిలబడి, అక్కడినుంచి ప్రపంచాన్ని చూడటంలోని కష్టాన్ని అర్థం చేసుకోవాలనుకున్నాను. చాలా మంది స్త్రీలు ఇంటిపని కోసం మాత్రమే పుట్టారని అనుకుంటారు. గ్రామాల్లో చాలామంది అమ్మాయిలు మధ్యలోనే చదువు మానేస్తుంటారు. పెళ్ళే జీవనసాఫల్యంగా ఉంటారు. ఆ తర్వాత వెంటనే మాతృత్వం. ఇంటిపనులతో జీవితం. ఇలా ఉండకూడదు నా జీవనం అనుకున్నాను. 2018లో నా పర్వతారోహణ ప్రక్రియను ప్రారంభించాను. 2022లో కాంచన్ జంగా, లోత్సే, మకాలును అధిరోహించాను. అదే నెలలో అతి తక్కువ రోజుల్లో మూడుసార్లు ఎవరెస్ట్‌ను అధిరోహించగలననే నమ్మకం కలిగింది. ఎవరెస్ట్ పైనుంచి కొత్తగా లేదా గొప్ప పనిచేస్తే ప్రజలు ముఖ్యంగా మహిళల్లో మార్పు వస్తుంది అనుకున్నాను. వాళ్లు కూడా తమ పట్ల శ్రద్ధ వహిస్తారని నా నమ్మకం. ప్రజలలో మహిళల పట్ల ఉన్న అభిప్రాయాన్ని మార్చడమే నా ఉద్దేశ్యం. తమ సామర్థ్యాలను విశ్వసించ లేనివారు కలలను సాకారం చేసుకోలేరు.. మనం ఏం సాధించాలని అనుకుంటున్నామో దానిని మనలోనే అన్వేషించాలి. అప్పుడు మనలోని అంకిత భావం, ధైర్యంతో ముందడుగు వేస్తే ఆ ఆశయమే అత్యున్నత శిఖరాలను చేర్చుతుంది'' అని వివరించే పూర్ణిమ మాటలు యువతకు స్ఫూర్తిని కలిగిస్తాయి.

బీ గుడ్ డూ గుడ్



ఖుష్బూ గాంధీ



మనదేశంలో ఏడాదికి 9,400 టన్నుల ప్లాస్టిక్ వేస్ట్ కాలువలు, నదుల్లోకి చేరుతోంది. ఇందులో ఎక్కువ భాగం ప్యాకింగ్‌కు ఉపయోగించినదే ఉంటోంది. ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నాం. ఓ చిన్న హెయిర్ ఆయిల్ బాటిల్‌ని ప్యాక్ చేయడానికి దానికంటే నాలుగురెట్లు బరువున్న ప్యాకింగ్ మెటీరియల్‌ని ఉపయోగిస్తారు. అందులో కాగితంతో చేసిన అట్టపెట్టె ఉంటుంది. బాటిల్ పగలకుండా ప్లాస్టిక్ బబుల్ రేపర్ ఉంటుంది. కాగితం ఇట్టే మట్టిలో కలిసిపోతుంది. దాంతో ఇబ్బంది ఉండదు. మరి ప్లాస్టిక్ బబుల్ ర్యాపర్ ఎన్నేళ్లకు మట్టిలో కలుస్తుంది. 'వస్తువులు రవాణాలో పగలకుండా ఉండాలంటే బబుల్ ర్యాపర్ ప్లాస్టిక్‌తోనే చేయాలా? కొబ్బరిపీచుతో బబుల్ ర్యాప్ చేసాను చూడండి' అంటూ కుషన్‌ను పోలిన కాయిర్ పౌచ్‌ను చూపించింది ఖుష్బూ గాంధీ. అలాగే కాయిర్ బోర్డ్‌లో ఒక పొరలోకి గాలిని చొప్పించి బుడగలు తెప్పించింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఖుష్బూ గాంధీ నిఫ్ట్‌లో మెటీరియల్ డెవలప్‌మెంట్ కోర్సు చేసింది.'గో డూ గుడ్' స్టార్టప్ ద్వారా ఎకో ఫ్రెండ్లీ ప్యాకింగ్ మెటీరియల్‌ని తయారు చేస్తోంది. ప్లాస్టిక్‌కి వ్యతిరేకంగా తనదైన శైలిలో ఉద్యమిస్తోన్న ఖుష్బూ... 'ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి' అని మైకులో గొంతుచించుకుంటే సరిపోదు, ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయం చూపిస్తే ఆటోమేటిగ్గా ప్లాస్టిక్‌ని దూరం పెట్టేస్తారు' అంటోంది. ఇంకా...'నా ప్రయోగాలు నాకు లాభాలను తెచ్చిపెడతాయో లేదో తెలియదు, కానీ సస్టెయినబుల్ లైఫ్ స్టయిల్ వైపు సమాజాన్ని నడిపించడంలో మాత్రం విజయవంతం అవుతాను' అంటోంది ఖుష్బూ గాంధీ.

ఎకో ఫ్రెండ్లీ సిరా!

''ప్లాస్టిక్ బబుల్ ర్యాపరే కాదు, పేపర్ మీద ప్రింటింగ్ కోసం ఉపయోగించే ఇంక్ కూడా అంత త్వరగా నేలలో ఇంకదు. పైగా మట్టిని కలుషితం చేస్తుంది. సీ వీడ్ (సముద్ర నాచు), నాచురల్ కలర్ పిగ్మెంట్స్‌తో ఇంకు తయారు చేశాం. ఒకసారి ఉపయోగించి పారేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్‌కు బదులు వ్యవసాయ వ్యర్థాలతో ప్లేట్లు తయారు చేస్తున్నాం. ఇక్కడ మరో విషయం చెప్పాలి. ఒకసారి వాడిపారేసే పేపర్ ప్లేట్‌లు, గ్లాసులకు ల్యామినేషన్‌తో కోటింగ్ వేస్తుంటారు. నేను దానికి కూడా ప్రత్యామ్నాయం కనుక్కున్నాను. ఎకో ఫ్రెండ్లీ కోటింగ్ చేస్తున్నాం. 'గో డూ గుడ్' ద్వారా మేము పది టన్నుల ప్లాస్టిక్ వాడకాన్ని నివారించగలిగాం. అలాగే ఎకో ఫ్రెండ్లీ ఇంక్‌తో ఒకటిన్నర లక్షల ఉత్పత్తులు అక్షరాలద్దుకున్నాయి. ఏడు టన్నుల బయో డీగ్రేడబుల్ బబుల్ ర్యాపర్‌లను వాడుకలోకి తెచ్చాం. ఈ ప్రయత్నంలో ఐదు టన్నుల వ్యవసాయ వ్యర్థాలు వినియోగంలోకి వచ్చాయి.









లధాక్‌లో ప్లాస్టిక్ వేస్ట్!

నేను ఈ రంగంలోకి అడుగు పెట్టడానికి కారణం పదేళ్ల కిందటి లధాక్ పర్యటన. మారుమూల ప్రదేశాలు ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి ఉన్నాయి. షాంపూ సాషే నుంచి లేస్ ర్యాపర్ వరకు అవీ ఇవీ అనే తేడా లేకుండా ప్రతి పదార్థమూ ప్లాస్టిక్‌లోనే ప్యాక్ అవుతోందని నాకు తెలిసిందప్పుడే. ఆ చెత్త కాలువల్లోకి చేరకుండా అంతటినీ ఒకచోట పోగు చేసి తగలబెడుతున్నారు. వాళ్లకు చేతనైన పరిష్కారం అది. ఇంత కంటే పెద్ద పరిష్కారమార్గాన్ని కనుక్కోవాలని అప్పుడు అనిపించింది. ఆ తర్వాత నేను మెటీరియల్ డెవలప్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం స్పెయిన్‌కెళ్లాను. కోర్సు పూర్తయ్యేలోపు నా ఆలోచనకు ఒక స్పష్టమైన రూపం వచ్చింది. బయోడీగ్రేడబుల్ వస్తువులతో ప్లాస్టిక్‌కి సమాధానం చెప్పవచ్చనే ధైర్యం వచ్చింది. పీజీ పూర్తయి తిరిగి ఇండియాకి రాగానే మా తమ్ముడు, మా వారితో కలిసి పూణేలో నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'గో డూ గుడ్'కు శ్రీకారం చుట్టాను. ఇది విజయవంతంగా నడుస్తోంది'' అని వివరించిందామె. ఖుష్బూ పేరుకు తగినట్లు పరిమళభరితంగా తన విజయ ప్రస్థానాన్ని రాసుకుంటోంది. మరి... మనం మన చరిత్రను ఏ సిరాతో రాసుకుందాం... మట్టిని కలుషితం చేసే ఇంకుతోనా లేక మట్టిలో కలిసిపోయే ఇంకుతోనా. మనమే నిర్ణయించుకోవాలి.

కాబి ఉచిత డిజిటల్ టూల్స్

అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 'సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్' (సిఎబిఐ – కాబి) రైతులకు అవసరమైన ప్రామాణికమైన శాస్త్రీయ సమాచారాన్ని తన వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా తెలుగులో కూడా అందుబాటులోకి తెచ్చింది. గత 110 సంవత్సరాల నుంచి పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై పరిశోధనలు చేస్తున్న 'కాబి'తో 48 దేశాలకు చెందిన వ్యవసాయ సంస్థలు కలసి పనిచేస్తున్నాయి. మన ఐసిఎఆర్ కూడా ఇందులో మెంబరే. ఈ నేపథ్యంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం తోడ్పాటుతో 'ప్లాంట్ వైస్ ప్లస్ టూల్ కిట్' పేరుతో డిజిటల్ టూల్స్‌ని 'కాబి' ఇటీవల తెలుగు, హిందీల్లోనూ అందుబాటులోకి తెచ్చింది. రైతులకు, విస్తరణ అధికారులకు, డీలర్లకు, విద్యార్థులకు, పరిశోధకులకు ఇవి ఉపయోగకరం.



వెబ్‌సైట్, అనేక యాప్‌ల ద్వారా రైతులకు శాస్త్రీయంగా సరైన సలహాలు పొందొచ్చు. ఇందులో నాలెడ్జ్ బ్యాంక్ పోస్టర్లు, కరపత్రాలు, రైతుల కోసం ఫ్యాక్ట్‌షీట్‌లు, వీడియో ఫ్యాక్ట్‌షీట్లు అందుబాటులో ఉన్నాయి. పంట ఆరోగ్యంపై సమాచారం తెలుసుకోవటం, పురుగుమందుల మోతాదులను లెక్కించటం, ఎరువుల అవసరాలను నిర్ణయించటం, పంట సమస్యను గుర్తించటం, చీడపీడల నియంత్రణకు పురుగుమందులను కనుగొనటం, పురుగులను– తెగుళ్లను గుర్తించే నైపుణ్యాలను మెరుగుపరచుకోవటం, చీడపీడల నియంత్రణ పద్ధతులను సిఫారసు చేయటం, తెగుళ్ల నిర్వహణపై శిక్షణ.. తదితర సమాచారం / నైపుణ్యాలను కాబి వెబ్‌సైట్, డిజిటల్ టూల్స్ అందిస్తాయి. ఇవన్నీ తెలుగులో ఉచితంగా అందుబాటులో ఉండటం వల్ల మహిళా రైతులు కూడా సులువుగా వాడుకునేందుకు వీలవుతుంది. ఈ వనరులను ఉపయోగించుకోవడానికి మనకు ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ లేదా టాబ్లెట్ లేదా కంప్యూటర్ /ల్యాప్‌టాప్‌తో ఇంటర్నెట్ సదుపాయం ఉంటే చాలు.

మొక్కల ఆరోగ్య సమాచారం విభాగంలో.. మన దేశానికి సంబంధించిన పంటల ఆరోగ్యం, తెగుళ్ల నిర్వహణపై సమాచారం ఉచితంగా అందుబాటులో ఉంటుంది. 'ప్లాంట్‌వైజ్ ఫ్యాక్ట్‌షీట్ లైబ్రరీ' అనే ఉచిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తెగుళ్ల నిర్ధారణ, సురక్షిత నిర్వహణకు ఉపయోగపడే తాజా సమాచారం తెలుసుకోవచ్చు. మొక్కల రక్షణ మద్దతు విభాగంలో.. 'క్రాప్ స్ప్రేయర్ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సురక్షితమైన పురుగుమందులు, వాటి మోతాదును లెక్కించడానికి సహాయపడుతుంది. 'కాబి బయోప్రొటెక్షన్ పోర్టల్' అనే ఉచిత వెబ్‌సైట్ పంట తెగుళ్లను నయం చేయటానికి స్థానికంగా నమోదైన బయో పెస్టిసైడ్స్‌ను కనుగొనటంలో, ఉపయోగించటంలో సహాయపడుతుంది. రైతులకు లోతైన అవగాహన కలిగించడం కోసం డిజిటల్ లెర్నింగ్ కోర్సులు కూడా ఉన్నాయి. పంట తెగులు నిర్ధారణ కోర్సు, పంటల చీడపీడల యాజమాన్య కోర్సు, బయోప్రొటెక్షన్ ప్రొడక్ట్స్ కోర్సు అందుబాటులో ఉంది.

● కాబి బయోప్రొటెక్షన్ పోర్టల్ యాప్ కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

● కాబి క్రాప్ స్ప్రేయర్ యాప్ కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

26న 'బయోచార్ కార్బన్ క్రెడిట్స్'పై సదస్సు

బయోచార్ (కట్టె బొగ్గు)ను పంట వ్యర్థాలు, తదితర బయోమాస్‌తో భారీ ఎత్తున యంత్రాలతో ఉత్పత్తి చేస్తూ 'కార్బన్ క్రెడిట్స్' పొందుతున్న వాణిజ్య సంస్థల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటువంటి సంస్థలకు మార్గదర్శకత్వం నెరిపేందుకు హైదరాబాద్ కేంద్రంగా 'ప్రొగ్రెసివ్ బయోచార్ సొసైటీ' ఇటీవల ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో 'బయోచార్ ఉత్పత్తి పరికరాలు–కార్బన్ క్రెడిట్స్' అనే అంశంపై జూన్ 26న ఉ. 9.30 గం. నుంచి హైదరాబాద్ యూసఫ్‌గూడలోని నిమ్స్‌మే ఆడిటోరియంలో జాతీయ సదస్సు జరగనుంది. 'మేనేజ్' డైరెక్టర్ జనరల్ డా. పి. చంద్రశేఖర ముఖ్య అతిథి. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 63051 71362.

సాగుబడి

ఆరుద్ర కార్తె : జూన్ 22 నుంచి

వరి విత్తనాలు వేసే డ్రోన్ వచ్చేసింది!



● పొలంలో వరి విత్తనాలు వేస్తున్న డ్రోన్

- వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై పిజెటిఎస్‌ఎయు, నాబార్డ్ తోడ్పాటుతో మారుత్ డ్రోన్స్ పరిశోధనలు
- వరి రైతులకు పంట అన్ని దశల్లోనూ డ్రోన్ల తోడ్పాటు
- ఒకే డ్రోన్‌తోనే ఎరువులు, విత్తనాలు, ఆ తర్వాత పురుగుమందులు కూడా చల్లుకోవచ్చు..
- ఇప్పటికే 700 మంది రైతులు, డ్వాక్రా మహిళలకు డ్రోన్ పైలట్ శిక్షణ

డ్రోన్లతో వరి సహా అనేక పంటలపై పురుగుమందులు, ఎరువులు చల్లటం ద్వారా కూలీల ఖర్చును, సమయాన్ని రైతులు ఆదా చేసుకుంటూ ఉండటం మనకు తెలుసు. వరి విత్తనాలను వెద పెట్టడానికి ఉపయోగపడే డ్రోన్ కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సంస్థ మారుత్ డ్రోన్స్ ఇతర రంగాల్లో డ్రోన్ల వినియోగంతో పాటు వ్యవసాయంలో డ్రోన్ సేవలపైనా విశేషమైన ప్రగతి సాధించింది. తాజాగా వరి విత్తనాలు వేసే డ్రోన్‌ను రూపొందించింది. పేటెంట్ హక్కులు కూడా పొందింది. పిజెటిఎస్‌ఎయు, నాబార్డ్ తోడ్పాటుతో క్షేత్ర స్థాయి ప్రయోగాలను పూర్తి చేసుకొని వెద పద్ధతిలో వరి విత్తనాలను వరుసల్లో విత్తే డ్రోన్లను ఇఫ్కో తోడ్పాటుతో రైతులకు అందుబాటులోకి తెస్తోంది. డిజిసిఎ ధృవీకరణ పొందిన ఈ డ్రోన్ల కొనుగోలుకు బ్యాంకు రుణాలతో పాటు సబ్సిడీ ఉండటం విశేషం.

గాలిలో ఎగిరే చిన్న యంత్రం డ్రోన్. అన్‌మాన్డ్ ఏరియల్ వెహికల్. అంటే, మనిషి పొలంలోకి దిగకుండా గట్టుమీదే ఉండి వ్యవసాయ పనులను సమర్థవంతంగా చేసుకోవడానికి ఉపయోగపడే అధునాతన యంత్రం.

ఇప్పుడు వ్యవసాయంలోని అనేక పంటల సాగులో, ముఖ్యంగా వరి సాగులో, కీలకమైన అనేక పనులకు డ్రోన్ ఉపయోగపడుతోంది. రైతులకు ఖర్చులు తగ్గించటం, కూలీల అవసరాన్ని తగ్గించటం వంటి పనుల ద్వారా ఉత్పాదకతను, నికరాదాయాన్ని పెంపొందించేందుకు డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. దోమల నిర్మూలన, ఔషధాల రవాణా వంటి అనేక ఇతర రంగాలతో పాటు వ్యవసాయంలో ఉపయోగపడే ప్రత్యేక డ్రోన్లను అభివృద్ధి చేయటంలో మారుత్ డ్రోన్స్ విశేష కృషి చేస్తోంది. ప్రేమ్ కుమార్ విస్లావత్, సాయి కుమార్ చింతల, ఐఐటి గౌహతి పూర్వవిద్యార్థి సూరజ్ పెద్ది అనే ముగ్గురు తెలుగు యువకులు 2019లో మారుత్ డ్రోన్స్ స్టార్టప్‌ను ప్రారంభించారు. డేటా ఎనలిటిక్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతలతో వ్యవసాయ డ్రోన్లను రూపొందించటంపై ఈ కంపెనీ దృష్టి సారించింది.

ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు), అగ్రిహబ్, నాబార్డ్ తోడ్పాటుతో రైతుల కోసం ప్రత్యేక డ్రోన్లను రూపకల్పన చేస్తోంది. నల్గొండ జిల్లా కంపసాగర్‌లోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో 50 ఎకరాల్లో శాస్త్రవేత్తల పర్యవేక్షణలో గత రెండున్నరేళ్లుగా మారుత్ డ్రోన్లను ప్రయోగాత్మకంగా పరీక్షించింది. స్థానిక రైతులు పండించే పంటలకు అనువైన రీతిలో ఉండేలా ఈ డ్రోన్లను అభివృద్ధి చేశారు. వరి పంటపై డ్రోన్ల ద్వారా పురుగుమందులు చల్లటానికి సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొటోకాల్స్(ఎస్.ఓ.పి.ల)ను గతంలోనే ఖరారు చేశారు. ప్రస్తుతం వెద వరి పద్ధతిలో ఆరుతడి పంటగా వరి విత్తనాలను నేరుగా బురద పదును నేలలో విత్తుకోవడానికి ఉపయోగపడేలా డ్రోన్‌ను రూపొందించారు. ఇప్పటికే నాలుగైదు డ్రోన్ ప్రొటోటైప్‌ల ద్వారా వరి విత్తనాలను వరుసల్లో వెద పెట్టడానికి సంబంధించిన ప్రయోగాలు తుది దశకు చేరుకున్నాయి. ఒకటి, రెండు నెలల్లో దీనికి సంబంధించిన ఎస్.ఓ.పి.లు పూర్తవుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



● వరి పంటపై పురుగుల మందు పిచికారీ

డ్రోన్ విత్తనాలు వెద పెట్టేది ఇలా..

వరి నారు పోసి, నాట్లు వేసే సంప్రదాయ పద్ధతితో పోల్చితే విత్తనాలు వెదజల్లే పద్ధతి అనేక విధాలుగా మెరుగైన ఫలితాలను ఇస్తున్న విషయం తెలిసిందే. వెద వరిలో అనేక పద్ధతులు ఉన్నాయి. పొలాన్ని దుక్కి చేసిన తర్వాత పొడి దుక్కిలోనే ట్రాక్టర్ సహాయంతో సీడ్ డ్రిల్‌తో విత్తనాలు వేసుకోవటం ఒక పద్ధతి. బురద పదును నేలలో ఎక్కువ నీరు లేకుండా డ్రమ్ సీడర్‌ను లాగుతూ మండ కట్టిన వరి విత్తనాలను చేనంతా వేసుకోవటం రెండో పద్ధతి. ఈ రెండు పద్ధతుల కన్నా.. బురద పదును నేలలో డ్రోన్ ద్వారా వరి విత్తనాలను జారవిడవటం మరింత మేలైన పద్ధతి. తక్కువ శ్రమ, తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో పని పూర్తవుతుందని మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకులు చెబుతున్నారు.

డ్రోన్ల సేద్యానిదే భవిష్యత్తు!



తక్కువ నీరు ఖర్చయ్యే వెద పద్ధతిలోనే భవిష్యత్తులో వరి సాగు ఎక్కువగా చేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. వెద వరిలో విత్తనాలు వేయటం, ఎరువులు చల్లటం, చీడపీడలను ముందుగానే గుర్తించటం, పురుగుమందులు చల్లటం వంటి అనేక పనులకు డ్రోన్లు ఉపయోగపడతాయి. డ్రోన్ ధర రూ. పది లక్షలు. ఒక్క డ్రోన్‌తోనే పంట వివిధ దశల్లో ఈ పనులన్నీ చేసుకోవచ్చు. డిజిసిఎ ధృవీకరణ ఉండటం వల్ల డ్రోన్ కొనుగోలుకు వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద 6% వడ్డీకే అనేక పథకాల కింద బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. రైతుకు 50% సబ్సిడీ వస్తుంది. ఎఫ్‌పిఓ లేదా కస్టమ్ హైరింగ్ సెంటర్లకైతే 75% వరకు సబ్సిడీ వస్తుంది. పది డ్రోన్లు కొని అద్దె సేవలందించే వ్యాపారవేత్తలకైతే రూ. 2 కోట్ల వరకు రుణం కూడా దొరుకుతోంది. గ్రామీణ యువతకు డ్రోన్ సేవలు ఏడాది పొడవునా మంచి ఉపాధి మార్గం చూపనున్నాయి.

– ప్రేమ్ కుమార్ విస్లావత్, వ్యవస్థాపకుడు, సీఈఓ, మారుత్ డ్రోన్స్

https://marutdrones.com

ఎకరంలో వరి విత్తటానికి 20 నిమిషాలు..

ఈ విధానంలో వరి నారుకు బదులు దమ్ము చేసిన పొలంలో డ్రోన్ సాయంతో వరి విత్తనాలను క్రమ పద్ధతిలో జారవిడుస్తారు. ఇందుకోసం ఆ డ్రోన్‌కు ప్రత్యేకంగా రూపొందించిన పైప్‌లాంటి సీడ్ డిస్పెన్సింగ్ డివైస్‌ను అమర్చుతారు. ఆ డివైస్‌కు డ్రోన్‌కు నడుమ వరి విత్తనాలు నిల్వ వుండేలా బాక్స్‌ను ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా 5 వరుసల్లో వరి విత్తనాలు బురద పదునుగా దమ్ము చేసిన పొలంలో విత్తుతారు. వరి మొక్కల మధ్య 10 సెం.మీ.లు, వరుసల మధ్య 15 సెం.మీ.ల దూరంలో విత్తుతారు. సాధారణంగా నాట్లు వేసే పద్ధతిలో ఎకరానికి 20–25 కిలో విత్తనం అవసరమైతే ఈ పద్ధతిలో 8–12 కిలోల విత్తనం సరిపోతుంది. సన్న రకాలైతే 10–11 కిలోల విత్తనం చాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 20 నిమిషాలకు ఒక ఎకరం చొప్పున రోజుకు ఒక డ్రోన్ ద్వారా 20 ఎకరాల్లో విత్తనాలు వెదపెట్టవచ్చు. సాళ్లు వంకర్లు లేకుండా ఉండటం వల్ల కలుపు నివారణ సులువు అవుతుందని, గాలి బాగా సోకటం వల్ల చీడపీడల ఉధృతి కూడా తగ్గుతుందని చెబుతున్నారు. వెదపద్ధతి వల్ల తక్కువ నీటితోనే వరి సాగు చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

హెక్టారుకు రూ.5 వేలు ఆదా

వెద వరి (డైరెక్ట్ సీడెండ్ రైస్– డిఎస్ఆర్) సాగు పద్ధతిలో డ్రోన్లను వాడటం ద్వారా కూలీల బాధ లేకుండా చప్పున పని పూర్తవ్వటమే కాకుండా సాగు ఖర్చు సీజన్‌కు హెక్టారుకు రూ. 5 వేలు తగ్గుతుందని మారుత్ డ్రోన్స్ సీఈవో ప్రేమ్ కుమార్ విస్లావత్ అంచనా. డ్రోన్ సాయంతో సకాలంలో పురుగుమందులు సకాలంలో చల్లటం వల్ల చీడపీడల నియంత్రణ జరిగి హెక్టారుకు 880 కిలోల ధాన్యం అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతుకు హెక్టారుకు రూ.21,720 ఆదనపు ఆదాయం వస్తుందని ఆయన చెబుతున్నారు.

700 మందికి డ్రోన్ పైలట్ శిక్షణ

మారుత్ డ్రోన్స్ పిజెటిఎస్ఎయుతో కలసి ఏర్పాటు చేసిన అకాడమీ ద్వారా డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇస్తోంది. రైతులు, స్వయం సహాయక బృందాల మహిళలకు, ఎఫ్‌పిఓ సభ్యులకు, వ్యవసాయ పట్టభద్రులకు, పదో తరగతి పాసైన యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులు. ఈ అకాడమీ ద్వారా ఇప్పటికే 700 మంది శిక్షణ పొందారు. అందులో 150 మంది స్వయం సహాయక బృందాల మహిళలు కూడా ఉన్నారు. డిజిసిఎ ఆమోదం వున్న ఈ వారం రోజుల శిక్షణ పొందిన వారికి పదేళ్ల పైలట్ లైసెన్స్ వస్తుంది.

వ్యవసాయ సీజన్‌లో డ్రోన్ పైలట్‌కు కనీసం రూ. 60–70 వేల ఆదాయం వస్తుందని ప్రేమ్ వివరించారు. ఈ డ్రోన్ పైలట్ శిక్షణ పొందిన వారు వ్యవసాయంతో పాటు మరో 9 రంగాల్లో డ్రోన్లను వినియోగించవచ్చు. ఏడాది పొడవునా ఉపాధి పొందడానికి అవకాశం ఉంది.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



ఇంగ్లండ్‌ను గెలిపించిన జూడ్ బెలింగమ్

'యూరో' కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇంగ్లండ్ జట్టు శుభారంభం చేసింది. జర్మనీలోని గెల్‌సెన్‌కిర్చెన్ పట్టణంలో సోమవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఇంగ్లండ్ 1–0 గోల్ తేడాతో సెర్బియాపై నెగ్గింది. ఆట 13వ నిమిషంలో జూడ్ బెలింగమ్ ఇంగ్లండ్‌కు గోల్ అందించాడు. మరోవైపు రొమేనియా జట్టు 24 ఏళ్ల తర్వాత 'యూరో' టోర్నీలో తొలి విజయం అందుకుంది. మ్యూనిక్‌లో జరిగిన గ్రూప్ 'ఇ' మ్యాచ్‌లో రొమేనియా 3–0తో ఉక్రెయిన్‌పై గెలిచింది. ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన గ్రూప్ 'ఇ' మరో మ్యాచ్‌లో స్లొవేకియా 1–0తో ప్రపంచ మూడో ర్యాంకర్ బెల్జియంను బోల్తా కొట్టించింది.

హెప్టాథ్లాన్‌లో శ్రీతేజకు కాంస్య పతకం



జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి థోలెం శ్రీతేజ కాంస్య పతకం సాధించింది. ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం ముగిసిన ఈ టోర్నీలో శ్రీతేజ ఏడు క్రీడాంశాల (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, 1000 మీటర్లు) సమాహారమైన హెప్టాథ్లాన్‌లో మూడో స్థానంలో నిలిచింది. శ్రీతేజ ఓవరాల్‌గా 4136 పాయింట్లు సాధించింది. రినీ ఖాతూన్ (పశ్చిమ బెంగాల్; 4357 పాయింట్లు) స్వర్ణ పతకం సొంతం చేసుకుంది.

రన్నరప్ సుమిత్ నగాల్

కెరీర్ బెస్ట్ 71వ ర్యాంక్‌కు భారత ప్లేయర్



న్యూఢిల్లీ: పెరూగియా ఓపెన్ ఏటీపీ–125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ రన్నరప్‌గా నిలిచాడు. ఇటలీలో జరిగిన ఈ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 77వ ర్యాంకర్ సుమిత్ 1–6, 2–6తో ప్రపంచ 41వ ర్యాంకర్ లూసియానో దర్దెరి (ఇటలీ) చేతిలో ఓడిపోయాడు. 62 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయాడు. సుమిత్‌కు 11,955 యూరోల (రూ. 10 లక్షల 67 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 64 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తాజా ఫలితం సుమిత్ ర్యాంక్‌ను మరింత మెరుగుపర్చింది. గతవారం 77వ ర్యాంక్‌లో ఉన్న సుమిత్ ఈ ప్రదర్శనతో ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 71వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

స్నేహిత్‌కు కాంస్యం



సాక్షి, హైదరాబాద్: బ్రిక్స్ గేమ్స్‌లో భారత టేబుల్ టెన్నిస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ కాంస్య పతకాన్ని సాధించాడు. రష్యాలోని కజాన్ పట్టణంలో జరుగుతున్న ఈ క్రీడల్లో స్నేహిత్ పురుషుల సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్లో ఓడిపోయాడు. కిరిల్ స్కచ్‌కోవ్ (రష్యా)తో జరిగిన సెమీఫైనల్లో స్నేహిత్ 9–11, 8–11, 6–11తో ఓటమి చవిచూశాడు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

క్రికెట్ కూనలే కదా అని తక్కువ అంచనా వేస్తే.. మొదటికే మోసం వస్తుందని... తదుపరి దశకు అర్హత పొందే అవకాశాలు గల్లంతవుతాయని తాజా టి20 ప్రపంచకప్ నిరూపించింది. అసలు ఊహించుకోవడానికే విడ్డూరంగా కొన్ని అనూహ్య ఫలితాలు వచ్చాయి. మాజీ చాంపియన్లు, రన్నరప్‌లు ఇలా గట్టి జట్లకు పెద్ద షాక్‌లే తగిలాయి. తొలి ప్రపంచకప్ ఆడుతున్న అమెరికా గ్రూప్ 'ఎ'లో పాక్‌ను వెనక్కినెట్టి ఏకంగా సూపర్–8లోకి ప్రవేశించడం అద్భుతం! అద్భుతం కాకపోయినా... బంగ్లాదేశ్ గ్రూప్ 'డి' నుంచి శ్రీలంకను తోసి ముందడుగు వేసింది.

- టి20 ప్రపంచకప్‌లో 'సూపర్–8' దశకు అర్హత
- చివరి లీగ్ మ్యాచ్‌లో నేపాల్‌పై 21 పరుగులతో గెలుపు
- 7 పరుగులిచ్చి 4 వికెట్లు తీసిన బంగ్లాదేశ్ బౌలర్ తంజిమ్



కింగ్స్‌టౌన్: ఇదివరకే భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, అఫ్గానిస్తాన్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఇప్పటికే తదుపరి 'సూపర్–8' దశకు చేరుకున్నాయి. మిగిలిన ఏకైక బెర్త్‌ను గ్రూప్ 'డి' నుంచి బంగ్లాదేశ్‌కు ఖరారైంది. ఇతర సమీకరణాలతో దక్కే బెర్త్ కాకుండా గెలిచి సగర్వంగా సాధించాలని బంగ్లాదేశ్ కూన నేపాల్‌పై పెద్ద పోరాటమే చేసింది. సోమవారం ఉదయం జరిగిన లీగ్ మ్యాచ్‌లో సీమర్లు తంజిమ్ హసన్ సకిబ్ (4–2–7–4), ముస్తఫిజుర్ రెహ్మాన్ (4–1–7–3) నిప్పులు చెరిగే బౌలింగ్ స్పెల్‌తో బంగ్లాదేశ్ 21 పరుగుల తేడాతో నేపాల్‌పై గెలిచింది. టాస్ నెగ్గిన నేపాల్ ఫీల్డింగ్‌కు మొగ్గుచూపడంతో మొదట బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. షకీబుల్ హసన్ (22 బంతుల్లో 17; 2 ఫోర్లు) చేసిందే ఇన్నింగ్స్ టాప్ స్కోరు! మహ్ముదుల్లా (13), రిషద్ (13), జాకీర్ అలీ (12), టస్కిన్ అహ్మద్ (12), లిటన్ దాస్ (10) రెండంకెల స్కోరు చేశారు. పెద్దగా అనుభవం లేని నేపాల్ బౌలర్లు సోంపాల్ కామి, దీపేంద్ర సింగ్, రోహిత్ పౌడెల్, సందీప్ లమిచానె తలా 2 వికెట్లతో బంగ్లాకు ముచ్చెమటలు పట్టించారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన నేపాల్ 19.2 ఓవర్లలో 85 పరుగులకు కుప్పకూలింది. టాప్–5 బ్యాటర్లు కుశాల్ (4), ఆసిఫ్ (14 బంతుల్లో 17; 4 ఫోర్లు), అనిల్ (0), కెప్టెన్ రోహిత్ పౌడెల్ (1), సందీప్ జొరా (1) బంగ్లా పేస్‌కు దాసోహమయ్యారు. 26/5 స్కోరు వద్ద... ఇంకేముందిలే బంగ్లా గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ కుశాల్ మల్లా (40 బంతుల్లో 27; 1 ఫోర్, 1 సిక్స్), దీపేంద్ర సింగ్ (31 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్) పోరాడటంతో నేపాల్ స్కోరు 78/5 వరకూ వెళ్లింది. ఆ స్కోరు వద్దే కుశాల్‌ను ముస్తఫిజుర్‌ను అవుట్ చేయడంతో మరో 7 పరుగుల వ్యవధిలోనే నేపాల్ ఆలౌటైంది. స్పిన్నర్ షకీబుల్ హసన్ 2 వికెట్లు తీయగా, టస్కిన్ అహ్మద్‌కు ఒక వికెట్ దక్కింది. తంజిమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ X అఫ్గానిస్తాన్

వేదిక: గ్రాస్‌ఐలెట్; ఉదయం గం. 6 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

రేపటి నుంచి 'సూపర్–8' పోరు

టి20 ప్రపంచకప్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు నేటితో ముగియనున్నాయి. రేపటి నుంచి 'సూపర్–8' దశ మ్యాచ్‌లు మొదలవుతాయి. 'సూపర్–8'కు చేరిన ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్–1లో భారత్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్... గ్రూప్–2 లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, అమెరికా జట్లు ఉన్నాయి. 'సూపర్–8' మ్యాచ్‌లు ముగిశాక రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరుతాయి.

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
జూన్ 19	దక్షిణాఫ్రికా X అమెరికా	నార్త్ సౌండ్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 20	వెస్టిండీస్ X ఇంగ్లండ్	గ్రాస్ ఐలెట్	ఉ. గం. 6 నుంచి
జూన్ 20	భారత్ X అఫ్గానిస్తాన్	బ్రిడ్జ్‌టౌన్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 21	ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్	నార్త్ సౌండ్	ఉ. గం. 6 నుంచి
జూన్ 21	ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా	గ్రాస్ ఐలెట్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 22	వెస్టిండీస్ X అమెరికా	బ్రిడ్జ్‌టౌన్	ఉ. గం. 6 నుంచి
జూన్ 22	భారత్ X బంగ్లాదేశ్	నార్త్ సౌండ్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 23	ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్	కింగ్స్‌టౌన్	ఉ. గం. 6 నుంచి
జూన్ 23	ఇంగ్లండ్ X అమెరికా	బ్రిడ్జ్‌టౌన్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 24	వెస్టిండీస్ X దక్షిణాఫ్రికా	నార్త్ సౌండ్	ఉ. గం. 6 నుంచి
జూన్ 24	భారత్ X ఆస్ట్రేలియా	గ్రాస్ ఐలెట్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 25	అఫ్గానిస్తాన్ X బంగ్లాదేశ్	కింగ్స్‌టౌన్	ఉ. గం. 6 నుంచి
జూన్ 27	తొలి సెమీఫైనల్	ట్రినిడాడ్	ఉ. గం. 6 నుంచి
జూన్ 27	రెండో సెమీఫైనల్	గయానా	రాత్రి గం. 8 నుంచి
జూన్ 29	ఫైనల్	బ్రిడ్జ్‌టౌన్	రాత్రి గం. 7:30 నుంచి

శ్రీలంకకు ఊరట

గ్రాస్ ఐలెట్: మాజీ చాంపియన్ శ్రీలంక ఎట్టకేలకు ఈ టి20 ప్రపంచకప్‌లో విజయం సాధించి టోర్నీ నుంచి నిష్క్రమించింది. గ్రూప్ 'డి'లో దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ చేతిలో ఓడిన లంకకు నేపాల్‌తో మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. సోమవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో శ్రీలంక 83 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై గెలిచింది. తొలుత లంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఓపెనర్ కుశాల్ మెండిస్ (29 బంతుల్లో 46; 5 ఫోర్లు), అసలంక (21 బంతుల్లో 46; 1 ఫోర్, 5 సిక్స్‌లు), మాథ్యూస్ (15 బంతుల్లో 30 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అనంతరం నెదర్లాండ్స్ 16.4 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ లెవిట్ (23 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (24 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. నువాన్ తుషార 3, హసరంగ, పతిరణ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

27 బంతుల్లోనే...



టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఎస్తోనియా బ్యాటర్ సాహిల్

41 బంతుల్లో 6 ఫోర్లు, 18 సిక్స్‌లతో 144 నాటౌట్

ఎపిస్కోపి (సైప్రస్): ఆకాశమే హద్దుగా చెలరేగిన ఎస్తోనియా బ్యాటర్ సాహిల్ చౌహాన్ అంతర్జాతీయ టి20ల్లోనే కాకుండా టి20 ఫార్మాట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. సైప్రస్ జట్టుతో సోమవారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో సాహిల్ ఈ ఘనత సాధించాడు. సైప్రస్ నిర్దేశించిన 192 పరుగుల లక్ష్యాన్ని ఎస్తోనియా కేవలం 13 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారత సంతతికి చెందిన 32 ఏళ్ల సాహిల్ 41 బంతుల్లో 6 ఫోర్లు, 18 సిక్స్‌లతో 144 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ క్రమంలో సాహిల్ 27 బంతుల్లో సెంచరీని (5 ఫోర్లు, 13 సిక్స్‌లు) పూర్తి చేసుకున్నాడు. దాంతో అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా నమీబియా బ్యాటర్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ (33 బంతుల్లో; ఈ ఏడాది ఫిబ్రవరి 27న నేపాల్‌పై) నెలకొల్పిన ప్రపంచ రికార్డు బద్దలైంది. సాహిల్ ధాటికి టి20ల్లో క్రిస్ గేల్ (30 బంతుల్లో; ఆర్‌సీబీ తరఫున 2013లో పుణే వారియర్స్‌పై) పేరిట ఉన్న ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు కూడా తెరమరుగైంది. అంతేకాకుండా అంతర్జాతీయ టి20 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన ప్లేయర్‌గా కూడా సాహిల్ రికార్డు నెలకొల్పాడు. 2019లో ఐర్లాండ్‌తో జరిగిన టి20 మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ బ్యాటర్ హజ్రతుల్లా జజాయ్ అత్యధికంగా 16 సిక్స్‌లు కొట్టాడు.

భారత ఫుట్‌బాల్ హెడ్ కోచ్ స్టిమాక్‌పై వేటు




న్యూఢిల్లీ: భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ ఇగోర్ స్టిమాక్‌కు ఉద్వాసన పలికారు. 2026 ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో టీమిండియా మూడో రౌండ్‌కు అర్హత సాధించలేకపోవడంతో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) స్టిమాక్ సేవలకు మంగళం పాడింది. క్రొయేషియాకు చెందిన ఈ మాజీ ఫుట్‌బాలర్‌ను 2019లో కోచ్‌గా నియమించారు. ఆయన శిక్షణలో భారత జట్టు నాలుగు మేజర్ ట్రోఫీలను సాధించింది. ఇందులో రెండు 'శాఫ్' చాంపియన్‌షిప్ టైటిళ్లు కాగా, ఇంటర్‌కాంటినెంటల్ కప్, ముక్కోణపు సిరీస్ ఉన్నాయి. దీంతో గత అక్టోబర్‌లో ఆయనకు 2026 వరకు పొడిగింపు ఇచ్చారు. అయితే సునీల్ ఛెత్రి (ప్రస్తుతం రిటైరయ్యాడు) నేతృత్వంలోని భారత్ క్వాలిఫయర్స్‌లో ఎప్పటిలాగే రెండో రౌండ్‌ను దాటలేకపోయింది. దీంతో జట్టు ప్రదర్శన సరిగాలేని కారణంతో గడువుకు ముందే స్టిమాక్‌ను తొలగించారు. ఒప్పందం ప్రకారం ఇలా అర్ధంతరంగా సాగనంపితే స్టిమాక్‌కు 3,60,000 డాలర్లు (రూ. 3 కోట్లు) ఏఐఎఫ్ఎఫ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆ మొత్తం చెల్లించేందుకు సమాఖ్య సిద్ధమైంది.

ఫెర్గూసన్ 4-4-0-3



తరుబా: న్యూజిలాండ్ టి20 ప్రపంచకప్ నుంచి ఇదివరకే నిష్క్రమించింది. అయితే గ్రూప్ 'సి'లో తమ ఆఖరి పోరులో విజయంతో పాటు పేస్ బౌలర్ ఫెర్గూసన్ (4–4–0–3) పుటలకెక్కిన రికార్డు గణాంకాలతో కివీస్ శిబిరం సంతృప్తి చెందింది. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో పపువా న్యూగినీపై నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినీ జట్టు 19.4 ఓవర్లలో 78 పరుగులకే ఆలౌటైంది. చార్లెస్ అమిని (17; 2 ఫోర్లు), నొర్మాన్ వనువా (14; 1 ఫోర్, 1 సిక్స్), సెసె బవు (12; 1 ఫోర్) రెండంకెల స్కోర్లు చేశారు. పరుగివ్వకుండా అన్ని మెయిడిన్లే వేసిన ఫెర్గూసన్ 3 వికెట్లు తీశాడు. తద్వారా కెనడా బౌలర్ సాద్ బిన్ జఫర్ 2021లో పనామాపై వేసిన 4–4–0–2 రికార్డు స్పెల్ తుడిచిపెట్టుకుపోయింది. అనంతరం సులువైన లక్ష్యాన్ని న్యూజిలాండ్ 12.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (35; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ విలియమ్సన్ (18 నాటౌట్; 2 ఫోర్లు), మిచెల్ (12 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు) రాణించారు.

సినిమా


● రవితేజ

మాస్ బచ్చన్

శత్రువులు చుట్టుముట్టారు... అయినా బచ్చన్ కంగారుపడలేదు. కంగారు అంటే ఏంటో అతనికి తెలియదు. ధైర్యానికి చిరునామా లాంటివాడు. వచ్చినవాళ్లను వచ్చినట్లు ఇరగదీశాడు బచ్చన్. ఏ రేంజ్‌లో రఫ్ఫాడించాడో తెలియాలంటే 'మిస్టర్ బచ్చన్' చిత్రం చూడాల్సిందే. రవితేజ టైటిల్ రోల్‌లో హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం షో రీల్ వీడియోను సోమవారం విడుదల చేశారు. ఈ వీడియోలో రవితేజ చేసిన మాస్ ఫైట్, ఆగ్రహంతో జగపతిబాబు, అమితాబ్ బచ్చన్‌ని రవితేజ అనుకరించడం తదితర విజువల్స్ కనిపించాయి. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సచిన్ ఖేడేకర్ కీలక పాత్ర చేశారు. ఈ సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటించనుంది చిత్రబృందం. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: అయాంకా బోస్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.


● ఎన్టీఆర్

చలో థాయ్‌లాండ్

హీరో ఎన్టీఆర్ థాయ్‌లాండ్‌కి పయనమయ్యారు. 'దేవర' మూవీ తాజా షెడ్యూల్ చిత్రీకరణలో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లారు ఎన్టీఆర్. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె ఈ సినిమా నిర్మిస్తున్నారు. 'దేవర' కీలక షెడ్యూల్‌ను గోవాలో పూర్తి చేసుకుని ఇటీవల హైదరాబాద్ చేరుకుంది చిత్రబృందం. తర్వాతి షెడ్యూల్ కోసం సోమవారం ఎన్టీఆర్ హైదరాబాద్ నుంచి థాయ్‌లాండ్ ప్రయాణం అయ్యారు. ఆయనతోపాటు భార్య లక్ష్మీ ప్రణతి, పిల్లలు అభయ్, భార్గవ్ కూడా ఉన్నారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి వెళుతున్న ఎన్టీఆర్ ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'దేవర' షూటింగ్‌లో పాల్గొనేందుకు జాన్వీ కపూర్ కూడా ఆదివారం సాయంత్రం థాయ్‌లాండ్‌కు బయలుదేరారు. అక్కడ ఎన్టీఆర్, జాన్వీలపై ఓ పాటతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారట కొరటాల శివ. రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' తొలి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న విడుదల కానుంది.

అద్భుతమైన అనుభూతినివ్వడానికే వాయిదా


● అల్లు అర్జున్

''మీకు (ప్రేక్షకులు) అద్భుతమైన అనుభూతిని ఇవ్వాలన్నదే మా సంకల్పం. అందుకే మీరు మరికొంత సమయం వేచి ఉండాలి'' అంటూ 'పుష్ప' మూవీ టీమ్ సోమవారం ఓ నోట్‌ని విడుదల చేసింది. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మించిన 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2021 డిసెంబరు 17న విడుదలైంది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్'ని అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలోనే నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అయితే షూటింగ్ పూర్తి కానందున, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలకు ఎక్కువ సమయమే పడుతున్నందువల్ల విడుదలను వాయిదా వేశారు. ''ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 6న 'పుష్ప: ది రూల్'ని రిలీజ్ చేయనున్నాం. 'పుష్ప: ది రైజ్' విజయం మా బాధ్యతని పెంచింది. మీకు ది బెస్ట్ ఇవ్వడానికి హార్డ్‌వర్క్ చేస్తున్నాం. కచ్చితంగా మీరు సిల్వర్ స్క్రీన్‌పై ది బెస్ట్ చూస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

నింద మైలురాయిగా నిలవాలి - నిఖిల్ సిద్ధార్థ్


● రాజేశ్, నిఖిల్ సిద్ధార్థ్, వరుణ్ సందేశ్

''నింద' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. మంచి కథతో పాటు చాలా క్వాలిటీతో తెరకెక్కించారు. నా కెరీర్‌లో 'స్వామి రారా, కార్తికేయ' సినిమాల్లా వరుణ్ సందేశ్ కెరీర్‌లో 'నింద' ఓ మైలురాయిగా నిలవాలి. ఈ చిత్రానికి ప్రేక్షకులు పెద్ద విజయం అందించాలి'' అని హీరో నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'నింద'. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకలో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– ''నింద' నా మనసుకు ఎంతో దగ్గరైన చిత్రం. రాజేశ్‌గారు ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా నిర్మించి, దర్శకత్వం వహించారు. మా చిత్రాన్ని మైత్రీ మూవీస్ వారు రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. నా కెరీర్‌లో 'హ్యాపీ డేస్, కొత్త బంగారు లోకం, ఏమైంది ఈవేళ' చిత్రాల తర్వాత 'నింద' నిలుస్తుందని గర్వంగా చెప్పుకోగలను'' అన్నారు. ''నింద' మూవీ అవుట్‌పుట్ నాకు చాలా సంతృప్తి ఇచ్చింది. మా సినిమాతో వరుణ్ మంచి కమ్ బ్యాక్ ఇస్తాడు'' అన్నారు రాజేశ్ జగన్నాథం.

అప్పుడు భయం వేసింది - విజయ్ సేతుపతి


● నితిలన్, విజయ్ సేతుపతి

''మహారాజ' విడుదలకి ముందు హైదరాబాద్‌కి వచ్చాను. ఇక్కడ తెలుగు ప్రేక్షకులు నాపై చూపించిన ప్రేమాభిమానాలు చూసి కొంచెం భయం వేసింది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని కోరుకున్నా. తెలుగు ప్రేక్షకులు అది నెరవేర్చడం ఆనందాన్నిచ్చింది. తెలుగు వారు నాపై చూపిన ప్రేమ చూస్తుంటే.. ఇది నా హోమ్‌టౌన్‌లానే అనిపిస్తోంది. నాకు ఈ అనుభూతిని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని హీరో విజయ్ సేతుపతి అన్నారు. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించిన చిత్రం 'మహారాజ'. విజయ్ సేతుపతి హీరోగా నటించిన ఈ చిత్రంలో మమతా మోహన్‌దాస్, అనురాగ్ కశ్యప్ ఇతర లీడ్ రోల్స్ చేశారు. సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి నిర్మించారు. ఈ మూవీని తెలుగులో ఎస్వీఆర్ సినిమా ఈ నెల 14న రిలీజ్ చేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మహారాజ' మూవీ థ్యాంక్స్ మీట్‌లో నితిలన్ సామినాథన్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకుల నుంచి మా 'మహారాజ'కి లభిస్తున్న ఆదరణ చాలా ఆనందాన్నిచ్చింది'' అన్నారు ''మహారాజ'ని కుటుంబంతో కలసి చూడండి.. చాలా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ మారుతి. ''ఈ మధ్య కాలంలో నేను చూసిన మంచి సినిమా 'మహారాజ'' అన్నారు మరో అతిథి గోపీచంద్ మలినేని. ''ఈ సినిమా హిట్ ఏ రేంజ్‌కి వెళ్లి ఆగుతుందో చెప్పలేం'' అన్నారు ఇంకో అతిథి బుచ్చిబాబు సాన. డైరెక్టర్ అనిల్ కన్నెగంటి, డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలే అయినా మర్చిపోను


● హనీ రోజ్

'చీకట్లో నేను చూసిన ఆ ఎరుపెక్కిన కళ్లు' అనే డైలాగ్‌తో 'రేచెల్' మూవీ టీజర్ విడుదలైంది. హీరోయిన్ హనీ రోజ్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'రేచెల్'. ఆనందిని బాలా దర్శకత్వం వహించారు. బాదుషా ప్రొడక్షన్స్‌పై బాదుషా ఎన్ఎమ్, రాజన్ చిరాయిల్, అబ్రిడ్ షైన్ నిర్మించారు. ఈ చిత్రాన్ని మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం 'రేచెల్' మూవీ టీజర్‌ని విడుదల చేసింది యూనిట్. 'కలైతే కాదు.. అది కలే అయినా వాటిని నేను మర్చిపోను', 'ఎవరై ఉంటారు.. తెలీదు. వెతకాలి.. చంపాలి' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: స్వరూప్ ఫిలిప్, సంగీతం, నేపథ్య సంగీతం: ఇషాన్ ఛబ్రా.

సినిమాపై ఇష్టంతో....


● అభిరామ్, వెన్నెల

అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల, ప్రదీప్, అమ్మ రమేశ్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. హరీష్ చావా దర్శకత్వంలో నోరి నాగప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 21న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, దర్శక–నిర్మాత నాగబాల సురేష్, దర్శకులు రేలంగి నరసింహారావు, సముద్ర, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, టి. ప్రసన్నకుమార్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ''నలుగురు యువకులు సినిమాపై ఇష్టంతో ఈ రంగంలోకి వస్తారు. వాళ్లు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అనే కథాంశంతో ఈ మూవీ రూపొందింది'' అన్నారు హరీష్ చావా. ''లవ్, కామెడీ, సెంటిమెంట్.. ఇలా అన్నీ ఉన్న చిత్రమిది'' అన్నారు నోరి నాగప్రసాద్.

హైదరాబాద్ ఘటనతో సినిమా


● కరీనా కపూర్
● ఆయుష్మాన్ ఖురానా

నాలుగేళ్ల క్రితం హైదరాబాద్ శివార్లలో జరిగిన ఒక హత్యాచార ఘటన వెండితెరపైకి రానుందని టాక్. హిందీలో ఈ ఘటన నేపథ్యంలో సినిమా తీయడానికి దర్శకురాలు మేఘనా గుల్జార్ సన్నాహాలు మొదలుపెట్టారట. పోలీసులు బాధితురాలి పేరుని వెల్లడించకుండా 'దిశ' అని పేర్కొన్న ఆ ఘటన చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రానికి ముఖ్య తారలుగా కరీనా కపూర్, ఆయుష్మాన్ ఖురానాలను ఎంపిక చేశారట మేఘన. కరీనా, ఆయుష్ స్క్రిప్ట్ చదివి, గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. 'తల్వార్, రాజీ, చపాక్, సామ్ బహదూర్' వంటి చిత్రాలతో మంచి దర్శకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు మేఘన. దిశ ఘటనపై ఆమె తెరకెక్కించనున్న చిత్రం గురించి త్వరలో అధికారక ప్రకటన రానుందట.

సివిల్ ఇంజనీర్ అమిష్ట


● దర్శన

అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత లీడ్ రోల్స్‌లో నటించిన తాజా చిత్రం 'పరదా'. 'సినిమా బండి' మూవీ ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించిన రెండో చిత్రం ఇది. శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించారు. సోమవారం (జూన్ 17) దర్శనా రాజేంద్రన్ బర్త్ డే సందర్భంగా 'పరదా'లో ఆమె చేస్తున్న సివిల్ ఇంజనీర్ అమిష్ట పాత్ర ఫస్ట్ లుక్‌ని, ఓ వీడియోను విడుదల చేశారు. 'అబ్బాయిలు చేయలేనిది, అమ్మాయిలు చేయగలిగేది పిల్లల్ని కనడం' అంటూ దర్శన చెప్పిన డైలాగ్ వీడియోలో ఉంది. ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ– ''లేడీ ఓరియంటెడ్ కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పరదా'' అన్నారు. ''ప్యాషన్‌తో ఈ సినిమా చేశాం. మేం సృష్టించిన ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించడం కోసం ఎదురు చూస్తున్నాం'' అన్నారు విజయ్ డొంకాడ.

సాక్షి బిజినెస్
మంగళవారం
18-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
182	50
76,993	23,466

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,840	▲	151
డోజోన్స్	36,689	▲	100
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,142	▽	5
డాక్స్	18,068	▲	66
షాంఘై	3,016	▽	17
నికాయ్	38,102	▽	712

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	81.73	85.41
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	103.45	108.40
€	యూరో	భారతీయ	87.34	91.83
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	42.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.78	57.63
S$	సింగపూర్ డాలర్	భారతీయ	59.44	64.14
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.39	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.86	23.65
¥	చైనా యువాన్	భారతీయ	10.40	12.47

బడా ఐపీఓల బొనాంజా!



- జాబితాలో హ్యుందాయ్, అఫ్కన్స్, ఓలా ఎలక్ట్రిక్, స్విగ్గీ, ఎన్ఎస్‌డీఎల్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, ఎమ్‌క్యూర్
- రూ. 60,000 కోట్ల సమీకరణ బాట

ఈ ఆర్థిక సంవత్సరం (2024–25)లో కూడా పబ్లిక్ ఇష్యూల హవా కొనసాగనుంది. అయితే ఈ ఏడాది ప్రత్యేకతేమిటంటే దిగ్గజ కంపెనీలు భారీస్థాయిలో నిధుల సమీకరణకు క్యూ కడుతున్నాయి. ఈ జాబితాలో ఆటో దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా సహా.. స్విగ్గీ, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, అఫ్కన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితరాలు చేరాయి. రూ.60,000 కోట్లకు పైగా నిధులను సమీకరించేందుకు చురుగ్గా సన్నాహాలు చేస్తున్నాయి.

ముంబై: కొద్ది రోజులుగా సెకండరీ మార్కెట్లు మళ్లీ దూకుడు చూపుతున్నాయి. రోజుకో కొత్త గరిష్టాలను తాకుతున్నాయి. ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 77,000 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 23,500కు చేరాయి. ఈ నేపథ్యంలో పలు అన్‌లిస్టెడ్ దిగ్గజాలు పబ్లిక్ ఇష్యూలవైపు దృష్టి పెట్టాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు సెబీ తలుపుతడుతున్నాయి. తద్వారా భారీస్థాయిలో నిధుల సమీకరణకు తెరతీయనున్నాయి. వెరసి ఈ ఏడాది ప్రైమరీ మార్కెట్ సరికొత్త రికార్డుకు వేదికకానున్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతేడాది (2023–24) పలు చిన్న, మధ్యతరహా కంపెనీలు ఆసక్తి చూపడంతో సగటున ఐపీవో ఇష్యూ పరిమాణం రూ. 815 కోట్లుగా నమోదైంది. ఇక 2022–23లో ఒక్కో ఇష్యూ సగటు పరిమాణం రూ. 1,409 కోట్లుకాగా.. 2021–22లో రూ. 2,105 కోట్లు. అయితే ఈ ఏడాది వీటికి మించి అంటే రెట్టింపు అంతకంటే ఎక్కువ సగటు పరిమాణం నమోదుకానున్నట్లు స్టాక్ మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



నిధులకు క్యూ... (రూ. కోట్లలో)

కంపెనీ పేరు	ఇష్యూ
హ్యుందాయ్	25,000
స్విగ్గీ	8,000
బజాజ్ హౌసింగ్	7,000
అఫ్కన్స్ ఇన్‌ఫ్రా	7,000
ఓలా ఎలక్ట్రిక్	5,500
ఎన్ఎస్‌డీఎల్	4,500
వరీ ఎనర్జీస్	3,000

లిస్టింగ్‌వైపు చూపు...

రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు అనుగుణంగా బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిస్టింగ్ బాటలో సాగుతోంది. సెబీ అనుమతితో రూ. 7,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. అఫ్కన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సైతం ఐపీవో ద్వారా రూ. 7,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇక ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ రూ. 8,000 కోట్ల నిధులను సమకూర్చుకోవాలని చూస్తోంది. ఈ బాటలో ఈవీ స్కూటర్ల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ. 5,500 కోట్లు, ఎన్ఎస్‌డీఎల్ రూ. 4,500 కోట్లు, వరీ ఎనర్జీస్ రూ. 3,000 కోట్లు, ఎమ్‌క్యూర్ రూ. 2,300 కోట్లు చొప్పున సమీకరించనున్నట్లు మార్కెట్ వర్గాలు తెలియజేశాయి. కాగా.. ఈ ఏడాది ఇప్పటికే 8 కంపెనీలు ఐపీవోల ద్వారా మొత్తం రూ. 14,600 కోట్లు అందుకున్నాయి.


ఎల్ఐసీ రికార్డుకు చెక్!

దక్షిణ కొరియా దిగ్గజం హ్యుందాయ్ దేశీ విభాగం ఐపీవో అనుమతి కోసం సెబీకి తాజాగా దరఖాస్తు చేసింది. తద్వారా 15–20 శాతం వాటా విక్రయించే వ్యూహంలో ఉంది. దీంతో 3.3–5.6 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 25,000 కోట్లు) అందుకునే వీలున్నట్లు అంచనా. ఫలితంగా 2022–23లో రూ. 21,000 కోట్లు సమీకరించిన ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ ఇష్యూని అధిగమించనుంది. దేశీయంగా అతిపెద్ద ఐపీవోగా సరికొత్త రికార్డు నెలకొల్పే అవకాశముంది.

హ్యుందాయ్ క్రెటా ఈవీ వచ్చేస్తోంది!

మార్చిలోగా రయ్ రయ్...

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా క్రెటా ఎలక్ట్రిక్ వెహికల్‌ను తీసుకొస్తోంది. 2025 జనవరి–మార్చి మధ్య ఈ మోడల్ దేశీ రోడ్లపై పరుగులు తీస్తుందని కంపెనీ ప్రకటించింది. ఒకసారి చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యంతో క్రెటా ఈవీ రూపుదిద్దుకుంటోందని సమాచారం. ధర రూ. 22–26 లక్షల మధ్య ఉంటుంది. హ్యుందాయ్ ఇండియా పబ్లిక్ ఇష్యూకు వస్తున్న సంగతి తెలిసిందే. సెబీకి దాఖలు చేసిన పత్రాల ప్రకారం భారత్‌లో నాలుగు ఈవీలను ప్రవేశపెట్టాలన్నది సంస్థ ప్రణాళిక. వీటిలో మాస్ మార్కెట్ మోడల్‌తో పాటు హైఎండ్, ప్రీమియం ఈవీలు సైతం ఉన్నాయి. ఈవీ విభాగంలో కంపెనీ ప్రస్తుతం దేశంలో అయానిక్ 5, కోనా ఎలక్ట్రిక్ విక్రయిస్తోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా 17.5 శాతం వాటా విక్రయించాలన్నది సంస్థ లక్ష్యం. తద్వారా రూ.25,000 కోట్లు సమీకరించనుంది. దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్.. బ్యాటరీ ఈవీ, హైబ్రిడ్ ఈవీ, ప్లగ్–ఇన్ హైబ్రిడ్ ఈవీ, మైల్డ్ హైబ్రిడ్ ఈవీ, ఫ్యూయల్ సెల్ ఈవీలను తయారు చేస్తోంది. ఎలక్ట్రిక్ వెహికల్స్ వ్యాపారం కోసం కంపెనీ గతేడాది తమిళనాడులో రూ.20,000 కోట్ల పెట్టుబడిని ప్రకటించింది. చెన్నై ప్లాంటును ఈవీలు, ఎస్‌యూవీల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు.



హైదరాబాద్‌లో 1ఎం1బీ అకాడమీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 1ఎం1బీ (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) ఫౌండేషన్ తాజాగా హైదరాబాద్‌లో గ్రీన్ స్కిల్స్ అకాడమీని ఏర్పాటు చేయనుంది. ఇందుకు అంతర్జాతీయ సీఆర్ఎం (కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్) సాఫ్ట్‌వేర్ దిగ్గజం సేల్స్‌ఫోర్స్‌తో జట్టుకట్టింది. పర్యావరణానుకూల కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా యువతకు శిక్షణనిచ్చేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. హైబ్రిడ్ విధానంలో ఈ అకాడమీ 2030 నాటికి తెలంగాణలో లక్ష మంది యువతకు శిక్షణనివ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మానవ్ సుబోధ్ తెలిపారు. కృత్రిమ మేధతో పర్యావరణహిత సొల్యూషన్స్‌ను రూపొందించేందుకు అవసరమైన అధునాతన సాధనాలను సంస్థ అందించనుంది. టాప్–10లో నిల్చిన వారికి ప్రతి ఏటా తాము రూపొందించిన వాటిని ఐక్యరాజ్యసమితిలో ఏటా నిర్వహించే 1ఎం1బీ సదస్సులో ప్రదర్శించే అవకాశం లభిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-6-2024	
విశాఖ	500–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	480–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495–00
వరంగల్	497–00
రిటైల్ ధర	5.55

ఈసారి 15 శాతం రుణ వృద్ధి

ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక వృద్ధి రేటును బట్టి చూస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో (2024–25) రుణాల వృద్ధి 14–15 శాతం స్థాయిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు. 'సాధారణంగా జీడీపీ వృద్ధి రేటుకు ద్రవ్యోల్బణాన్ని కలిపి, దానికి 2–3 శాతం అదనంగా రుణ వృద్ధి ఉండగలదని అంచనా వేస్తుంటాం. దానికి అనుగుణంగా ప్రస్తుత పరిస్థితుల్లో అవకాశాలను బట్టి ఇది 14–15 శాతం ఉండొచ్చు' అని ఆయన పేర్కొన్నారు. ఇక డిపాజిట్ల విషయానికొస్తే గతేడాది 11 శాతం వృద్ధి నమోదైనట్లు చెప్పారు. ఈసారి 12–13 శాతం స్థాయిలో ఉండగలదని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ చట్టబద్ధ లిక్విడిటీ నిష్పత్తి (ఎస్ఎల్ఆర్) నిర్దేశిత స్థాయికన్నా అధికంగానే ఉన్నందున డిపాజిట్ల రేట్లను పెంచి మరీ నిధులు సమీకరించాల్సిన ఒత్తిళ్లేమీ లేవని ఖారా వివరించారు.



డిఫెన్స్ ఎగుమతులు @ 5 బిలియన్ డాలర్లు!

తయారీ సామర్థ్యాల పెంపు కీలకం ● ఎఫ్‌డీఐలను క్రమబద్ధీకరించాలి ● నెక్స్‌జెన్ నివేదిక

న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) క్రమబద్ధీకరించడం, పరిశోధన.. అభివృద్ధి కార్యకలాపాలను, తయారీ సామర్థ్యాలను పటిష్టం చేసుకోవడం తదితర అంశాలు ఈ ఆర్థిక సంవత్సరంలో 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.42,000 కోట్లు) డిఫెన్స్ ఎగుమతుల లక్ష్యాన్ని సాధించేందుకు తోడ్పడగలవని ఒక అధ్యయన నివేదిక వెల్లడించింది. ఇంటర్నేషనల్ పోలీస్ ఎక్స్‌పో నిర్వాహక సంస్థ నెక్స్‌జెన్ ఎగ్జిబిషన్స్ రూపొందించిన ఈ నివేదిక ప్రకారం ఆర్‌అండ్‌డీ, తయారీ సామర్థ్యాలను మెరుగుపర్చుకుంటే దేశీ డిఫెన్స్ రంగం అంతర్జాతీయ తయారీ హబ్‌గా ఎదిగేందుకు అవకాశం ఉందని వివరించింది. ప్రస్తుతం 75 పైచిలుకు దేశాలకు భారత్ రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోంది. మరోవైపు, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతలను, డేటా అనలిటిక్స్ మొదలైనవి ఉపయోగించి అంతర్గత భద్రత విభాగాన్ని మరింత పటిష్టం చేసుకోవడం ముఖ్యమని నివేదిక తెలిపింది. భారీ విపత్తు నిర్వహణ వ్యవస్థలను రూపొందించుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో సత్వరం చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని వివరించింది. దేశవ్యాప్తంగా 15 నగరాల్లో నిర్వహించిన ఈ సర్వేలో 130 పైచిలుకు దేశ, విదేశ రక్షణ పరికరాల తయారీ సంస్థలు, ఎగుమతిదార్లు, స్టార్టప్‌లు పాల్గొన్నాయి.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఎఫ్ఎల్, నోయిడాలో 164 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

నోయిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్ఎఫ్ఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎన్ఎఫ్ఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 164
» పోస్టుల వివరాలు: మేనేజ్‌మెంట్ ట్రైనీ(కెమికల్)–56, మేనేజ్‌మెంట్ ట్రైనీ(మెకానికల్)–18, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎలక్ట్రికల్)–21, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇన్‌స్ట్రుమెంటేషన్)–17, మేనేజ్‌మెంట్ ట్రైనీ(కెమికల్ ల్యాబ్)–12, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్)–03, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఫైర్ అండ్ సేఫ్టీ)–05, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)–05, మేనేజ్‌మెంట్ ట్రైనీ (మెటీరియల్స్)–11, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హెచ్ఆర్)–16.
» అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీ డిగ్రీ, పీజీ డిప్లొమా (పీజీడీఎం/పీజీడీబీఎం)/ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.40,000 నుంచి 1,40,000
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.07.2024
» దరఖాస్తు సవరణ తేదీలు: 04.07.2024 నుంచి 05.07.2024 వరకు.
» వెబ్‌సైట్: www.nationalfertilizers.com

ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీ(ఏపీఎఫ్‌యూ), దాని పరిధిలోని కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 440 సీట్లు.
» వ్యవధి: రెండేళ్లు. బోధనా మాధ్యమం: ఇంగ్లిష్.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 31.08.2024 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయసు 22 ఏళ్లు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:26.06.2024
» సర్టిఫికెట్ల ఎడిట్ ఆప్షన్: 2.07.2024,3.07.2024
» వెబ్ ఆప్షన్ తేది: 06.07.2024.
» వెబ్‌సైట్: https://apfu.ap.gov.in

» ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ-13 నోటిఫికేషన్
» మొత్తం 9,995 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» ఆఫీసర్స్(స్కేల్-1,2,3), ఆఫీస్ అసిస్టెంట్స్ పోస్టులు
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ఆంధ్రప్రదేశ్‌లో 450, తెలంగాణలో 700 పోస్టులు

పల్లె బ్యాంకుల్లో.. వేస్తారా పాగా!

బ్యాంకు ఉద్యోగార్థులకు శుభవార్త! ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. ఆర్ఆర్‌బీల్లో మొత్తం 9,995 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా స్కేల్-1,2,3లతో గ్రూప్-ఎ ఆఫీసర్స్ ; గ్రూప్-బీ ఆఫీస్ అసిస్టెంట్స్ ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. బ్యాచిలర్ డిగ్రీ మొదలు బీటెక్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణుల వరకూ.. అన్ని నేపథ్యాల వారు పోటీ పడే అవకాశం ఉంది! ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ-13 పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియామకాలకు ఉమ్మడి వ్యవస్థ.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. ఆయా రాష్ట్రాల్లోని గ్రామీణ బ్యాంకుల్లో పోస్టుల భర్తీకి ప్రకటన ఇచ్చింది. ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీస్-13 పేరుతో మల్టీపర్పస్ ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్-1, స్కేల్-2, స్కేల్-3 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

మొత్తం పోస్టులు 9,995

- ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ ప్రక్రియ ద్వారా గ్రామీణ బ్యాంకుల్లో వివిధ విభాగాల్లో 9,995 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్): 5,585 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-1: 3,499 పోస్టులు; ఆఫీసర్ స్కేల్ -2 (అగ్రికల్చర్ ఆఫీసర్): 70 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2(చార్టర్డ్ అకౌంటెంట్): 60 పోస్టులు; ఆఫీసర్(మేనేజర్-జనరల్ బ్యాంకింగ్) స్కేల్ -2: 496 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2(ఐటీ): 94 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2(లా): 30 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2 (మార్కెటింగ్): 11 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2(ట్రెజరీ మేనేజర్): 21 పోస్టులు; -ఆఫీసర్ స్కేల్-3(సీనియర్ ఆఫీసర్): 129 పోస్టులు ఉన్నాయి.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 450 పోస్టులు, తెలంగాణలో 700 ఖాళీలను భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్, లా, ఎంబీఏ, సీఏ తదితర అర్హతలు ఉండాలి. సంబంధిత కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. వీరు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ నాటికి సంబంధిత సర్టిఫికెట్లు పొందాలి.
- **వయసు:** 01.06.2024 నాటికి గ్రూప్ బీ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల(మల్టీపర్పస్)కు 18–28 ఏళ్ల మధ్య ఉండాలి. అదేవిధంగా గ్రూప్ ఏ ఆఫీసర్ స్కేల్ 1 (అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు 18–30 ఏళ్ల మధ్య; ఆఫీసర్ స్కేల్ 2 (మేనేజర్) పోస్టులకు 21–32 ఏళ్ల మధ్య; ఆఫీసర్‌స్కేల్ 2 (సీనియర్ మేనేజర్) పోస్టులకు 21–40 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది. ఎస్సీ/ఎస్టీలు ఐదేళ్లు, ఓబీసీలు మూడేళ్లు వయో సడలింపు పొందొచ్చు.

ఎంపిక వేర్వేరుగా

ఐబీపీఎస్ ఆయా పోస్టులను అనుసరించి వేర్వేరు ఎంపిక విధానాలను అనుసరిస్తోంది. ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్-1 పోస్టులకు రెండు దశల రాత పరీక్ష (ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్)తో పాటు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆఫీసర్ స్కేల్-2, స్కేల్-3 పోస్టులకు మాత్రం ఒక దశ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

ఆఫీస్ అసిస్టెంట్.. ప్రిలిమినరీ పరీక్ష

- ఆఫీస్ అసిస్టెంట్(మల్టీ పర్పస్) ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో 80 ప్రశ్నలు–80 మార్కులకు జరుగుతుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–40 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 45 నిమిషాలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తే మెయిన్ రాసేందుకు అనుమతి లభిస్తుంది.



- **మెయిన్ ఎగ్జామినేషన్:** ఆఫీస్ అసిస్టెంట్ ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. రీజనింగ్40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు,ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్ ఎగ్జామినేషన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు.

ఆఫీసర్ స్కేల్-1.. ప్రిలిమినరీ

ఆఫీసర్ స్కేల్–1 ప్రిలిమినరీ పరీక్ష.. ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో మొత్తం 80 ప్రశ్నలు –80 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులకు చొప్పున ఉంటాయి. పరీక్ష సమయం 45 నిమిషాలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తేనే మెయిన్స్‌కు అనుమతిస్తారు.

- **మెయిన్ ఎగ్జామినేషన్:** ప్రిలిమినరీ పరీక్షలో నిర్దిష్ట కటాఫ్ సాధించిన వారికి రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో రీజనింగ్ 40 ప్రశ్నలు– 50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ 40 ప్రశ్నలు–40 మార్కులు,క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. మొత్తం 200 మార్కులకు రెండు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్, హిందీ లాంగ్వేజ్‌లకు సంబంధించి ఏదో ఒక దాన్నే ఎంచుకోవాలి. అభ్యర్థులు ఎంచుకున్న లాంగ్వేజ్ నుంచే ఆ విభాగం ప్రశ్నలు ఉంటాయి.
- మెయిన్ ఎగ్జామ్‌లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున తుది దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఆఫీసర్ స్కేల్- 2,3.. ఒకే రాత పరీక్ష

- ఆఫీసర్ స్కేల్–2(జనరలిస్ట్, స్పెషలిస్ట్), ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు సింగిల్ లెవెల్ పరీక్ష పేరుతో ఒకే రాత పరీక్ష నిర్వహిస్తారు.
- ఆఫీసర్(జనరల్ బ్యాంకింగ్)పోస్టులకు రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు,ఇంగ్లిష్ లాంగ్వేజ్/హిందీ లాంగ్వేజ్ 40ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు–50 మార్కులకు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- ఆఫీసర్ స్కేల్–2(స్పెషలిస్ట్ కేటగిరీ) పోస్టులకు ప్రొఫెషనల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–20 మార్కులు,కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40ప్రశ్నలు–40మార్కులకు చొప్పున మొత్తం 200మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు–50 మార్కులకు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- అన్ని పోస్టులకు సంబంధించి పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతాయి.
- రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా 1:3 నిష్పత్తిలో (ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున) చివరి దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూన్ 27.
- ప్రిలిమ్స్ హాల్ టికెట్ డౌన్‌లోడ్: జూలై/ఆగస్టు.
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: ఆగస్టులో .
- మెయిన్ ఎగ్జామ్: సెప్టెంబర్/అక్టోబర్‌లో .
- ఇంటర్వ్యూల నిర్వహణ: నవంబర్‌లో.
- ప్రాథమిక నియామకాల ఖరారు:జనవరి 2025లో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ibps.in
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: www.ibps.in/index.php/ruralbankxiii

రాత పరీక్షలో రాణించేలా

రీజనింగ్

ఇందులో రాణించడానికి కోడింగ్, డీకోడింగ్,సీటింగ్ అరేంజ్‌మెంట్స్, పజిల్స్, ఇన్–ఈక్వాలిటీస్, ఆల్ఫాబెటికల్ సీక్వెన్సెస్, సిలాజిజమ్స్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్స్, ఇన్‌పుట్–అవుట్‌పుట్స్ తదితర అంశాలపై దృష్టిపెట్టాలి. అధ్యయనంతోపాటు నిత్యం ప్రాక్టీస్‌కు సమయం కేటాయించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉన్న విభాగం.. ఇంగ్లిష్ లాంగ్వేజ్. ఇందులో గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్, సెంటెన్స్ కరెక్షన్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా తెలుగు విద్యార్థులు ఏదైనా ఇంగ్లిష్ పత్రికను రోజూ చదువుతూ రీడింగ్ వేగం పెంచుకోవడంతోపాటు వొకాబ్యులరీని మెరుగుపరచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో రాణించడానికి కరెంట్ అఫైర్స్, దేశ ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ రంగంలో పరిణామాలు, మానిటరీ పాలసీ, రుణాలు, వడ్డీ రేట్లు, ఫైనాన్స్ రంగ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దాంతోపాటు జాతీయ, అంతర్జాయ పరిణామాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, ముఖ్యమైన ఘటనలు, తేదీలు, వ్యక్తుల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.

క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్

రెండు దశల రాత పరీక్షల్లోనూ ఉండే ఈ విభాగంలో రాణించాలంటే.. అర్థమెటిక్ అంశాలు, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్ అంశాలను అధ్యయనం చేయాలి. చదవడంతోపాటు వేగంగా సమాధానం గుర్తించేలా ప్రాక్టీస్ చేయాలి. వేగం, కచ్చితత్వంతోనే ఇందులో మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ఆఫీసర్ స్కేల్–2 పోస్టులకు నిర్వహించే ఈ విభాగంలో మంచి మార్కుల కోసం అభ్యర్థులు తమ అకడమిక్ అర్హతలకు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా వాటిని సమకాలీన పరిస్థితులతో బేరీజు వేస్తూ అధ్యయనం చేయాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించడానికి కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్(కీ బోర్డ్ షార్ట్ కట్స్, ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ ఎక్సెల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తదితర అంశాలు)పై అవగాహన పెంచుకోవాలి.

ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఆఫీసర్ స్కేల్–2, ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు ఉండే ఈ విభాగంలో స్కోర్ కోసం తాజా బ్యాంకింగ్ రంగ పరిణామాలు, బ్యాంకింగ్ వ్యవస్థ విధానాలు, ఆర్థిక రంగంలో జరుగుతున్న తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేయనున్నారు. తొలుత ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలను ప్రకటించనున్నారు. మే 24 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,37,587 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ బోర్డు సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాలను తొలిసారి డిజిటల్ విధానంలో మూల్యాంకనం చేసింది. ఈ నెల 26న ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలను ప్రకటించనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

ఈ వారంలో కొత్త వైద్య కళాశాలల్లో ఎన్‌ఎంసీ తనిఖీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మిస్తున్న మరో 5 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభానికి చకచకా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా ప్రారంభించనున్న ఈ వైద్య కళాశాలలకు ఈ వారంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) తనిఖీలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టింది. వీటిలో ఐదింటిని గత ఏడాదే ప్రారంభించింది. తద్వారా ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ విద్యా సంవత్సరంలో (2024–25లో) పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె వైద్య కళాశాలలు ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ ఐదు చోట్ల ఉన్న ప్రభుత్వాస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేసింది. ఎన్నికల కోడ్ నుంచి మినహాయింపు పొంది మరీ బోధన, బోధనేతర పోస్టులు అన్నింటికీ నోటిఫికేషన్లు ఇచ్చి, నియామకాలు పూర్తిచేసింది. ఎన్‌ఎంసీ తనిఖీలు నిర్వహించి, అనుమతులిస్తే, వీటి ప్రారంభం లాంఛనమే అవుతుంది.

ఫ్యాకల్టీకి అదనపు ప్రోత్సాహకాలు

పలు నూతన కళాశాలలకు ఇబ్బందులు తలెత్తకుండా ఫ్యాకల్టీకి అదనపు ప్రోత్సాహకాలను కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఇచ్చింది. పాడేరు, మార్కాపురం, పార్వతీపురం, పిడుగురాళ్ల, పెనుకొండ కాలేజీల్లోని ఫ్యాకల్టీకి బేసిక్ మీద 50 శాతం,పులివెందుల, మదనపల్లె, ఆదోని, అమలాపురం, బాపట్ల, పాలకొండ, నర్సీపట్నం కళాశాలల్లో బేసిక్ మీద 30 శాతం ప్రోత్సాహకాన్ని ప్రకటించింది.

సీతారామపురంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ దాడి

- అన్నదమ్ములకు తీవ్రగాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మురళి

పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం చక్రాయిగూడెం పంచాయతీ సీతారామపురంలో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడిచేసి వైఎస్సార్‌సీపీకి చెందిన అన్నదమ్ములను గాయపరిచారు. ఇటుకరాయి, ఇనుప రాడ్డుతో దాడిచేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు సప్పా మోహనమురళి, అతడి సోదరుడు ప్రతాప్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిని స్థానికులు ఏలూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులు, స్థానికులు తెలిపిన మేరకు.. స్థానిక బస్‌షెల్టర్ మీద, రోడ్డు పక్కన ఉన్న వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు తొలగించాలంటూ మోహనమురళి, ప్రతాప్‌లపై టీడీపీ కార్యకర్తలు, నాయకులు గొడవకు దిగారు. ఫ్లెక్సీలు తొలగించేందుకు వారు నిరాకరించడంతో రెచ్చిపోయిన టీడీపీ వారు ఒక్కసారిగా దాడి చేశారు. ఇటుకరాయి, ఇనుప రాడ్డుతో కొట్టి వారిద్దరిని తీవ్రంగా గాయపరిచారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తమ చెరుకు తోటను టీడీపీ నేతలు తగలబెట్టారని, ఆ సమయంలో వారిపై న్యాయ పోరాటం చేశామని మురళి చెప్పారు. ఆ విషయంలో కక్ష పెట్టుకుని ఇప్పుడు ఫ్లెక్సీ పేరుతో తమపై దాడిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు విచారించి దోషులను శిక్షించాలని బాధితులు కోరారు.

తెలంగాణ

బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సురేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎంపీ కేఆర్.సురేశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభలో ఫ్లోర్‌లీడర్‌గా నియమిస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఆయనకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. సోమవారం కేసీఆర్‌ను కేఆర్.సురేశ్‌రెడ్డి, మరో ఎంపీ దామోదర్ రావు కలిశారు. ప్రస్తుతం ఈ రెండు హోదాల్లో కే.కేశవరావు కొనసాగుతుండగా ఆయన స్థానంలో సురేశ్‌రెడ్డిని నియమిస్తున్నట్టు లోక్‌సభ, రాజ్యసభ సెక్రటరీ జనరల్‌లకు కేసీఆర్ విడివిడిగా లేఖలు రాశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



కర్నూలు నగరంలో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ముస్లింలు అధిక సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. పాత ఈద్గా నిండిపోవడంతో ఇలా రోడ్డుపైనే తమ ప్రార్థనలు కొనసాగించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

పొలంలో 12 కేజీల చేప



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ గ్రామంలో రైతు బొక్కా రామ్మూర్తి పంట పొలంలో భారీ చేప సోమవారం దొరికింది. సాధారణంగా నాలుగు కేజీల వరకు బరువు ఉండే 'అలుగు' జాతికి చెందిన ఈ చేప మూడు అడుగుల పొడవు, 12 కేజీల బరువు ఉండటం విశేషం.
– కొత్తపేట

కొండెక్కిన కూరగాయలు

నెలరోజుల్లో అనూహ్యంగా పెరిగిన ధరలు

- మేలో కిలో టమాటా రూ.16–28లు.. ప్రస్తుతం రూ.60–80
- గత నెలలో కిలో ఉల్లి రూ.22–30.. ఇప్పుడు రూ.40–50లు
- వంగ, బెండ, బీర తదితర కూరలు సైతం కిలో రూ.50పైనే
- క్యారెట్ రూ.75, మిర్చి రూ.85, అల్లం, వెల్లుల్లి రూ.200 పైమాటే
- గతేడాది ఇదే రోజులతో పోలిస్తే ఇప్పుడు భారీ వ్యత్యాసం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూరగాయల ధరలు కొండెక్కాయి. కేవలం నెలరోజుల వ్యవధిలోనే టమాటా మూడురెట్లు పెరగగా, మిగిలిన వాటి ధరలు 30–50 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం టమాటా కిలో రూ.65కు పైగా పలుకుతుండగా, మిర్చి ధర సెంచరీ వైపు పరుగులు తీస్తోంది. అలాగే, అల్లం, వెల్లుల్లి డబుల్ సెంచరీ దాటాయి. ఇక అందరూ ఎక్కువగా వినియోగించే వంగ, బెండ, బీర వంటి సాధారణ కూరగాయల ధరలు సైతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50కు పైగా పలుకుతుండడం ఆందోళన కల్గిస్తోంది. చివరికి ఆకుకూరల ధరలు సైతం అనూహ్యంగా పెరుగుతున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, కర్నూలు వంటి నగరాల్లో బహిరంగ మార్కెట్‌లో ధరలు చుక్కల్ని చూపిస్తున్నాయి.

రాష్ట్రంలోని వివిధ నగరాల్లోని బహిరంగ మార్కెట్లలో పెరుగుదల ఇలా (కనిష్టం.. గరిష్ట ధరలు కిలో..రూ.లలో)

రకం	16-6-23	3-5-24	17-6-24
టమాటా	30-50	16-28	60-80
ఉల్లి	18-26	22-30	40-50
మిర్చి	40-80	30-55	40-85
బంగాళదుంప	24-36	29-40	40-50
వంగ	25-50	14-35	30-50
బెండ	24-45	22-45	30-50
దొండ	30-47	28-42	35-50
బీర	30-47	30-55	35-55
క్యారెట్	30-60	28-52	50-75
కాకర	30-55	30-45	60-70
గోరుచిక్కుడు	25-40	30-40	50-60
క్యాప్సికం	50-70	40-60	80-100
బీన్స్	100-140	80-100	160-180

నిజానికి.. ఎన్నికలకు ముందు కిలో రూ.16–28 మధ్య దొరికిన టమాటా ప్రస్తుతం రూ.60–80 మధ్య పలుకుతోంది. కిలో రూ.22–30 మధ్య దొరికిన ఉల్లి సైతం నేడు రూ.40–50 మధ్య పలుకుతోంది. మదనపల్లి మార్కెట్‌లో సోమవారం ఒకటో రకం క్వింటా టమాటా కనిష్ట ధర రూ.690 ఉండగా గరిష్టం రూ.800లు పలికింది. రెండో రకం కనిష్టం రూ.500 కాగా, గరిష్టం రూ.680లు చొప్పున ధర పలికింది. వచ్చే నాలుగైదు రోజుల్లో టమాటా సెంచరీ దాటే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక విజయవాడ బహిరంగ మార్కెట్‌లో సోమవారం ధరలు ఎలా ఉన్నాయంటే.. టమాటా రూ.60–70, మిర్చి 70, బంగాళదుంప 40–50, ఉల్లి 50, వంగ 40, బెండ 40, బీర 60–70, కాకర 60–70, క్యారెట్ 60, క్యాబేజి 40, గోరుచిక్కుళ్లు 60, సొర 20, బీట్‌రూట్ 40, కీరదోస 60, బీన్స్ 160–180, క్యాప్సికం రూ.100 పలుకుతున్నాయి. కానీ, బహిరంగ మార్కెట్‌లో ఇలా ధరలు పెరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మరోవైపు.. గత ఏడాది ఇదే రోజుల్లో ధరలు తక్కువగానే ఉన్నప్పటికీ ఈ నెలరోజుల వ్యవధిలో ఇలా అనూహ్యంగా పెరుగుతుండడంపట్ల వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అనూహ్య పెరుగుదలపై వినియోగదారుల ఆందోళన..

అటు వర్షాలు.. ఇటు వడగాడ్పులు!

- రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు
- ఉష్ణతాపానికి పశ్చిమ గాలులే కారణం
- స్తబ్దుగా నైరుతి రుతుపవనాలు
- 4 రోజుల్లో కదలిక వచ్చి, రాష్ట్రంలో మరింతగా విస్తరించే అవకాశాలు
- వచ్చే రెండ్రోజులు వానలతో పాటు ఉక్కపోత



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఓ పక్క మోస్తరు వర్షాలు కురుస్తుండగా, మరోపక్క వడగాడ్పులూ వీస్తున్నాయి. జూన్ మొదటి వారం వరకు దడ పుట్టించిన వడగాడ్పులు ఆ తర్వాత నైరుతి రుతుపవనాల ఆగమనంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పగటి ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు గణనీయంగా తగ్గాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు మళ్లీ ఊపందుకొని, వడగాడ్పులు వీస్తున్నాయి. వాస్తవానికి నైరుతి రుతుపవనాలు ఆరంభంలో ఆశాజనకంగానే ప్రభావం చూపాయి. గత వారంలో ఉత్తరాంధ్రకు విస్తరించాయి. అప్పట్నుంచి ముందుకు కదలకుండా స్తబ్దుగా ఉండిపోయాయి. దీంతో వర్షాలు అరకొరగానే కురుస్తున్నాయి. ఎక్కడైనా కొన్ని చోట్ల మినహా అనేక చోట్ల తేలికపాటి జల్లులు పడుతున్నాయి. ప్రస్తుతం కోస్తాంధ్రపైకి పశ్చిమ గాలులు వీస్తుండడం, కోస్తా వైపు రుతుపవనాలు విస్తరించకపోవడం వంటి కారణాల వల్ల మళ్లీ ఉష్ణోగ్రతలు పెరిగి వడగాడ్పులకు దోహద పడుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కోస్తాంధ్రలో కొన్నిచోట్ల సాధారణంకంటే 4 నుంచి 5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న ఒకట్రెండు రోజులు ఇదే వాతావరణం కొనసాగుతుందని, ఫలితంగా పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో వడగాడ్పులకు ఆస్కారం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం ఒక నివేదికలో వెల్లడించింది. విశాఖపట్నం జిల్లాలోనూ వడగాడ్పుల అనుభూతి కలుగుతుందని పేర్కొంది.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు..



వచ్చే 4 రోజుల్లో నైరుతి రుతుపవనాల్లో కదలిక వచ్చి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బెంగాల్, బీహార్, కోస్తాంధ్ర అంతటా విస్తరించేందుకు అనువైన పరిస్థితులు నెలకొన్నాయి. మరోపక్క గోవా నుండి దక్షిణ కోస్తాంధ్ర వరకు ఉన్న ద్రోణి సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్లు, 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఉంది. వీటన్నంటి ప్రభావంతో రానున్న రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అదే సమయంలో పలు ప్రాంతాల్లో వడ గాలులు కూడా వీస్తాయని తెలిపింది. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నంద్యాల, తిరుపతి, విజయనగరం, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోను, బుధవారం అల్లూరి, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, పార్వతీపురం మన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మరోవైపు గంటకు 40 – 50 కిలోమీటర్ల వేగంతో ఈదరు గాలులు వీస్తాయని, అక్కడక్కడ పిడుగులు పడే ప్రమాదం కూడా ఉందని ఐఎండీ హెచ్చరించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు చిత్తమూరు (తిరుపతి)లో 4.2 సెంటీమీటర్లు, నెమలికల్లు (పల్నాడు)లో 3.9, మంగళగిరి (గుంటూరు)లో 3.5, ఎస్.కోట (విజయనగరం)లో 3.5, నగరి (చిత్తూరు)లో 2.1 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

హైవేపై పెద్దపులిని ఢీకొన్న కారు

- తిరిగి కారుపై దాడిచేసిన పెద్దపులి
- గాయాలతో అటవీప్రాంతానికి వెళ్లిపోయిన పులి
- ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఘటన



పెద్దపులిని ఢీకొని ధ్వంసమైన కారు

మర్రిపాడు/ఆత్మకూరు రూరల్: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపైకి ఒక్కసారిగా పెద్దపులి రావడం కలకలం రేగింది. ఆ పులిని ఓ కారు ఢీకొనడం.. ఆగ్రహంతో పెద్దపులి తిరిగి ఆ కారుపై దాడి చేయడం సంచలనం సృష్టించింది. ఈ ఆకస్మిక ఘటనతో కారులో ప్రయాణిస్తున్నవారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కారులో ఉన్న వ్యక్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బద్వేల్ నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఓ కారుకు కదిరినాయుడుపల్లి సమీపంలో వెలిగొండ అటవీ ప్రాంతం వద్ద ఒక్కసారిగా పెద్దపులి అడ్డువచ్చింది. పెద్దపులిని కారు ఢీకొని కొద్దిదూరం ముందుకు దూసుకువెళ్లింది. దీంతో పెద్దపులికి కోపం వచ్చి వాహనం ముందు భాగంపై తన పంజాతో దాడి చేసింది. అనంతరం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. కారు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో లోపల ఉన్నవారికి ప్రమాదం తప్పింది. కారు ముందుభాగం ధ్వంసమైంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. పెద్దపులి కాలి ముద్రలు, కారు ఢీకొనడం వల్ల పులి గాయపడినట్లుగా ఆనవాలు కనుగొని ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించారు. అటవీశాఖ అధికారులు కదిరినాయుడుపల్లి సమీపంలోని అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. పెద్దపులి సంచారంతో కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతం సమీపంలోని పడమటినాయుడుపల్లి, చుంచులూరు తదితర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

శేషాచలం చేరిన పెద్దపులి!

శ్రీశైలం–శేషాచలం మధ్య పెద్దపులుల కారిడార్ ఉంది. శ్రీశైలం–నాగార్జున సాగర్ అభయారణ్యం నుంచి శేషాచలం వరకు పులుల విస్తరణ కోసం అధికారులు పలు చర్యలు చేపట్టారు. అయితే, శేషాచలం వరకు పెద్దపులి వెళ్లిందా.. లేదా.. అని ఇప్పటికీ సంశయంగానే ఉండేది. ఆ అనుమానాలకు తెరదించుతూ శేషాచలం అటవీ ప్రాంతం వరకు పెద్దపులి చేరిందని కదిరినాయునిపల్లె సమీపంలో సోమవారం జరిగిన ఘటనతో స్పష్టమైంది.

పెద్దపులి పిల్లలకు వేట నేర్పేందుకు..

- నల్లమలలో ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటుచేసిన అటవీశాఖ



పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో తల్లి నుంచి విడిపోయి తిరుపతి జూ పార్కులో పెరుగుతున్న పెద్దపులి పిల్లలను త్వరలోనే తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేయాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ముందుగా పులిపిల్లలకు తమ ఆహారాన్ని తామే సమకూర్చుకునేలా వేటాడటాన్ని నేర్పించేందుకు చర్యలు చేపట్టింది. సుమారు 14నెలల కిందట నంద్యాల జిల్లా ఆత్మకూరు సమీపంలోని అభయారణ్యంలో తల్లి నుంచి నాలుగు పులి పిల్లలు విడిపోయాయి. వాటిని తిరుపతి జూ పార్కుకు తరలించి సంరక్షిస్తుండగా, ఒకటి మరణించింది. మూడు పెద్ద పులి పిల్లలు పెరిగి పెద్దవుతుండటంతో వాటిని తిరిగి నల్లమల అభయారణ్యంలో వదిలేయాలని అటవీశాఖ నిర్ణయించింది. ముందుగా వాటికి తమ ఆహారాన్ని తాము సమకూర్చుకునేలా వేటాడటం నేర్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా పెద్దపులి పిల్లల సంరక్షణ కోసం నల్లమల అభయారణ్యం కొర్రప్రోలు రేంజి పరిధిలోని పెద్దపెంట వద్ద 15 హెక్టార్లలో ప్రత్యేక ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశారు. కాకినాడలోని నాగార్జున ఫెర్టిలైజర్స్, కెమికల్స్ జూ పార్కు నుంచి గతంలో కొన్ని చారల దుప్పులను తీసుకువచ్చి ఎన్‌క్లోజర్లలో సంరక్షిస్తున్నారు. మళ్లీ ఆదివారం కాకినాడ నుంచి సుమారు 15 చారల దుప్పులు, మరో 28 సాంబార్‌లను నల్లమలకు తరలించారు. వీటిలో పెద్దదోర్నాల రేంజి పరిధిలోని తెట్టగుండం వద్ద ఎన్‌క్లోజర్‌కు 15 చారల దుప్పులు, నెక్కంటి రేంజి పరిధిలోని ఆరపెంటకు 16 సాంబార్‌లు, కొర్రప్రోలు రేంజి పరిధిలోని పెద్దపెంటకు 6 సాంబార్లు, నంద్యాల రేంజి పరిధిలోని పచ్చర్లకు 6 సాంబార్లను ప్రత్యేక వాహనాల్లో తరలించారు. వీటిని కొన్నిరోజులు ఎన్‌క్లోజర్లలో ఉంచిన తర్వాత పెద్దపులి పిల్లలను తీసుకువచ్చి వదులుతారు. పెద్దపులి పిల్లలు వ్యక్తిగతంగా 50 వన్య ప్రాణులను వేటాడిన తర్వాత వాటి శక్తియుక్తులను గుర్తించిన అనంతరం నల్లమల అభయారణ్యంలో వదిలేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఇంకా ప్రారంభమవ్వని ఏకలవ్య స్కూళ్లు

- ఆందోళనలో గిరిజన విద్యార్థులు
- విధుల్లో చేరని ఉత్తరాది రాష్ట్రాల ఉపాధ్యాయులు
- ప్రశ్నార్థకంగా మారిన గెస్ట్ ఉపాధ్యాయుల ఉపాధి



తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగలోని ఏకలవ్య పాఠశాల

పుత్తూరు(తిరుపతి జిల్లా): గిరిజన విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలు ఈ విద్యా సంవత్సరంలో ఇంకా తెరుచుకోలేదు. ఏటా జూన్ 12వ తేదీనే తరగతులు ప్రారంభమయ్యేవి. కానీ ఈసారి స్కూళ్ల ప్రారంభ తేదీపై ఉపాధ్యాయులు సైతం తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా 28 ఉన్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తుండగా.. సీబీఎస్ సిలబస్‌తో పాటు డిజిటల్ తరగతుల వంటి వసతులున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఏకలవ్య పాఠశాలలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 10 వేల మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే 560 మంది స్థానిక గెస్ట్ ఉపాధ్యాయుల ఉపాధి కూడా ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల ఉపాధ్యాయులను ఇక్కడ నియమించడమే ఇందుకు కారణమని ఏకలవ్య పాఠశాలల సిబ్బంది చెబుతున్నారు. ఉత్తరాది ఉపాధ్యాయులు ఇంకా విధుల్లో చేరకపోవడం.. స్థానిక గెస్ట్ ఉపాధ్యాయులను విధులకు రానివ్వకపోవడం వంటి కారణాలతో ఏకలవ్య పాఠశాలలు ఇంకా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఉత్తరాది ఉపాధ్యాయులకు హిందీ తప్ప తెలుగు రాదు. భాష సమస్య వల్ల తమ పిల్లలు నష్టపోయే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు సీబీఎస్ సిలబస్ ఏప్రిల్‌లోనే ప్రారంభం కావాల్సి ఉంది. అయితే పాఠ్యపుస్తకాలు సైతం ఇప్పటికీ పంపిణీ కాలేదు.

రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌లో 'హిందీ' మెలిక

ఏకలవ్య పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకం కోసం గతేడాది డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించింది. నాలుగు సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించగా.. హిందీలో పాస్ మార్కులు వస్తేనే ఇతర సబ్జెక్టుల పేపర్లను కరెక్షన్ చేయాలనే నిబంధనతో తెలుగు వారికి అన్యాయం జరిగిందనే విమర్శలున్నాయి. ఈ నిబంధన వల్ల అత్యధిక సంఖ్యలో ఉత్తరాది రాష్ట్రాల అభ్యర్థులే ఎంపికయ్యారు. అలాగే గతంలో పాఠశాలల ప్రారంభ సమయంలో గెస్ట్ ఉపాధ్యాయులను క్వాలిఫికేషన్ ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించి.. డెమో ఇచ్చిన నియమించారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో తమకు కూడా అన్యాయం జరిగిందని గెస్ట్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటు ఆహారం వృథా.. ఇటు ఆకలి వ్యథ!



- 2022లో ప్రపంచంలో రోజూ 100 కోట్ల మందికి సరిపోయే ఆహారం వృథా
- అదే సమయంలో ఆకలితో అలమటిస్తున్న 78.3 కోట్ల మంది
- ఐక్యరాజ్య సమితి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ రిపోర్ట్–2024 వెల్లడి

సాక్షి, అమరావతి : ఓ వైపు కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే.. మరో వైపు టన్నుల కొద్ది ఆహారం వృథా అవుతుండటంపై ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. 2022లో ప్రపంచవ్యాప్తంగా రోజూ 100 కోట్ల మందికి సరిపోయే ఆహార పదార్థాలు వృథా అయితే.. అదే సమయంలో 78.3 కోట్ల మంది ఆకలితో అలమటించారని యూఎన్ ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ రిపోర్ట్–2024 వెల్లడించింది. ఈ ఏడాది మొత్తం 105 కోట్ల టన్నుల విలువైన ఆహార పదార్థాలు వ్యర్థం అయ్యాయి. సగటున ప్రతి మనిషి 132 కిలోల ఆహారాన్ని వృథా చేశారని, ఇది ప్రతి మనిషీ వినియోగించే ఆహారంలో ఐదో వంతని నివేదిక పేర్కొంది. వృథా అవుతున్న ఆహారంలో అత్యధికంగా 60 శాతం ఇంటి వద్దే జరుగుతున్నట్లు తెలిపింది. ఆహార సేవల వద్ద 28 శాతం, రిటైల్ షాపుల వద్ద మరో 12 శాతం ఆహారం వృథా అవుతోంది. ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఆహార పదార్థాల వృథా అత్యంత ప్రధానమైన అంశమని ఐక్యరాజ్యసమితి స్పష్టం చేసింది. ఈ వృథా కారణంగా పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోందని.. ఏటా 8–10 శాతం కర్బన ఉద్గారాలు పెరుగుతున్నాయని, ఇది ప్రపంచ విమానయాన రంగం విడుదల చేస్తున్న ఉద్గారాల కంటే ఐదు రెట్లు ఎక్కువంది. ఇంతటి కీలకమైన సమస్యపై ప్రపంచ దేశాలు సత్వరం దృష్టి సారించాలని యూఎన్ పిలుపునిచ్చింది. ఆహార ధాన్యాలు, పదార్థాల వృథా ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ లక్ష కోట్ల డాలర్ల సంపదను నష్టపోతున్నట్టు ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది.



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943